


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


నేరాల నియంత్రణకు రాష్ట్రాల మధ్య సమన్వయమే కీలకం

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు

బిసి కులవృత్తులకు ఆధునిక హంగులు

03

సంపుటి 09, సంచిక: 323 | శనివారం | 24-10-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## మాకు మద్దతివ్వండి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సిపిఐకి కాంగ్రెస్ విజ్ఞప్తి
- పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో మఖ్దూంభవన్‌లో సిపిఐ నేతలతో సమావేశమైన కాంగ్రెస్ ప్రతినిధుల బృందం
- పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

ప్రజాపక్షం/హైదరాబాద్

త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని సిపిఐకి కాంగ్రెస్ పార్టీ విజ్ఞప్తి చేసింది. ''హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్ నగర్, నల్లగొండ–ఖమ్మం–వరంగల్'' రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, ఎంపిలు వేం.నరేందర్ రెడ్డి, మల్లు రవి తదితర కాంగ్రెస్ ప్రతినిధుల బృందంహైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు,

తరువాయి 12లో

## జులై వరకూ తాగునీటి ఇబ్బందులు

### ఎల్ నినో కరువును ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి



- రైతులు పంటలు వేసి నష్టపోవద్దు
- ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం
- విద్యుత్ పొదుపు తప్పనిసరి
- సంక్రాంతి నుంచి మే వరకు ప్రజాప్రతినిధుల గ్రామాల బాట
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో రానున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కరువు ప్రారంభంలో దాని తీవ్రత పెద్దగా కనిపించదని, క్రమంగా పరిస్థితి తీవ్రమై తాగునీరు, విద్యుత్, వ్యవసాయం, పశుసంపదపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. వచ్చే ఏడాది జులై వరకు తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని, ప్రజలకు వాస్తవ పరిస్థితులను వివరించాలని, ఏ విషయాన్నీ దాచి పెట్టవద్దని అధికారులను సిఎం ఆదేశించారు. నీరు అందుబాటులో లేకుండా బోర్లకు విద్యుత్ ఇచ్చినా పంటలు పండే పరిస్థితి ఉండదని, రైతులు పెట్టుబడులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని సిఎం స్పష్టం చేశారు. ప్రతి చేతికి పని, ప్రతి ఒక్కరికీ కడుపు నిండా భోజనం అందించడమే ప్రభుత్వ కార్యాచరణ అని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఎల్ నినో ప్రభావం, కరువు నివారణ చర్యలపై టిపిసిసి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, డిసిసిసి అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరయ్యారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులు, కరువు ముప్పును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, విద్యుత్ సరఫరా, తాగునీటి నిర్వహణ, వ్యవసాయం, ఉపాధి హామీ పథకం అమలు తదితర అంశాలపై నాయకులకు సిఎం దిశానిర్దేశం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ '' ఈ ఏడాది

తరువాయి 8లో

### సెప్టెంబర్ నాటికి రాష్ట్ర అప్పుల వార్షిక పరిమితి

## 83.97శాతానికి చేరిక

- రూ.15,096.18 కోట్ల రెవెన్యూ లోటు
- ఆరునెలల్లో 40శాతం మించని ప్రభుత్వ ఆదాయం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై కాగ్ నివేదిక వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర అప్పులు వార్షిక పరిమితి సెప్టెంబర్ నాటికి 83.97 శాతానికి చేరింది. నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు ఆరునెలల్లో ప్రభుత్వ ఆదాయం 40 శాతం కూడా మించ లేదు. సెప్టెంబరు నాటికి రాష్ట్ర రెవెన్యూ లోటు ఏకంగా రూ 15,096.18 కోట్లకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్న రిజిస్ట్రేషన్లు, మద్యం విక్రయాల రాబడులు ఆశించిన స్థాయిలో నమోదవ్వలేదు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రూ 19,540.54 కోట్ల అంచనా వేయగా, సెప్టెంబరు నాటికి రూ 9,033.36 కోట్లు (38.86 శాతం) మాత్రమే వసూలయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం (2025–26) ఇదే నెలలో ఈ శాఖలో 46.23 శాతం రాబడి సాధించింది. ప్రస్తుత ఏడాది వృద్ధి రేటు స్పష్టంగా తగ్గింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపైన కాగ్ 'సెప్టెంబర్ నివేదిక'ను విడుదల చేసింది. ఆరు నెలల్లో రూ.10,470 కోట్ల వసూలు .. ఎక్సైజ్ శాఖ (మద్యం ఆదాయం)బడ్జెట్ రూ. 27,668.48 కోట్లు అంచనలో ఆరు నెలల్లో రూ. 10,470.81 కోట్లుగా (37.84 శాతం) నమోదైంది. అమ్మకపు పన్ను ద్వారా బడ్జెట్ అంచనా రూ 38,105.55 కోట్లకు గాను రూ.18,830.18 కోట్లు (44.65 శాతం) సమకూరింది. జిఎస్‌టి కింద రూ 61,564.92 కోట్ల లక్ష్యానికి గాను రూ 29,565.28 కోట్లు (48.02 శాతం) ఖజానాకు అందింది. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర

తరువాయి 8లో

### ఏదుల రిజర్వాయర్ నుంచి

## డిండికి 0.5 టిఎంసి

### అచ్చంపేట ఎత్తిపోతలకు 0.1 టిఎంసి

- ఎత్తిపోసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి
- ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టిఎంసిల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునేలా చర్యలు చేపట్టాలి
- పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత ఉండదు
- తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై త్వరలోనే మహారాష్ట్రతో చర్చలు
- 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పించేలా వాదనలు
- నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు
- ఈనెల 23 తర్వాత చర్చలకు మహారాష్ట్ర సిఎం సానుకూలత వ్యక్తం చేశారని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టిఎంసిల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టిఎంసిల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టిఎంసిల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా

తరువాయి 12లో

### ప్రభుత్వ నిర్ణయంపట్ల సిపిఐ హర్షం

డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల నుంచి నీటిని లిఫ్ట్ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం పట్ల సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హర్షం వ్యక్తం చేశారు. అత్యంత ఫ్లోరైడ్ పీడిత దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు తాగు, సాగు నీటి కోసం ఉద్దేశించిన డిండి ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం సముచిత నిర్ణయం తీసుకుందన్నారు. ఏడాది క్రితం ఎత్తిపోతల హెడ్ వర్క్స్ కోసం ఖరారైన టెండర్ల పనులను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా చేపట్టి , డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. డిండికి కేటాయించిన 0.5 టిఎంసి నీటిని ఎలాంటి ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకున్నందుకు ప్రభుత్వానికి పల్లా వెంకట్ రెడ్డి, నెల్లికంటి సత్యం అభినందనలు తెలిపారు.



## సిఇసి దిష్టిబొమ్మ దగ్ధం

- జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలి
- 'సర్' ప్రక్రియను నిలిపివేయాలి
- కలెక్టరేట్ల వద్ద ఎస్‌కెఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు

ప్రజాపక్షం/సూర్యాపేట/హైదరాబాద్

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐర్)ను రద్దు చేయాలని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలని, ఆందోళనకారులపై నిర్బంధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సూర్యాపేట కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా సర్‌పై చర్చ కొనసాగుతున్నా ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నా దానిపై ప్రధానమంత్రి కనీసం మాట్లాడకపోవడం సరైంది కాదన్నారు. సర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంపై ఉక్కుపాదం మోపి అనేకమందిపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. ఎంతగా నిర్బంధం ప్రయోగిస్తే ఉద్యమం కూడా అదే స్థాయిలో ముందుకు పోతుందని జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేదాకా ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ ఉద్యమాన్ని పక్కదారి పట్టించడానికి ఉద్యమకారులపై అనేక ఆరోపణలు చేస్తున్నారని దానిని మానుకోవాలని హితవు పలికారు. దేశంలో ఎవరూ మాట్లాడకుండా ప్రజల గొంతు నొక్కుతున్న బిజెపి పాలనకు చరమగీతం పాడేరోజు తొందరలోనే ఉందన్నారు. గతంలో మాదిరిగానే మరణించిన వారి, అడ్రస్సులు మారిన వారిని ఓటర్ లిస్టు నుండి తొలగించాలన్నారు. ఏ ఒక్క పౌరుడు లేక పౌరురాలు ఓటు హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని

తరువాయి 12లో

## ఢిల్లీలో మళ్లీ 'సర్' నిరసనలు

- రైతు సంఘాలు, వామపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల నేతలను అడ్డుకున్న పోలీసులు : తోపులాటలు, ఘర్షణ
- పోలీసుల అదుపులో వందమందికిపైగా నిరసనకారులు
- దేశ రాజధానిలో భద్రత కట్టుదిట్టం
- జ్ఞానేశ్‌ను ఎవరూ కాపాడలేరు, రాజీనామా చేయాల్సిందే : సిపిఐ ఎంపి సందోశ్ కుమార్







**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో మళ్లీ 'సర్' వ్యతిరేక నిరసనలు మొదలయ్యాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, వామపక్ష పార్టీల ప్రతినిధులతో సహా వేలాదిమంది నిరసనకారులు ప్రదర్శన నిర్వహించారు. సెంట్రల్ ఢిల్లీలోని అశోకా రోడ్డులో ఉన్న భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధాన కార్యాలయం వైపు నిరసనకారులు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా ఢిల్లీ పోలీసులు రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసి వంద మందికిపైగా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), 'పీపుల్ ఎగైనెస్ట్ సర్' గ్రూపునకు చెందిన ఢిల్లీ సమన్వయ కమిటీ పిలుపు మేరకు, ఈ ప్రదర్శన ఇసిఐ ప్రధాన కార్యాలయానికి కొన్ని వందల మీటర్ల దూరంలో ఉన్న గోల్ దక్ ఖానా సమీపంలో ప్రారంభమైంది. ర్యాలీగా పాల్గొన్న నిరసనకారులు జాతీయ జెండాను, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బ్యానర్లను ప్రదర్శించారు. బంగ్లా సాహిబ్ గురుద్వారా సమీపంలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి ఈ ప్రదర్శనను అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే బైఠాయించారు. 'సర్' ప్రక్రియ వల్ల ఓటర్ల జాబితా నుంచి అనేక మంది ఓటర్లను తొలగించారని ఆరోపిస్తూ, నిరసనకారులు ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా

తరువాయి 8లో

### కరువు, ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ

- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు
- 31వ తేదీ లోగా రాష్ట్రంలోని కరువు మండలాల ప్రకటన
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

### పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం!

- 42 వేల క్వింటాళ్లు మాయం
- విజిలెన్స్ దాడుల్లో వెలుగు చూసిన వైనం

### గ్రామీణ క్రీడా ప్రతిభకు ఖేలో ఇండియా వేదిక

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జాతీయ స్థాయి పోటీలు : మంత్రి వాకిటి శ్రీహరి

10లో

### నేటి నుంచి 'మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు'

21 రాష్ట్రాల నుంచి మహిళా జర్నలిస్టు ప్రతినిధులు హాజరు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు),మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (మెఫి) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, బేగంపేట 'టూరిజం ప్లాజా'లో ఈ నెల 24, 25 తేదీల్లో (శనివారం, ఆదివారం) రెండు రోజుల పాటు 'మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు' నిర్వహించ నున్నారు. ఈ సదస్సుకు ప్రతినిధులుగా 21 రాష్ట్రాల నుంచి మహిళా జర్నలిస్టులు హాజరు కానున్నారు. శనివారం జరిగే ప్రారంభోత్సవ సదస్సులో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి.రాధారాణి ముఖ్య అతిథిగా హాజరై

తరువాయి 8లో




### ప్రభుత్వ భూములు పరిరక్షిస్తూ

## ఇందిరమ్మ టవర్స్‌కు భూముల గుర్తింపు

- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశం
- క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లకు మూడు విడతల్లో పనులు చేపడతామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

పేదల ఉపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా, వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఒకవైపు

తరువాయి 8లో





# బిజెపి సందిగ్ధావస్థ

బంతిని ఎంతగట్టిగా గోడకేసి కొడితే అది అంతవేగంగా తిరిగివచ్చి విసిరిన వ్యక్తికే తగులుతుందనేది నానుడి. ‘సర్’ పేరుతో ‘ఓట్ చోరీ’కి వ్యతిరేకంగా దేశంలో సాగుతున్న ఉద్యమాన్ని, ముఖ్యంగా బొద్దింకల జనతా పార్టీ ఆందోళనను అణచివేయటానికి నరేంద్రమోదీ ప్రభుత్వం ఎంతగట్టిగా ప్రయత్నిస్తే అది అంతగా విస్తరిస్తున్నది, కొత్త రూపాలు సంతరించుకుంటున్నది, కొత్త తరగతులు చేరుతున్నారు. తాజాగా మేధావులతో పాటు రైతులు చేరారు. ‘నీట్’ ప్రశ్నాపత్రాల లీకేజీకి వ్యతిరేకంగా సిజెపి పిలుపుపై యువత ఆందోళనకు తలొగ్గి విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించిన మోదీ, అమిత్ షాలు – ఆ తర్వాత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. జన్ జీ తరాన్ని బుజ్జగించటం కోసం వారిని ఆకర్షించే భాషలో మాట్లాడారు. పిల్లలకు సుద్దులు చెప్పాలని తల్లిదండ్రులకు హితవులు చెప్పారు. మంత్రులు యూనివర్శిటీలు సందర్శించి విద్యార్థులతో సంభాషణ నిర్వహించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ఆందోళనలో సమీప ఉత్తర రాష్ట్రాల నుంచే యువత విరివిగా పాల్గొన్నారు. పిల్లల ద్వారా తల్లిదండ్రులు ప్రభావితం కావటం సులభం గనుక దాన్ని నివారించి తమ ఓటు బ్యాంక్ కాపాడుకునేందుకు ఆ మార్గం ఎంచుకున్నారు. అదే సమయంలో పట్టభద్రుల్లో నైపుణ్యాభివృద్ధి, ఆన్‌లైన్ కోచింగ్, ఉద్యోగ కల్పన వంటి కార్యక్రమాలు కూడా ప్రకటించారు. ఇంతలో ‘ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ ఎన్నికల కమిషన్‌లో అంతర్గత విభేదాలపై ప్రచురించిన ప్రత్యేక కథనం – 13 కోట్ల ఓట్ల తొలగింపు నేపథ్యం లో సిఇసి జ్ఞానేష్‌కుమార్ ఏకపక్ష నిర్ణయాలు, బిజెపి పట్ల పక్షపాతం వ్యవహారం, మిగతా ఇద్దరు కమిషనర్‌లు గత 10నెలల్లో 18సార్లు అభ్యంతరాలు తెలియజేసినా పట్టించుకోని వైనం ఇండియా కూటమి పార్టీల ‘ఓటు చోరీ’ వ్యతిరేక ఆందోళనకు కొత్త విశ్వసనీయత, వ్యాప్తి కలుగజేసింది. సిజెపి కూడా అదే ఉద్యమం చేబట్టటంతో బిజెపిలో దడపుట్టినట్లు ఆ తదుపరి ప్రభుత్వం చేబట్టిన అణచివేత చర్యలు రూఢి చేస్తున్నాయి. ప్రజల ఆందోళనలకు నిర్దేశిత ప్రదేశంగా ఉన్న జంతర్ మంతర్‌ను, అక్టోబర్ 12న డీ నోటిఫై చేసి మూసివేసి, అధికార కేంద్రానికి బహుదూరంగా రెండు వేర్వేరు ప్రదేశాల్లో ఆందోళన చేసుకో పొమ్మంది. అక్టోబర్ 10న ప్రారంభమైన సిజెపి రెండవ దశ ఆందోళనలో ఢిల్లీ పోలీసులు వేలాదిమందిని అరెస్టు చేశారు, జంతర్ మంతర్ వైపు రోడ్లు బంద్ చేశారు, అన్ని రకాల రవాణా నిలుపు చేయటమేగాక మెట్రోరైళ్లు, రైళ్లు రద్దు చేశారు, ఇంటర్నెట్ బంద్ చేశారు. జంతర్‌మంతర్‌ను తిరిగి అధీనంలోకి తీసుకుంటామని సిజెపి, ఇండియా కూటమి ప్రతినబూనాయి.

అక్టోబర్ 13న జంతర్‌మంతర్ వద్ద త్రివర్ణ జాతీయ పతాకాలను చేబూనినందుకు ముగ్గురు సిజెపి నాయకులను, ఇంకా అనేకమంది ఇతరులను అరెస్టు చేశారు. సిజెపి ముఖ్య నాయకులు సౌరవ్‌దాస్, అశుతోష్ రాంకాలను వారం రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వుపై వారిని 21వ తేదీన బెయిలుపై విడుదల చేసినా, విచారణకు రావాలంటూ పోలీసులు వేధిస్తున్నారు.

‘ఓట్ చోరీ’ వ్యతిరేక ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధిపై ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా చేస్తున్న నిందారోపణలు, ఉపయోగిస్తున్న దిగజారుడు భాష చూస్తుంటే వారిలోని అక్కసును గ్రహించవచ్చు. ప్రధానమంత్రి మోదీ ఎన్‌డిటివి ఏర్పాటు చేసిన వరల్డ్ సమ్మిట్‌లోగురువారం నాడు మాట్లాడుతూ ఉపయోగించిన పదాలు ఆయన స్థాయిని దిగజార్చాయి. ప్రపంచ ప్రతినిధుల సమావేశంలో సాధారణ ఎన్నికల సభ భాషలో మాట్లాడారు. భారతదేశ ప్రతిష్టను కాంగ్రెస్ విదేశాల్లో దిగజార్చుతున్నదన్నారు. దాని నాయకుడు రాహుల్ గాంధిని ఒక ‘విఫలం చెందిన వ్యక్తి’ అని, దేశంలో ‘అశాంతిని స్వప్నిస్తున్నాడని’ నిందించారు. ఆయన, హోంమంత్రి అమిత్ షా అదేరోజు ఢిల్లీలో ఒక సభలో మాట్లాడుతూ, రాహుల్ విదేశీ పర్యటనలను ఎద్దేవా చేశారు. ప్రజలు బిజెపికిచ్చిన తీర్పును మీరు తిరస్కరించలేరంటూ, ఇంకో 30 ఏళ్లు బిజెపిదే అధికారం అంటూ గాంభీర్యం ప్రదర్శించారు. ఇదిలా వుండగా, ప్రజల ఓటు హక్కు రక్షణకై సాగుతున్న ప్రజాస్వామిక ఉద్యమానికి వ్యతిరేకంగా బిజెపి వారం రోజులపాటు దేశవ్యాపిత కార్యక్రమం తలపెట్టటం గర్హించదగింది. అయితే ఈ సమావేశాలు ‘ఓట్‌చోరీ’ వ్యతిరేక ఆందోళన ప్రభావాన్ని తగ్గించలేవు. రాజకీయ పార్టీలు, సిజెపి, ఇతర విద్యార్థి సంఘాల ఆందోళనతోపాటు, మేధావులు, భిన్న పౌర సామాజిక తరగతులతో కూడిన ‘పీపుల్ అగైనెస్ట్ సర్’ అక్టోబర్23(శుక్రవారం)న చేబట్టిన ఆందోళన ప్రాధాన్యత గలది. సిజెపి, ఇండియా కూటమి కూడా ఇందులో పాల్గొన్నాయి. వారి నినాదం ‘హర్ హాత్ మే తిరంగా, హర్ గలీ మే జంతర్ మంతర్’ (ప్రతి చేతిలో జాతీయ జెండా, ప్రతి వీధి జంతర్ మంతర్). నాలుగు ప్రధాన కోర్కెలతో – సిఇసి జ్ఞానేశ్ కుమార్ ను తొలగించాలి, సర్ రద్దు చేయాలి, ఎన్నికల కమిషనర్‌ల నియామకానికి సంబంధించిన 2023 చట్టం రద్దు చేయాలి, పేపర్ బ్యాలెట్ల కు తిరిగి వెళ్లాలి – ఆందోళన కింది స్థాయి వరకు వెళ్లింది. ఉద్యమాన్ని అణచివేసినా లేక ఉపేక్షించినా బిజెపికి రాజకీయంగా నష్టమే. తక్షణం జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి ఎన్నికల కమిషన్‌లో విశ్వసనీయత పునరుద్ధరించటమే ప్రధాని ముందున్న మార్గాంతరం!



## ప్రభుత్వ ప్రాధాన్యత మారడం లేదు

**జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలపై, ముఖ్యంగా చైనా సరిహద్దు పరిస్థితిపై దృష్టి పెట్టడానికి బదులుగా, నిరసనలను అడ్డుకునేందుకు ఢిల్లీలో భద్రతా సిబ్బందిని ప్రభుత్వం మోహరిస్తోంది. సరిహద్దులను రక్షించాల్సిన భద్రతా బలగాలను నిరసనలను అడ్డుకోవడానికి ఢిల్లీలో మోహరిస్తున్నారు. మయన్మార్‌లో ఉగ్రవాదులకు శిక్షణనిస్తున్న అమెరికా పౌరుడు మాథ్యూ వాన్‌వాన్‌డైక్ అంశం ప్రభుత్వానికి ప్రధానం కాదు. ఢిల్లీలో ఎవరూ నిరసనలు చేయకూడదు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ‘సర్’ ప్రక్రియను ప్రశ్నించకూడదు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరుతూ ఢిల్లీలో ఎవరూ గొంతెత్తి అడగకూడదు. దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న సమస్యలేవీ ప్రభుత్వానికి పట్టడం లేదు.**

– అభిజీత్ దీప్కే
కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు




## ఐరాస పేపర్ టైగర్‌గా మారిందా!

2వ ప్రపంచయుద్ధం నేర్పిన గుణపాఠాలను పునాదులుగా చేసుకొని 26 జూన్ 1945 రోజున 51 దేశాలు తీసుకున్న నిర్ణయంతో 24 అక్టోబర్ 1945 రోజున ఐక్యరాజ్యసమితి (ఐరాస) స్థాపించబడే ఒక సంస్థ అనివార్యంగా ఏర్పడింది. ‘యునైటెడ్ నేషన్స్’ అనే పదాన్ని అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ రూపొందించారు. అమెరికాలోకి న్యూయార్క్ ప్రధాన కేంద్రంగా ప్రారంభమైన ఐరాసలో నేడు 193 (రెండు పరిశీలన దేశాలుగా ఉండగా) దేశాలు సభ్యత్వాన్ని కలిగి ఉన్నాయి. స్వతంత్ర దేశాలుగా గుర్తింపు పొందని నార్త్ సైప్రస్, సోమాలిల్యాండ్, అబ్ఖాజియా లాంటి రాజ్యాలకు ఐరాస సభ్యత్వం ఇవ్వలేదు. వాటికన్ సిటీ, పాలస్తీనాలు సభ్యత్వాన్ని పొందలేదు. గత 80 సంవత్సరాలుగా ప్రపంచ దేశాల మధ్య విభేదాలను పరిష్కరించే తటస్థవేదిక రూపంలో మధ్యవర్తిత్వం వహిస్తూ, పలు వివాదాల పరిష్కారానికి నిర్విరామం కృషిచేస్తూ, మానవాళికి కరోనా మహమ్మారి లాంటి ప్రకృతి విపత్తు జరిగినపుడు ప్రజలను చైతన్య పరిచే ఐక్యరాజ్యసమితి ‘ఎనిమిది దశాబ్దాల వ్యవస్థాపక వేడుకలు’ చేసుకుని శతాబ్ది ఉత్సవాల స్థాయికి ఎదగడానికి ఉవ్విళ్లూరుతూ విశ్వ మానవళికి సేవలు అందించడం సంతోషదాయకం. ఐరాస ప్రధాన విధులలో అంతర్జాతీయ శాంతి భద్రతల స్థాపన, దేశాల మధ్య స్నేహబంధాలను నెలకొల్పడం జరుగుతున్నది. దేశాల మధ్య నెలకొన్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మానవీయ సమస్యకు పరిష్కారాలు చూపుతూ, మానవహక్కులను కాపాడుతూ మౌలిక స్వేచ్ఛను కల్పించడం జరుగుతున్నది. విపత్తులు, యుద్ధాలు విజృంభించిన వేళ ప్రజలను జాగృత పరచడం, భూగోళాన్ని పరిరక్షించడం లాంటి ముఖ్యమైన అంశాలలో ప్రపంచ దేశాలను చైతన్య పరచడం జరుగుతున్నది. ఐరాసలో ముఖ్య ఏజన్సీలుగా యునిసెఫ్, ఐఎల్‌ఒ, ఎఫ్ఎఒ, డబ్లుహెచ్‌ఒ, వరల్డ్ బ్యాంక్ లాంటివి తమ విధులను నిర్వహిస్తున్నాయి.

**భారత్‌కు భద్రతామండలిలో చోటు అందని ద్రాక్షేనా!**

అంతర్జాతీయ శాంతి స్థాపనలో ప్రధాన భూమిక నిర్వహిస్తున్న యుఎన్‌ఒ భద్రతా మండలి (సెక్యూరిటీ కౌన్సిల్)లో ఐదు అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, యుకె, ఫ్రాన్స్, చైనాలు శాశ్వత సభ్యులుగా వీటో పవర్‌ను కలిగి ఉంటాయి. భద్రతా మండలిలో మరో 10 దేశాలకు 2 సంవత్సరాల వ్యవధితో వీటోలేని తాత్కాలిక సభ్యత్వాన్ని కల్పిస్తారు. ఇండియా తాత్కాలిక సభ్యత్వ దేశంగా సేవలందించడం జరిగింది. ప్రస్తుత సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ ముఖ్య పరిపాలనాధికారిగా (సిఏఒ) సేవలందిస్తున్నారు. 145 కోట్ల జనాభాతో కూడిన దేశంగా భారత్‌కు భద్రతా మండలిలో చోటు దక్కకపోవడం, చైనా లాంటి దేశాలు అడ్డుపుల్లలు వేయడం విస్మయాన్ని కలిగిస్తున్నది. ఆయుధాలతో అగ్రరాజ్య స్థాయి సాధ్యపడదని, విశ్వమానవాళికి సుఖ సంతోషాలు పంచగలగడమే పెద్దరికం అవుతుందని అగ్ర దేశాలు గుర్తించాలి.

*(24 అక్టోబర్ ఐరాస ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా)*

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

# ప్రజాస్వామ్యం – స్థానిక ప్రభుత్వాలు – ప్రజల భాగస్వామ్యం



తుంగా లక్ష్మీ నారాయణ

ప్రజాస్వామ్యానికి అసలైన పరీక్ష అధికారంలో ఉన్నవారి ప్రవర్తనలోనే ఉంటుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వేచ్ఛ, నిష్పక్షపాతం, పారదర్శకతలను కాపాడటం కేవలం రాష్ట్ర ఎన్నికల సంఘం బాధ్యత మాత్రమే కాదు, అది ప్రభుత్వానికి ఉన్న రాజ్యాంగపరమైన బాధ్యత కూడా. అధికారంలో ఉన్నవారికి ఇది ఒక కీలక పరీక్ష; ఎన్నికల ప్రక్రియలో అక్రమాలను అరికట్టడం, పరిపాలనా యంత్రాంగం తటస్థంగా పనిచేసేలా చూడటం, మరియు అన్ని రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు సమాన అవకాశాలను కల్పించడం ద్వారా వారు తమ నిబద్ధతను నిరూపించుకోవచ్చు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం మాత్రమే కాదు; ప్రజలు తమ ప్రతినిధులను స్వేచ్ఛగా ఎన్నుకోగలిగే వాతావరణం ఉన్నప్పుడే అది నిజంగా పరిఢవిల్లుతుంది.

ప్రాథమిక మౌలిక సదుపాయాల కల్పన, సమగ్ర అభివృద్ధి, స్థానిక ప్రభుత్వాల పాత్ర, పౌరులు ఎదుర్కొంటున్న సమస్యలపై బహిరంగ ప్రజా చర్చను ప్రోత్సహించే పండుగ వాతావరణంలో ఎన్నికలు నిర్వహించబడాలి. స్వయంప్రతిపత్తి గల ఎన్నికల సంఘం దృఢంగా, నిశ్చయంగా నిలబడుతూ, ఒక పటిష్టమైన రాజ్యాంగ సంస్థగా పనిచేయాలి. అధికారంలో ఉన్న, ప్రతిపక్షంలో ఉన్న రాజకీయ నాయకత్వం పరిణతితో వ్యవహరించి, పూర్తి సహకారాన్ని అందించాలి. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, జవాబుదారీగా జరిగిందనే ప్రజల భావనలోనే ఒక విజయవంతమైన ఎన్నికకు నిజమైన కొలమానం ఉంటుంది.

స్థానిక పాలనా సంస్థల ఎన్నికలు నేడు పదవుల అమ్మకం, రాజకీయ బేరసారాలు, 'ఓటు బ్యాంకు' రాజకీయాల కోసం కులమత విభజనలను ప్రేరేపించడం, అలాగే ఆధిపత్యం కోసం హింస, ప్రతీకారం, విధ్వంసానికి పాల్పడటం వంటి దుష్ప్రవృత్తులకు పర్యాయపదాలుగా మారాయి. ఇటువంటి ధోరణులు సామాజిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. గ్రామీణాభివృద్ధి, పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన, స్థానిక సమస్యల పరిష్కారం, పౌరుల క్రియాశీల భాగస్వామ్యం వంటి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రధాన ఎజెండాగా ఎందుకు ఉండటం లేదు? ప్రజాస్వామ్యం అంటే కేవలం ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి, కొందరు వ్యక్తులను అధికార పీఠాలపై కూర్చోబెట్టడం మాత్రమే కాదు. ప్రజలు తమ జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాత్మక ప్రక్రియల్లో నిరంతరం భాగస్వాములు అయినప్పుడు, ప్రభుత్వంలో ఉన్నవారిని జవాబుదారీగా నిలదీసినప్పుడు, తమ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి స్వరూపాన్ని తామే నిర్ణయించుకున్నప్పుడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. గత కొన్ని దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల్లోని స్థానిక సంస్థలను పరిశీలిస్తే, రాజ్యాంగం ఆశించిన ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు, క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులకు మధ్య చాలా పెద్ద అగాధం ఉన్నది.గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థలు ప్రజలకు అత్యంత దగ్గరగా ఉండే ప్రభుత్వ సంస్థలు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారు లు, డ్రైనేజీ వ్యవస్థలు, వీధి దీపాలు, వ్యర్థాల నిర్వహణ, పాఠశాల విద్య, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి నిత్య జీవితానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఈ స్థానిక పాలనా సంస్థలపైనే ఉంటుంది. అయితే, విధానపరమైన చర్చలకు వేదికలు గా ఉండాల్సిన ఈ స్థానిక సంస్థల ఎన్నికలు, రాజకీయ పార్టీల మధ్య ఆధిపత్యం కోసం జరిగే అధికార పోరాటాలుగా మారిపోయాయి. ఇది కేవలం ఎన్నికల ప్రక్రియ లో ఉన్న లోపం మాత్రమే కాదు; స్థానిక ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభానికి స్పష్టమైన నిదర్శనం.

### 73,74వ రాజ్యాంగ సవరణల ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి?:

1992లో ప్రవేశపెట్టబడినఈ సవరణలు, జాతీయ, రాష్ట్ర స్థాయిలలోనే కాకుండా, గ్రామీణ పట్టణ స్థాయిల లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రూపొందించబడ్డాయి. 73వ రాజ్యాంగ సవరణ పంచాయతీ రాజ్ సంస్థలకు, 74వ రాజ్యాంగ సవరణ పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధమైన హోదాను కల్పించి, వాటిని స్థానిక స్వపరిపాలన సంస్థలుగా ఏర్పాటు చేశా యి. 1993 నుండి అమలులోకి వచ్చిన ఈ సవరణల ప్రకారం, స్థానిక సంస్థలకు ప్రతి ఐదేళ్లకోసారి క్రమబద్ధంగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ఎన్నికల సంఘానిది. అంతేకాకుండా, ఆర్థిక వనరుల పంపిణీపై సిఫార్సులు చేయడానికి రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. 73వ సవరణ ద్వారా చేర్చబడిన పదకొండవ షెడ్యూల్‌లో గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 29 అంశాలు ఉండగా, 74వ సవరణ ద్వారా చేర్చబడిన పన్నెండవ షెడ్యూల్‌లో పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన 18 అంశాలు ఉన్నాయి. ఈ అంశాలు వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్యం మరియు పేదరిక నిర్మూలన వంటి వివిధ రంగాలను కలిగి ఉంటాయి. రాజ్యాంగంలోని 243(జి) మరియు 243(డబ్ల్యు) అధికరణాల ప్రకారం, ఈ అంశాలకు సంబంధించి స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను బదలాయించేందుకు రాష్ట్ర శాసనసభలు చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.కేవలం ఈ రాజ్యాంగ సవరణలను చేయడం వల్ల మాత్రమే అధికారాలు, సిబ్బంది మరియు ఆర్థిక వనరులు స్థానిక ప్రభుత్వాలకు స్వయంచాలకంగా బదిలీ కావు.రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అధికారాలను బదలాయించాల్సి ఉంటుంది – ఇదే అసలైన సవాలు. స్థానిక ప్రభుత్వాలకు రాజ్యాంగబద్ధమైన గుర్తింపు లభించినప్పటికీ, అవి స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగల సంస్థలుగా ఎదగడంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కీలకమైనది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బాధ్యత ను చిత్తశుద్ధితో నెరవేర్చకపోవడంతో, రాజ్యాంగ సవరణల వెనుక ఉన్న ఆశయాలు కాగితాలకే పరిమితమయ్యాయి.

> *ప్రతి స్థానిక సంస్థ తన అధికార పరిధిలోని నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా ఒక పంచవర్ష అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి, ఇందులో తక్షణ అవసరాలు, మధ్యకాలిక ప్రాధాన్యతలు, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపాలి. పెరుగుతున్న పట్టణీకరణ, జనాభా పెరుగుదల, కొత్త నివాస ప్రాంతాల ఆవిర్భావం, స్థానిక ప్రభుత్వాల బాధ్యతలు విస్తరిస్తున్నాయి; ఈ పట్టణ విస్తరణకు అనుగుణంగా అభివృద్ధి కూడా సాగాలి.*

ఎన్నికలు అనేవి ఈ ప్రక్రియలో ఒక భాగం మాత్రమే – కానీ అసలైన అధికారం ఎక్కడ ఉంది? స్థానిక ప్రభుత్వాలు బలహీనంగా ఉండటానికి ప్రధాన కారణం అధికార వికేంద్రీకరణ లేకపోవడమే. సర్పంచులు, ఎంపిటిసి, జడ్‌పిటిసి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, చైర్‌పర్సన్లు, మేయర్ల వంటి ఎన్నికైన ప్రతినిధులకు, తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించడాని కి అవసరమైన అధికారాలు, నిధులు మరియు సిబ్బంది లేకపోతే, వారు సమర్థవంతంగా పనిచేయలేరు. రాజ్యాంగంలోని 73, 74వ సవరణల ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని విధులను, నిధులను, సిబ్బందిని స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి. ప్రస్తుత ప్రభుత్వా లు స్థానిక స్వపరిపాలనను ఎంతవరకు బలోపేతం చేశాయో పౌరులు నిరంతరం పర్యవేక్షించాలి.

### గ్రామ సభ

‘గ్రామ సభ’ స్థానిక ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉంటుంది; ఒక గ్రామంలోని ఓటర్లందరూ ఇందులో భాగస్వాములుగా ఉంటారు. గ్రామసభ ద్వారా పౌరులు తమ గ్రామానికి అవసరమైన అంశాలను గుర్తించవచ్చు, అభివృద్ధి ప్రాధాన్యతలను నిర్ణయించవచ్చు, పథకాల అమలును పర్యవేక్షించవచ్చు మరియు స్థానిక ప్రతినిధులను జవాబుదారీగా ఉంచవచ్చు. అదేవిధంగా, పట్టణ ప్రాంతాల్లో కూడా వార్డు స్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా స్థానిక పాలనను బలోపేతం చేయాలి— ఇందులో స్థానిక అవసరాలను గుర్తించడం, బడ్జెట్ ప్రాధాన్యతలపై చర్చించడం వంటివి ఉంటాయి. అయితే, వాస్తవానికి స్థానిక పరిపాలనలో ప్రజలకు ఎటువంటి ప్రత్యక్ష పాత్ర లేదు. ప్రజల భాగస్వామ్యం లేని స్థానిక పాలనను నిజమైన స్వపరిపాలన గా పరిగణించలేము. పంచాయతీలు మరియు మున్సిపాలిటీలు తమ పరిధిలోని సేవలను నిర్వహించడానికి తగిన ఆదాయ వనరులను కలిగి ఉండాలి. స్థానిక పన్నులు, రుసుములు, రాష్ట్ర ప్రభుత్వం నుండి బదిలీ చేయబడిన నిధులు, కేంద్ర ఆర్థిక సంఘం అందించే గ్రాంట్లు, ఇతర ఆదాయ వనరుల మధ్య సరైన సమతుల్యత ఉండాలి.

### మౌలిక సదుపాయాలు ప్రధాన అజెండాగా మారాలి?

గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ సవాళ్లను ఒక స్థానిక ప్రభుత్వం ఎంత సమర్థవంతంగా పరిష్కరిస్తుందనే దానిలోనే ఆ ప్రభుత్వ పనితీరుకు నిజమైన కొలమానం ఉంటుంది. సురక్షితమైన తాగునీటి లభ్యత, చక్కగా నిర్వహించబడే రహదారులు, పారిశుద్ధ్యం, మురుగునీటి వ్యవస్థలు, దోమల నియంత్ర ణ, వర్షపు నీటి పారుదల, వరద నివారణ, సాగునీటి కాలువలపై ఆక్రమణల తొలగింపు, వీధి దీపాలు, పాఠశాలలు, ఆరోగ్య సంరక్షణ సేవలు, పట్టణ ప్రాంతాల్లోని పబ్లిక్ పార్కులు, పేదల కోసం మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ శ్మశానవాటికలు వంటివి కీలక ప్రాధాన్యతలలో ఉన్నాయి. ఈ అంశాలను తమ ఎన్నికల అజెండాలు మరియు ప్రచారాలలో చేర్చడం ద్వారా, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అభివృద్ధిపై కేంద్రీకృతమైన ప్రజా చర్చను ప్రోత్సహించగలరు. ప్రతి స్థానిక సంస్థ తన అధికార పరిధిలోని నిర్దిష్ట అవసరాలకు అనుగుణంగా ఒక పంచవర్ష అభివృద్ధి ప్రణాళికను రూపొందించుకోవాలి, ఇందులో తక్షణ అవసరాలు, మధ్యకాలిక ప్రాధాన్యతలు, దీర్ఘకాలిక అభివృద్ధి లక్ష్యాల మధ్య స్పష్టమైన వ్యత్యాసాన్ని చూపాలి. పెరుగుతున్న పట్టణీకరణ, జనాభా పెరుగుదల, కొత్త నివాస ప్రాంతాల ఆవిర్భావంతో, స్థానిక ప్రభుత్వాల బాధ్యతలు విస్తరిస్తున్నాయి; ఈ పట్టణ విస్తరణకు అనుగుణం గా అభివృద్ధి కూడా సాగాలి. నిర్ణయ ప్రక్రియలో స్థానిక సంస్థలు బలమైన భాగస్వాములుగా వ్యవహరించేందుకు సాధికారత కల్పించకపోతే, సమగ్ర పట్టణాభివృద్ధిని సాధించడం కష్టం. అభ్యర్థులు కేవలం రాజకీయ ఆధిప త్యం కోసం కాకుండా, ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాల ఆధారంగా ఎన్నికలలో పోటీ చేయాలి.

# ఎస్‌బిఐ డేటా లీక్ : ఖాతాదారుల వివరాలకు రక్షణ ఎక్కడ?

3,897 మంది ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం డార్క్ వెబ్‌లో గుర్తింపు.. దర్యాప్తు చేస్తున్న ఎస్‌బీఐ.. ఖాతాదారులకు మాత్రం అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు. అసలు ప్రశ్న ఏమిటంటే.. కస్టమర్ల డేటాను కాపాడాల్సిన బాధ్యత బ్యాంకుదా, లేక తమ సమాచారాన్ని తామే కాపాడుకోవాల్సిన బాధ్యత ఖాతాదారులదా?

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు సంబంధించిన డేటా లీక్ అనుమానాలు బ్యాంకింగ్ వ్యవస్థలో సైబర్ భద్రత, జవాబుదారీతనంపై కీలక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. డార్క్ వెబ్‌లో లభించిన సుమారు 3.75 లక్షల రికార్డులను ప్రాథమికంగా పరిశీలించగా, 3,897 రికార్డుల్లో ఖాతాదారుల వ్యక్తిగత సమాచారం ఉన్నట్లు గుర్తించినట్టు బ్యాంకు వెల్లడించింది.

ఖాతాదారుల పేర్లు, మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీలు, ఈమెయిల్ చిరునామాలు, నివాస చిరునామాలతో పాటు బ్యాంకు శాఖలు, CIF గుర్తింపు సంఖ్యలు, రుణాలకు సంబంధించిన వివరాలు కూడా ఆ రికార్డుల్లో ఉన్నట్లు నివేదిక పేర్కొ ంది.

అక్టోబర్ 16న హెచ్చరికలు అందుకున్న బ్యాంకు దర్యాప్తు ప్రారంభించింది. అక్టోబర్ 21న స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమర్పించిన నివేదికలో ఈ అంశాలను వెల్లడించింది. అయితే, సమాచారం ఎక్కడి నుంచి బయటపడింది, దాని పూర్తి పరిధి ఎంత అనే విషయాలు ఇంకా నిర్ధారణ కాలేదు.

**భద్రత బ్యాంకు బాధ్యత.. అప్రమత్తత మాత్రం ఖాతాదారులకేనా?**

బ్యాంకు ఖాతా తెరవాలంటే ఆధార్, పాన్, చిరునామా, మొబైల్ నంబర్, ఇతర వ్యక్తిగత వివరాలు సమర్పించాల్సిందే. ఖాతాదారుల గుర్తింపును ధ్రువీకరించేందుకు బ్యాంకులు కఠినమైన నిబంధనలు అమలు చేస్తాయి. మరి అదే సమాచారాన్ని భద్రంగా ఉంచడంలో కూడా అంతే కఠినమైన ప్రమాణాలు పాటిస్తున్నాయా?

డేటా లీక్ అనుమానాలు వచ్చినప్పుడు ఖాతాదారులకు సాధారణంగా వినిపించే సూచనలు మాత్రం మారవు: ఒటిపి చెప్పొద్దు, అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయొద్దు, మోసపూరిత కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండండి. ఈ సూచనలు అవసరమే. కానీ వాటితోనే బ్యాంకు బాధ్యత ముగిసిపోదు. ఖాతాదారులు తమ పాస్‌వర్డ్‌ను కాపాడుకోవాలి. మరి ఖాతాదారు ల వ్యక్తిగత సమాచారాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎవరిది? ఈ ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**డేటా లీక్ కాలేదని నిరూపించాల్సిన అవసరం లేదా?**

ప్రస్తుత ఘటనలో సమాచారం నిజమైనదా, ఎక్కడి నుంచి వచ్చింది, ఏ వ్యవస్థ ద్వారా బయటపడింది అనే అంశాలపై ఎస్‌బిఐ దర్యాప్తు చేస్తోంది. కాబట్టి బ్యాంకు నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన జరిగిందని ఇప్పుడే తేల్చడం సరికాదు. అయితే, ఒక పెద్ద బ్యాంకుకు సంబంధించిన ఖాతాదారుల సమాచారం డార్క్ వెబ్‌లో కనిపించిందనే విషయం స్వతంత్రంగా పరిశీలించాల్సిన తీవ్రమైన హెచ్చరిక. కస్టమర్ల నుంచి ప్రతి వివరాన్నీ అడిగే వ్యవస్థలు, తమ వద్ద ఉన్న ఆ వివరాలను ఎవరు యాక్సెస్ చేస్తున్నారు, అవి ఎక్కడ నిల్వ ఉన్నాయి, థర్డ్‌పార్టీ సంస్థలకు ఎంత వరకు అందుబాటులో ఉన్నాయి అనే విషయాల్లోనూ పారదర్శకంగా ఉండాలి. బ్యాంకింగ్‌లో నమ్మకం అనేది ప్రకటనలతో నిలబడదు. డేటా భద్రత, పారదర్శకత, తప్పు జరిగితే బాధ్యత స్వీకరించడంతోనే నిలబడుతుంది.




**డార్క్ వెబ్‌లో సమాచారం.. ఖాతాదారుల ముందుకు మోసగాళ్లు?**

పేరు, ఫోన్ నంబర్, చిరునామా, రుణ వివరాలు వంటి సమాచారం మోసగాళ్ల చేతికి చేరితే, వారు బ్యాంకు అధికారుల్లా నటించడం సులభమవుతుంది. ఖాతాలో సమస్య ఉందని, రుణ దరఖాస్తు నిలిచిపోయిందని లేదా KYC వివరాలను నవీకరించాలని చెప్పి ఖాతాదారులను మోసంచేసే ప్రమాదం ఉం ది.

ఇలాంటి సందర్భాల్లో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి. కానీ వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా ముందస్తు రక్షణ కల్పించడం కూడా బ్యాంకింగ్ వ్యవస్థ బాధ్యతే. సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతుంటే, బ్యాంకుల భద్రతా వ్యవస్థలు కూడా అంతే వేగం గా మెరుగుపడాలి. ఘటన జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాకుండా, ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు ఉండాలి.

**బ్యాంకింగ్ వ్యవస్థపై ఉండాల్సిన కఠినమైన నిబంధనలు**

ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు దర్యాప్తు ప్రకటనతో సరిపెట్టకుండా, బ్యాంకులు తమ భద్రతా వ్యవస్థలపై సమగ్ర సమీక్ష చేపట్టాలి. డేటా లీక్‌కు మూలం ఏమిటి, ఎన్ని రికార్డు లు ప్రభావితమయ్యాయి, ఏ భద్రతా లోపాలు ఉన్నాయి, భవిష్యత్తులో అవి పునరావృతం కాకుండా ఏ చర్యలు తీసుకుంటున్నారు అనే వివరాలను సాధ్యమైనంత పారదర్శకంగా వెల్లడించాలి. బ్యాంకింగ్ వ్యవస్థలో మరింత కఠినమైన సైబర్ భద్రతా ఆడిట్లు, థర్డ్‌పార్టీ సేవలందించే సంస్థలపై సమర్థవంతమైన పర్యవేక్షణ, అవసరానికి మించిన డేటా యాక్సెస్‌పై నియంత్రణ, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణ హెచ్చరికలు తప్పనిసరిగా ఉండాలి.

అలాగే, డేటా ఉల్లంఘన నిర్ధారణ అయినప్పుడు ప్రభావిత ఖాతాదారులకు సకాలంలో సమాచారం అందించడం, మోసాల ప్రమాదాన్ని తగ్గించేందుకు అవసరమైన సహాయం అందించడం, సంబంధిత నియంత్రణ సంస్థలకు నివేదించడం వంటి చర్యలకు స్పష్టమైన జవాబుదారీతనం ఉండాలి. నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే, వర్తించే చట్టాలు, నియంత్రణ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సంబంధిత నియంత్రణ సంస్థలు కూడా ఈ తరహా ఘటనల్లో భద్రతా ప్రమాణాల అమలు, నివేదికల సమర్పణ, దిద్దుబాటు చర్యలు, అవసరమైన చోట జరిమానాల విషయంలో కఠినంగా వ్యవహరించాలి.

ఎస్‌బిఐ ప్రకారం, ఈ ఘటన వల్ల బ్యాంకు ప్రధాన కార్యకలాపాలకు గణనీయమైన అంతరాయం కలగలేదు. అయితే, సేవలు సాధారణంగా కొనసాగుతున్నాయన్న విషయం ఒక్కటే కస్టమర్ల డేటా భద్రతపై ఉన్న ప్రశ్నలకు సమాధానం కాదు. బ్యాంకు దర్యాప్తు పూర్తి చేసి, సమాచారం ఎక్కడి నుంచి బయటపడిందో, ఎన్ని మంది ఖాతాదారులు ప్రభావితమయ్యే అవకాశం ఉందో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఏ చర్యలు తీసుకుంటుందో స్పష్టంగా తెలియజేయాలి.

ఖాతాదారుల నుంచి నమ్మకాన్ని కోరే బ్యాంకింగ్ వ్యవస్థ, ఆ నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యతను కూడా సమానంగా తీసుకోవాలి. డిజిటల్ బ్యాంకింగ్ యుగంలో భద్రత అనేది అదనపు సౌకర్యం కాదు. అది బ్యాంకింగ్ సేవలో అంతర్భాగం.

డా. ముచ్చుకోట సురేష్ బాబు, 9989988912

# నేరాల నియంత్రణకు రాష్ట్రాల మధ్య సమన్వయమే కీలకం

- సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై సమష్టి పోరు సాగించాలి
- పోలీసు సంస్కరణలు నిరంతరం కొనసాగాలి
- ఎస్ఆర్‌పిసిసి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో నిరంతరం సంస్కరణలు చేపట్టాలని, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణకు ప్రాధాన్యమిస్తూ ప్రజలకు సమర్థవంతమైన, నిష్పక్షపాతమైన పోలీసు సేవలు అందించాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు విభాగాల మధ్య సరిహద్దులు దాటి సహకారాన్ని పెంపొందించేందుకు పటిష్ఠమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ కమిటీ (ఎస్ఆర్‌పిసిసి) సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. సమాజంలో భద్రత, రక్షణకు పోలీసు వ్యవస్థ పునాది వంటిదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖకు అందించే వనరులను ఖర్చుగా కాకుండా మెరుగైన సమాజ నిర్మాణానికి చేసే పెట్టుబడిగా భావిస్తున్నట్లు తెలిపారు. నేరాల నియంత్రణలో ఒక్క రాష్ట్రం చేసే ప్రయత్నాలు మాత్రమే సరిపోవని, రాష్ట్రాల పోలీసు విభాగాలు, ప్రత్యేక దర్యాప్తు సంస్థల మధ్య సమన్వయం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. ఎస్ఆర్‌పిసిసి వంటి వేదికలు ఉమ్మడి సమస్యలపై చర్చించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ పోలీసు శాఖ నేరాల నియంత్రణలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాని నిర్వహించిన ప్రగతి సమీక్ష సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. రాష్ట్రాన్ని నక్సల్స్ రహితంగా మార్చేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగిల్ విభాగం కేంద్ర ప్రభుత్వ అంచనాల్లో 80 శాతానికి పైగా మార్కులు సాధించిందని పేర్కొన్నారు. ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణను పటిష్ఠం చేయడం కోసం వివిధ విభాగాల ప్రయత్నాలను సమన్వయం చేసేందుకు అమెరికా ఎఫ్‌డీఏ తరహాలో టిజిసేఫ్ వ్యవస్థను ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. చెరువులు, సరస్సులు, ఇతర జలవనరుల పరిరక్షణ, పునరుద్ధరణతో పాటు ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడటంలో హైడ్రా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. విధినిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా నిలిచేందుకు, వారి హోదా, సర్వీసును బట్టి కనీసం రూ.కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు వెల్లడించారు.

**సరిహద్దులు దాటి సహకారం పెరగాలి..**

దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రాల పోలీసు ప్రధాన కార్యాలయాల మధ్య సమాచార మార్పిడి, సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అంతర్రాష్ట్ర నేరగాళ్ల కదలికలు, సైబర్ నేరాల నెట్‌వర్క్‌లు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి అంశాలపై సమష్టి కార్యాచరణ అవసరమని సూచించారు. పొరుగు రాష్ట్రాలతో సాంకేతిక మౌలిక సదుపాయాలను, సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థను పంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి డిజిపిలు సి.వి.ఆనంద్, ఎం.ఎ.సలీమ్, డాక్టర్ మహేష్ అగర్వాల్, పుదుచ్చేరి షాలిని సింగ్,లక్షద్వీప్ ఎడిజి బి.శంకర్ జైస్వాల్, కేరళ ఐజి అజీతా బేగం, ఆంధ్రప్రదేశ్ ఐజిపి రవి కృష్ణ, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిష్త్, లా అండ్ ఆర్డర్ డిజి మహేష్ భగవత్, సిఐడి డిజి చారు సిన్హా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ,ఆపరేషన్స్ విభాగం డిజి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ల జాబితా సందేహాలు నివృత్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సిపిఐ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో గైర్హాజరు, ఇల్లు మారిన, మరణించిన, రెండుసార్లు నమోదైన ఓట్ల (ఎఎస్‌డిడి) తొలగింపుపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. తొలగించిన విదేశీయుల ఓట్ల వివరాలను దేశాల వారీగా వెల్లడించాలని, ఆశా, అంగన్‌వాడి కార్యకర్తలపై బూత్ స్థాయి అధికారి (బిఎల్‌ఓ) విధుల పనిభారాన్ని తగ్గించాలని కోరింది. ఈ మేరకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి. నరసింహ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి కాసం వెంకటేశ్వర్ రెడ్డిలను కలిసి వినతిపత్రం సమర్పించింది. తమ పార్టీ దృష్టికి వచ్చిన అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అనంతరం ఈ.టి. నరసింహ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 2,64,87,213 మంది ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించారని తమకు తెలిసిందన్నారు. అలాగే ఎఎస్‌డిడి కేటగిరీ కింద సుమారు 73,39,235 మంది ఓటర్ల పేర్లను ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించారన్నారు. ఈ తొలగింపులపై తమకు కొన్ని సందేహాలున్నాయన్నారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు, పాకిస్థానీయులు వంటి విదేశీయులకు చెందిన ఎన్ని ఓట్లు తొలగించారో వెల్లడించాలన్నారు. గైర్హాజరైన లేదా వలస వెళ్లిన ఓటర్ల పేర్లను తిరిగి జాబితాలో చేర్చేందుకు భారత ఎన్నికల సంఘం ఎలాంటి చర్యలు తీసుకుందో తెలపాలని ఈ.టి డిమాండ్ చేశారు. మరణించినవారి పేర్లు, రెండుసార్లు నమోదైన ఓట్లను తొలగించడం సరైన చర్యేనని, గైర్హాజరైనవారు, వలస వెళ్లినవారి విషయంలో మాత్రం బిఎల్‌ఓలు సంబంధిత ఇళ్లను మరోసారి సందర్శించి, సరైన విచారణ జరిపి, అర్హులైన వారి పేర్లను తిరిగి చేర్చేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఇలాంటి తొలగింపులు ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల భాగస్వామ్యాన్ని దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్‌వాడి, ఆశా కార్యకర్తలు బిఎల్‌ఓలుగా విధులు నిర్వహిస్తూ తీవ్ర పనిభారాన్ని ఎదుర్కొంటున్నారని ఈ.టి తెలిపారు. వారు అదే సమయంలో ప్రజారోగ్యం, శిశు సంరక్షణ వంటి బాధ్యతలను కూడా నిర్వర్తించాల్సి వస్తోందని, అందువల్ల వారిపై ఉన్న అదనపు పనిభారాన్ని తగ్గించాలని ఎన్నికల అధికారిని కోరారు. సిఈఓను కలిసిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్. బోస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్. ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ ఉన్నారు.

# గత పదేళ్లలో బలహీనంగా మారిన బిజెపి



- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్, బిజెపియేతర రాజకీయ పార్టీలు దేశంలో కీలకం కాబోతున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి. రామారావు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాదని, దేశంలో కూడా కెసిఆర్ కీలకమయ్యే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. గత పదేళ్ల కాలంలో ఎప్పుడూ లేనంతగా బిజెపి దేశవ్యాప్తంగా బలహీనంగా మారిందని చెప్పారు. దేశంలో కాంగ్రెస్ విఫలమైందని, అందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై సిజెపి పేరుతో యువత పోరాటం చేస్తోందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం నాయకులతో కెటిఆర్ శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉన్నదని, అందుకే సిఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎంపిటిసి, జెడ్‌పిటిసి, కార్పొరేషన్ ఎన్నికలు పెట్టే ధైర్యం చేయడం లేదని ఆరోపించారు. పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచి ఎన్నికల వరకు అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. మేడిగడ్డ బ్యారేజీ కూలిపోయిందని తప్పుడు ప్రచారం చేశారని, దీనిని కాంగ్రెస్ వాళ్లే కూల్చారని ఆరోపించారు. కెసిఆర్‌పైన విమర్శలు చేసే అంశంలో కాంగ్రెస్, బిజెపి రెండు ఒక్కటవుతాయన్నారు.

# బిసి కులవృత్తులకు ఆధునిక హంగులు



- స్థిరమైన ఆదాయమే లక్ష్యం: రాష్ట్ర బిసి కమిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వెనుకబడిన తరగతుల సంప్రదాయ కులవృత్తులను ఆధునికీకరించి, వాటి ద్వారా స్థిరమైన ఆదాయ మార్గాలను కల్పించడంపై తెలంగాణ బిసి కమిషన్ దృష్టి సారించింది. ఇందుకోసం వివిధ కులవృత్తుల్లో అమలవుతున్న ప్రగతిశీల విధానాలను క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని నిర్ణయించింది. బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మి రంగు, కమిషన్ మెంబర్ సెక్రటరీ బి. బాల మాయాదేవి పాల్గొన్నారు. బిసి సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ కుల కార్పొరేషన్లు, ఫెడరేషన్ల అధికారులతో సంప్రదాయ వృత్తుల ఆధునికీకరణ, ఆదాయ వృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వివిధ కులవృత్తుల అభివృద్ధికి ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, భవిష్యత్తులో అమలు చేయాల్సిన చర్యలపై అధికారులు కమిషన్‌కు వివరించారు. సంప్రదాయ వృత్తులను మరింత అభివృద్ధి చేసి, వాటిని ఆర్థికంగా లాభదాయకంగా మార్చేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న నూతన విధానాలను పరిశీలించాలని కమిషన్ నిర్ణయించింది. అవసరమైతే ఇతర దేశాల్లో అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను కూడా అధ్యయనం చేయనుంది. ఈ అంశంపై సంబంధిత అధికారులు, సంస్థలతో చర్చలు జరపడంతోపాటు వివిధ కుల సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని నిర్ణయించింది. క్షేత్రస్థాయి పరిశీలన, నూతన విధానాల అధ్యయనం ద్వారా సంప్రదాయ వృత్తులకు మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా చర్యలు చేపట్టనుంది. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ సీనియర్ అధికారులు కె.అలోక్ కుమార్, డాక్టర్ మల్లయ్య బట్టు, ఎం. ఇందిర, డి.శ్రీనివాస్ రెడ్డి, ఉదయ్ ప్రకాష్, డా.మామిడి హరికృష్ణతో పాటు కమిషన్ స్పెషల్ ఆఫీసర్ ఎన్.సునీత, సెక్షన్ ఆఫీసర్లు ఇర్ఫాన్ బిన్ ఖలీద్, జి.సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి.లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు

- పరిశ్రమల అభివృద్ధితో పాటు కార్మిక సంక్షేమం ముఖ్యం: మంత్రి వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. హమాలీ, డొమెస్టిక్ వర్కర్ల కోసం వేర్వేరుగా సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి చట్టపరమైన చర్యలు చేపట్టామని, సంబంధిత నిబంధనలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన 'సోషల్ డెమోక్రసీ, పొలిటికల్ లీడర్‌షిప్ అండ్ ట్రేడ్ యూనియన్స్' సదస్సులో మంత్రి ప్రసంగించారు. దేశంలో సుమారు 93 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని, వారికి తగిన ప్రాతినిధ్యం, సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బలమైన కార్మిక సంఘాలు, బాధ్యతాయుతమైన రాజకీయ నాయకత్వం, న్యాయమైన వేతనాలతోనే సమ్మిళిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల భద్రతను విస్మరించరాదని వివేక్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే యువతలో నైపుణ్యాలను పెంపొందించడం కీలకమని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ఐటిఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. కార్మికుల హక్కులను పరిరక్షిస్తూ పరిశ్రమల అభివృద్ధికి దోహదపడే సంస్కరణలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, మాజీ ఎంపి ఖుంటియా, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో కొత్త జాబ్ కార్డుల మంజూరు

- ప్రతి కుటుంబానికి 125 రోజుల ఉపాధి హామీ
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్ డి.దివ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, గిరిజన ప్రాంతాల నుంచి వలసలను నిరోధించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంతరించిపోతున్న ఆదిమ తెగలు (పివిటిజి), ఇతర గిరిజన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్తగా గ్రామీణ్ రోజ్‌గార్ గ్యారంటీ (జాబ్) కార్డులను మంజూరు చేయాలని పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశించింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ డి.దివ్య మార్గదర్శకాలతో కూడిన సర్క్యులర్‌ను జారీ చేశారు. గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో చట్టప్రకారం ప్రతి కుటుంబానికి 125 రోజుల పని కల్పించి, కరువు పరిస్థితుల నుంచి ఉపశమనం అందించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని పంచాయత్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది. అలాగే కుటుంబంలో 18 సంవత్సరాల వయస్సు నిండిన వయోజనులందరి పేర్లను వారి పాత జాబ్ కార్డులలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. సాంకేతిక కారణాలు లేదా పొరపాట్ల వల్ల జాబ్ కార్డులలో వివరాలు తప్పుగా నమోదై ఉంటే, ప్రత్యేక క్యాంపులు నిర్వహించి, యుద్ధ ప్రాతిపదికన వాటిని సరిచేయాలని స్పష్టం చేశారు. ఈ పథకాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని, రాష్ట్రంలోని 31 జిల్లాల కలెక్టర్లు, ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, జెడ్‌పి సిఈఓలు, ఆర్‌డిఓ, జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. అక్టోబర్ 15న జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఉపాధి లేని కుటుంబాలను గుర్తించి, క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా త్వరితగతిన కొత్త జాబ్ కార్డులు అందజేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

# 'బిసి ఎ'లోని 68 కులాలకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'బిసి ఎ' గ్రూపులోని 68 కులాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర అభివృద్ధి సంస్థ కోరింది. గతంలో వివిధ కమిషన్లు సమర్పించిన నివేదికలతో పాటు ప్రస్తుత కులగణన నివేదికను పరిశీలించి, బిసి ఎలో ఇతర కులాలను చేర్చే విషయంలో తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ నెల 22న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగంపై సంస్థ హర్షం వ్యక్తం చేసింది. గంగపుత్రులను సంప్రదించి, వారిని కలుపుకొని ముందుకు వెళ్లాలని ముదిరాజులకు సిఎం సూచించడం అభినందనీయమని పేర్కొంది. జన్మతః గంగపుత్రులైన బెస్తలతో పాటు బిసిఎలోని 68 కులాలు ఇప్పటికీ ఆర్థికంగా, సామాజికంగా, ఉద్యోగ రంగంలో వెనుకబడి ఉన్నాయని సంస్థ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ వర్గాల్లో ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పిటిసిలు, సర్పంచులుగా ప్రాతినిధ్యం లేని కులాలు అనేకం ఉన్నాయని తెలిపింది. బిసిఎలోని వెనుకబడిన కులాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి తక్షణ చర్యలు తీసుకోవాలని పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. సమావేశంలో గాలి సత్యనారాయణ, పి.మహిపాల్, ఏర్వ వెంకటేశం ప్రసంగించారు.

# తెలంగాణ బార్ కౌన్సిల్ కమిటీలపై స్టే

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఏకపక్షంగా కమిటీలను ఏర్పాటు చేయడం, ఈ నెల 11న జరిగిన జనరల్ బాడీ సమావేశం మినిట్స్‌లో సభ్యుల అభ్యంతరాలు, అసమ్మతి అభిప్రాయాలను సక్రమంగా నమోదు చేయలేదన్న ఫిర్యాదులపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఈ నెల 23న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీల ఏర్పాటు, జనరల్ బాడీ సమావేశాల నిర్వహణ అడ్వకేట్స్ చట్టం–1961లోని నిబంధనలకు అనుగుణంగా జరగాలని స్పష్టం చేసింది. కౌన్సిల్ ఎన్నిక లేదా కోఆప్షన్ ద్వారా నిర్ణయం తీసుకోవాల్సిన అంశా ల్లో చైర్మన్ ఒక్కరే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడానికి వీల్లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో వివాదాస్పద కమిటీల ఏర్పాటు, పునర్వ్యవస్థీకరణకు సంబంధించి ఆర్‌టీసీ నంబర్ 510/2026పై మధ్యంతర స్టే విధించింది. న్యాయ విద్య పూర్తి చేసిన గ్రాడ్యుయేట్ల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియకు ఆటంకం కలగకుండా కొనసాగించేందుకు తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్, వైస్ ప్రెసిడెంట్, తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడితో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారంపై తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్, కార్యదర్శి తమ వివరణలతోపాటు సంబంధిత రికార్డులను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆదేశించింది. పారదర్శకత, సమావేశాల మినిట్స్ సక్రమ నమోదు, చట్ట నిబంధనల అమలు, న్యాయవాదుల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారిక సమాచార నోట్‌లో పేర్కొన్నారు. తదుపరి విచారణ వాయిదా వేసింది.

# ఎల్ నినో సవాళ్లపై ప్రజా చైతన్యం..



ఎం.కిరణ్మయి
పిఆర్‌ఒ, సమాచార, పౌరసంబంధాల శాఖ, హైదరాబాద్

**ఐ అండ్ పిఆర్–సాంస్కృతిక శాఖ ప్రత్యేక కార్యాచరణ**

**సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా ప్రజల్లో అవగాహన**

**జల సంరక్షణ, విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వ విస్తృత ప్రచారం**

వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, ప్రకృతి వనరుల సంరక్షణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. వర్షపాతం లోటు, నీటి వనరులపై పెరుగుతున్న ఒత్తిడి, అధిక ఉష్ణోగ్రతలు వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలు చర్యలు చేపడుతుండగా, ఈ అంశాలపై ప్రజలకు సమాచారాన్ని చేరవేసి, వారిని కార్యాచరణలో భాగస్వాములను చేయడంలో సమాచార, పౌరసంబంధాల శాఖ (ఐ అండ్ పిఆర్), తెలంగాణ సాంస్కృతిక శాఖ కీలకపాత్ర పోషించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వివిధ శాఖలు చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహిస్తూనే, ప్రజల్లో అవగాహన పెంపొందించే కార్యక్రమాలపైనా దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా ఎల్‌నినో ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థాయి వరకు విస్తృత ప్రచారం నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రవీంద్రభారతిలో సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక సారథి కళాకారులకు ఎల్ నినో ప్రభావాలు, ప్రజలకు తెలియజేయాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పౌరసంబంధాల అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రచార కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లనున్నారు.

**ప్రజల భాషలో ప్రభుత్వ సందేశాలు**

ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, నిపుణుల సూచనలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను సరళమైన భాషలో ప్రజలకు చేరవేయడం ఐ అండ్ పిఆర్ శాఖ లక్ష్యం. ఈ దిశగా సాంస్కృతిక సారథి కళాకారుల సృజనాత్మకతను ప్రజా చైతన్యానికి అనుసంధానించనున్నారు. స్థానిక భాష, జానపద బాణీలు, ప్రజలకు పరిచయమైన కళారూపాల ద్వారా క్లిష్టమైన అంశాలను సులభంగా వివరించి, ప్రజలు తమ దైనందిన జీవితంలో ఆచరించగలిగే మార్పులపై అవగాహన కల్పించనున్నారు.

**ప్రజా చైతన్యానికి జానపద పాటే శక్తివంతమైన సాధనం**

తెలంగాణ ప్రజా ఉద్యమాల చరిత్రలో జానపద పాటలకు విశిష్ట స్థానం ఉంది. సామాజిక మార్పు, ప్రజా చైతన్యంలో పాటలు కీలక పాత్ర పోషించాయి. సుదీర్ఘంగా వివరించాల్సిన అంశాన్ని సరళమైన పదాలతో ప్రజల మనసుల్లో నిలిపే శక్తి పాటకు ఉంది.

ఇప్పటికే ప్రభుత్వ పథకాలు, సామాజిక అంశాలపై గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్న కళాబృందాల ద్వారా ఎల్ నినో ప్రభావాలు, జల సంరక్షణ, విద్యుత్ పొదుపు, పర్యావరణ పరిరక్షణ, వేసవి జాగ్రత్తలపై అవగాహన గేయాలు రూపొందించి ప్రజలను చైతన్యపరచనున్నారు. ఈ గేయాలు, ప్రదర్శనలకు తోడు వీడియోలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా ప్రచారాన్ని విస్తరించనున్నారు.

**జల సంరక్షణ, విద్యుత్ పొదుపుపై అవగాహన**

వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి నిల్వల తగ్గుదల, భూగర్భ జలాల క్షీణత నేపథ్యంలో నీటిని పొదుపుగా వినియోగించడం అత్యవసరం. నల్లాల లీకేజీలను అరికట్టడం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడం, చెరువులు–కుంటలను పరిరక్షించడం వంటి చర్యల ప్రాముఖ్యతను కళాకారులు ప్రజలకు వివరించనున్నారు. వ్యవసాయం, పశుపోషణ, మత్స్య సంపదకు నీటి వనరులు ఎంత కీలకమో తెలియజేస్తూ, నీటి సంరక్షణను ప్రజల దైనందిన జీవితంలో భాగం చేయడంపై దృష్టి సారించనున్నారు.

అదేవిధంగా, అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఎయిర్ కండిషనర్లను ఆపివేయడం, విద్యుత్ పరికరాలను అవసరమైనప్పుడే వినియోగించడం వంటి పొదుపు అలవాట్లను ప్రోత్సహించనున్నారు.

**వేసవి జాగ్రత్తలపై ముందస్తు అవగాహన**

ఎల్ నినో ప్రభావాల నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతలు, వడదెబ్బ ప్రమాదాలు, నీటి కొరత వంటి అంశాలపై ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించనున్నారు. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో అనవసరంగా బయటకు వెళ్లకపోవడం, తగినంత నీరు తాగడం, వృద్ధులు, చిన్నారులు, బయట పనిచేసే కార్మికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం వంటి జాగ్రత్తలను సంబంధిత శాఖల సూచనల ఆధారంగా ప్రజలకు తెలియజేయనున్నారు.

**ప్రకృతి పరిరక్షణ.. ప్రతి పౌరుడి బాధ్యత**

ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ప్రజల భాగస్వామ్యంతో మరింత సమర్థంగా అమలవుతాయి. ఈ దిశగా ఐ అండ్ పిఆర్ శాఖ సమాచార ప్రచారాన్ని సమన్వయం చేస్తూ, సాంస్కృతిక సారథి కళాకారుల ద్వారా ప్రభుత్వ సందేశాలను ప్రజలకు చేరవ చేయనుంది. జిల్లా పౌరసంబంధాల అధికారుల పర్యవేక్షణలో చేపట్టే ఈ కార్యక్రమాలకు సంప్రదాయ కళారూపాలు, ఆధునిక సామాజిక మాధ్యమాలను జోడించడం ద్వారా విస్తృత ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించనున్నారు.

నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, ప్రకృతి వనరుల పరిరక్షణ అనేవి కేవలం ప్రభుత్వానికో, అధికారులకో పరిమితమైన బాధ్యతలు కావు. పౌరులుగా మనందరి బాధ్యత. ప్రతి నీటి చుక్కను కాపాడటం, అవసరమైనంత విద్యుత్‌నే వినియోగించడం, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటం ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలి. ప్రభుత్వ ప్రయత్నాలకు ప్రజల సహకారం తోడైతే ఎల్ నినో ప్రభావాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, వాటి దుష్ప్రభావాలను తగ్గించేందుకు మరింత బలమైన పునాది ఏర్పడుతుంది.

**గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25-సంతోష్‌నగర్, చార్మినార్ జోన్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు – నిర్వహణ పనులు

| NIT No. | పని పేరు | అంచనా విలువ | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 15/EE-25/ CRZ/ GHMC /2026-27 | క్ర.సం. 01 నుండి 04 వరకు | రూ. 54.90 లక్షలు | డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 24.10.2026 ఉ.11.30గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ: 02.11.2026 మ.03.00గం.ల వరకు | శ్రీ ఆర్.యాదగిరి, ఇఇ, సర్కిల్-25, చార్మినార్ జోన్, మస్కతి గ్రాండ్, దరబ్ జంగ్ కాలనీ, సంతోష్ నగర్, హైదరాబాద్. ఫోన్ నెం. 9030478364 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 25-సంతోష్‌నగర్, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 12291-PP/CL/ADVT/2026-27, Date: 23-10-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

| NIT No. | పని పేరు | అంచనా విలువ లక్షల రూ.లలో | ప్రారంభ తేది & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| 23/DB/EE-II/ Alwal Circle/ MMC/ 2026-27, తేది: 23.10.2026 | అల్వాల్ సర్కిల్-2లో Entomology నిర్వహణ కోసం Entomology కార్మికులకు అందించడానికి సామగ్రి సేకరణ, 01-10-2026 నుండి 31.03.2027 వరకు (6) నెలల పాటు పూర్తవుతుంది. | 11,82,933.00 | 23.10.2026 మ.02.00 గం.లకు | 27.10.2026 మ.02.00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, అల్వాల్ సర్కిల్-2, ఎంఎంసి.
DIPR R.O. No. : 12294-PP/CL/ADVT/2026-27, Date: 23-10-2026

**తూప్రాన్ పురపాలక సంఘం కార్యాలయం, మెదక్ జిల్లా.**
ఇ-మెయిల్: municipalitytoopran@gmail.com
సంప్రదించవలసిన నెం. 9849588039 / 7331189478 / 9866296751
లేఖ నెం. E1/44/2026 ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తేదీ: 22.10.2026

ఘన వ్యర్థాల నిర్వహణ కింద యంత్రాల ఆపరేషన్ & నిర్వహణ కొరకు 2 సంవత్సరాల కాలానికి ఒక ఏజెన్సీని నియమించడం వంటి సారూప్య రకాల పనులలో అనుభవం ఉన్నవారి నుండి ఈ క్రింద సంతకం చేసిన వారిచే ఈ క్రింది పనుల కోసం సీల్డ్ కవర్లలో ఆసక్తి వ్యక్తీకరణ (EOI) ఆహ్వానించడమైనది. పేరున్న ఏజెన్సీలు/ సంస్థలు/ కాంట్రాక్టర్లు/ వ్యాపారుల నుండి సీల్డ్ కొటేషన్లను స్వీకరించి, తూప్రాన్ పురపాలక సంఘానికి అవసరమైన భావనలతో పాటు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలి. తూప్రాన్ మున్సిపాలిటీ ద్వారా మంజూరు చేయబడిన పురపాలక సాధారణ నిధి/ SFC కింద మున్సిపల్ కమిషనర్ / ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కంటే తక్కువ హోదా లేని అధికారి జారీ చేసిన సారూప్య స్వభావం గల పనికి సంబంధించిన అనుభవ ధృవీకరణ పత్రం కూడా జతచేయాలి.

| | | | |
|---|---|---|---|
| 1 | కొటేషన్ బిడ్ పత్రాల సమర్పణ ప్రారంభ తేదీ | 24/10/2026 | 11.25 AM |
| 2 | కొటేషన్ బిడ్ పత్రాల చివరి తేదీ | 27/10/2026 | 3.10 PM |
| 3 | బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం | 27/10/2026 | 3.25 PM |
| 4 | కొటేషన్ బిడ్ ప్రారంభ తేదీ (ఫైనాన్షియల్ బిడ్ దశ) | 27/10/2026 | 3.40 PM |

మరిన్ని వివరాలు మరియు వివరణల కోసం, అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో తూప్రాన్ మున్సిపాలిటీ కమిషనర్ లేదా మున్సిపల్ ఇంజనీర్‌ను సంప్రదించవచ్చు.
సం/- మున్సిపల్ కమిషనర్ తూప్రాన్ మున్సిపాలిటీ
DIPR R.O. No. : 12265-PP/CL/ADVT/2026-27, Date: 23-10-2026

## ప్రభుత్వ ఆటస్థలంలో అక్రమ నిర్మాణం ఆపాలి



**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని ల్యాగలమర్రి గ్రామ ఎస్సి కాలనీలో ప్రభుత్వ ఆటస్థలంలో చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.శుక్రవారం పెగడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ గ్రామంలోని 6వ సర్వే నంబరులో ఉన్న ప్రభుత్వ ఆటస్థలంలో కల్లేపల్లి జ్యోతి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గత రెండేళ్లుగా ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.సర్వే నంబర్లకు సంబంధించిన పత్రాల్లో అవకతవకలు ఉన్నాయని ఆరోపిస్తూ, భూమి రికార్డులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణానికి సహకరిస్తున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కుమారస్వామి,ఆర్ఐ జమున ధర్నా స్థలానికి చేరుకుని ఆర్‌డిఒ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ధర్నా విరమించారు.కాలనీ సంఘ సభ్యులు,మహిళలు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాలకు సుస్థిర వ్యవసాయం అందిద్దాం



**ప్రజాపక్షం/గజ్వేల్:** భవిష్యత్తు తరాలకు సుస్థిర వ్యవసాయం అందించే క్రమంలో శుక్రవారం దాచారంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ సాగు భూమి సంరక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గజ్వేల్ వ్యవసాయ సహాయ సంచాలకుడు బాబు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు భూమి సంరక్షణతో పాటు సాగునీటి వనరులను పొదుపుగా వాడడం ప్రతి రైతు బాధ్యతని తెలిపారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని, పురుగు మందులను అవసరమైనప్పుడు మాత్రమే సిఫార్సు చేసిన మోతాదులో వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుతూ, నేల ఆరోగ్యం కాపాడుకోవాలని, సాగునీటిని వృథా చేయకుండా సమర్థవంతమైన నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నారెడ్డి, మండల వ్యవసాయ అధికారి నాగరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీమతి మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గాం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/అంతర్గాం :** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అంతర్గాం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎస్ఐ ఉదయ్ కిరణ్‌తో మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల నమోదు, ఈసాక్ష్య, ఈసమన్ల అమలు,దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పురోగతిని సమీక్షించారు.పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సిసి కెమెరాల పనితీరును పరిశీలించి,అవినిరంతరంసక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు.

## కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి: అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/ సిద్దిపేట :** కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, పనిప్రదేశాల్లో ఎలాంటి వేధింపులు, బెదిరింపులు, అన్యాయం ఎదురైనా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ సూచించారు. శుక్రవారం సమీకృత సిద్దిపేట జిల్లా కార్యాలయ సముదాయంలో కార్మికుల హక్కులపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన "మీ పని.. మీ జీతం.. మీ స్వేచ్ఛ" పోస్టర్‌ను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ఆవిష్కరించారు. జిల్లాలో ఈనెల8 నుండి 28 రోజుల పాటు పలు ప్రాంతాల్లో కార్మికుల హక్కులపై అవగాహన కల్పించే ప్రచార వా హనాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనిప్రదేశాల్లో అన్యాయం జరిగినా, బెదిరింపులకు గురైనా, తమ హక్కులకు భంగం కలిగినా బాధితులు ఫిర్యాదు చేయవచ్చు. పోస్టర్‌లో సూచించిన సహాయం కోసం 08069434343 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్ కుమార్, జిల్లా అసిస్టెంట్ కమిషన్ శ్రీనివాస్, సిద్దిపేట లేబర్ ఆఫీసర్ జ్యోతి, అవగాహన కార్యక్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ ర్యాలీ పోస్టర్ విడుదల

**ప్రజాపక్షం / కొత్తపల్లి :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో ఈనెల 25న నిర్వహించబోయే సైకిల్ ర్యాలీకి సంబంధించిన పోస్టర్, రూట్ మ్యాప్‌లను శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆవిష్కరించారు. ఆదివారం ఉదయంపోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి ఈ సైకిల్ ర్యాలీ ప్రారంభమవుతుందని సిపితెలిపారు. పరేడ్ గ్రౌండ్ నుంచి మొదలై బస్ స్టేషన్, ప్రతిమ మల్టీప్లెక్స్, గీతాభవన్ చౌరస్తా, మంకమ్మతోటలోని పొన్నం కాంప్లెక్స్, కెమిస్ట్ భవన్ మీదుగా సాగి ఎలక్ట్రిసిటీ కార్యాలయం వద్ద యూ టర్న్ తీసుకుంటుందని అనంతరం కోర్ట్ చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌరస్తా, నాఖా చౌరస్తా, కమాన్ చౌరస్తా, తిరిగి బస్టాండ్ సర్కిల్ , ప్రతిమ మల్టిప్లెక్స్ మీదుగా ప్రయాణించి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ముగుస్తుందని ఆయన వివరించారు. ఈ సైక్లింగ్ ర్యాలీ నగరంలో దాదాపు 20 కిలో మీటర్ల మేర జరగనుందనిసిపి పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో ప్రజలను భాగస్వామ్యం చేసే ఉద్దేశంతో అక్టోబర్ 31 వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు సిపితెలిపారు. ఈ వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ పోటీలలో, కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని సిపి గౌష్ ఆలం కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**ప్రజాపక్షం/ వేములవాడ:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొస్తూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ రూరల్ మండలంమల్లారం గ్రామంలో నిర్వహించిన సేవా సంకల్ప అభియాన్ డిజిటల్ ఎడ్యుకేషన్ & ఎఐ ఎంపవర్‌మెంట్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు డిజిటల్ విద్యను చేరువ చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎఐ నైపుణ్యాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం అన్నారు.ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో నూతన సిలబస్, మెరుగైన విద్యా ప్రమాణాలను ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. విద్యతో పాటు నాణ్యమైన పోషకాహారం అందించాలనే ఆలోచన గతంలో ఆశించిన స్థాయిలో అమలు కాలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణలోనూ నాణ్యమైన విద్యను అందించే పాఠశాలలు ఉండాలనే ఉద్దేశంతో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేములవాడ నియోజకవర్గానికి కొండ్రాపోలులో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను తీసుకువచ్చామని, సుమారు 1,500 మంది విద్యార్థులకు విద్యనందించేలా అవకాశం కల్పించామని వివరించారు. ఆరుట్ల పాఠశాలలో 1,500 మంది విద్యార్థులకు ప్రవేశాలు పూర్తయి, అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టే పరిస్థితి రావడం ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని ఆది శ్రీనివాస్ అన్నారు .విద్యతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే నైపుణ్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మల్లారం గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.విద్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, గ్రామస్తులు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## మానేరు వాగులో పడి పంచాయతీ కార్యదర్శి మృతి

భార్య, మరదలి పరిస్థితి విషమం!



**ప్రజాపక్షం/ముత్తారం :** మానేరు వాగులో శుక్రవారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సరదాగా స్నానానికి వెళ్లిన ఓ గ్రామ పంచాయతీ కార్యదర్శి నీట మునిగి ప్రాణాలు కోల్పోగా, అతడిని కాపాడబోయిన భార్య, మరదలి పరిస్థితి అత్యంత విషమంగా మారింది.స్థానికులు,పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం..పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ (పన్నూరు) గ్రామానికి చెందిన శనిగరపు జైపాల్ (32), మంథని మండలం సూరయ్యపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మండల కేంద్రం.దసరా పండుగ కోసం భార్యాపిల్లలతో కలిసి అత్తగారింటికి వెళ్లిన జైపాల్,పండుగ ముగించుకుని తిరిగి కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.జయశంకర్ భూపాలపల్లి పెద్దపల్లి జిల్లాల సరిహద్దులోని ముత్తారం మండలం ఓడేడు గ్రామ పంచాయతీ పరిధిలో గల మానేరు వాగు వద్ద వీరు ఆగారు. అక్కడ నేషనల్ హైవే రోడ్డు పనుల కోసం వేసిన పైప్‌ల వద్ద భారీ గుంత ఏర్పడింది. భార్య, మరదలితో కలిసి నదిలో స్నానం చేస్తున్న సమయంలో లోతు ఎక్కువగా ఉండటంతో పాటు అనుకోకుండా నీటి ఉధృతిలో చిక్కుకుని జైపాల్ ఊపిరాడక నీటిలో మునిగిపోతూ కేకలు వేశారు.ఆయనను కాపాడేందుకు భార్య, మరదలు ప్రయత్నించగా వారు కూడా ప్రమాదంలో చిక్కుకుని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడే ఉన్న స్థానిక రైతు ఓగులవేన ఈశ్వరయ్య వెంటనే స్పందించి, సమయస్ఫూర్తితో నీటిలో కొట్టు మిట్టాడుతున్న వారిని బయటకు లాగేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో జైపాల్ నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందారు. రైతు ఈశ్వరయ్య ఇద్దరు మహిళలను కాపాడి బయటకు తీసుకురావడంతో స్థానికులు వారిని చికిత్స నిమిత్తం హుటాహుటిన గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి విషమంగా ఉంది.వీరంతా నదిలోకి దిగే సమయంలో తమ చిన్న పాపను ఒడ్డుపైనే ఉంచడంతో ఆ చిన్నారి సురక్షితంగా బయటపడింది.సమయస్ఫూర్తితో స్పందించి ఇద్దరు మహిళల ప్రాణాలను కాపాడిన రైతు ఈశ్వరయ్యను స్థానికులు అభినందించారు.పండుగ సంబరాల్లో ఉన్న ఆ కుటుంబంలో ఈ ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది.ఘటన స్థలానికి చేరుకున్న ముత్తారం ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

## గనుల తవ్వకాలను నిలిపివేయాలి

చాడ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో

గనుల శాఖ ముఖ్య కార్యదర్శికి వినతి



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** ముస్తాబాద్ మండలం పరిధిలోని గూడూరు పల్లగుట్ట వద్ద మంజూరు చేసిన గనుల తవ్వకాల అనుమతులను తక్షణమే పు నఃపరిశీలించి గ్రామ ప్రజలకు, పర్యావరణానికి నష్టం కలగకుండా తగిన చర్య లు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ ము ఖ్య కార్యదర్శి అనుదీప్ దురిశెట్టికి సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడుచాడ వెంకటరెడ్డితో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిల ఉంచుకొని మంజూరైన అనుమతులపై సమగ్ర విచారణ జరిపించే తవ్వకాల అనుమతులను రద్దు చేయడంతోపాటు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, సిపిఐ సిరిసిల్ల జిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి గుంటి వేణు, సిఐటియు రాష్ట్ర నాయకుడుగీస భిక్షపతి, పల్లగుట్ట పరిరక్షణ కమిటీ కన్వీనర్ గూడూరు మాజీ సర్పంచ్ చాకలి రమేశ్, పల్లగుట్ట పరిరక్షణ కమిటీ నాయకులు చెరుగు ఎల్లం, హైకోర్టు న్యాయవాది రాజశేఖర్ తదితరులు వినతిపత్రం ఇచ్చినవారిలో ఉన్నారు.

## హమాలీల హక్కుల కోసం పోరాటం

పెద్దపల్లిలో సమరశంఖం, 25నరాష్ట్ర సదస్సు,

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** హమాలీ కార్మికుల హక్కుల సాధన, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలే లక్ష్యంగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సదస్సు నిర్వహించనుంది.యూనియన్ దశాబ్ది ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 25న ఆదివారం ఉదయం 10 గంటలకు పెద్దపల్లిలోని ఎం.బి. గార్డెన్స్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ 2016 అక్టోబర్ 25న జమ్మికుంట పట్టణంలో కొంత మంది హమాలీ కార్మికులతో ప్రారంభమైన తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ నేడు రాష్ట్రంలోని 33 జిల్లాలకు విస్తరించి, వేలాది మంది సభ్యులతో బలమైన కార్మిక సంఘంగా ఎదిగిందని తెలిపారు.మండల,పట్టణ, జిల్లా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, వేతనాలు, పని పరిస్థితులు, సంక్షేమం వంటి అంశాలపై సభలు,సమావేశాలు,శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినట్లు వివరించారు. శారీరక శ్రమ చేస్తున్నప్పటికీ హమాలీ కార్మికుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన ఆదాయం లేకపోవడం, సమాన పనికి సమాన వేతనం అమలు కాకపోవడం, వలస కార్మికుల రాకతో పోటీ పెరగడం వంటి సమస్యలతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హమాలీ కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ ,అక్టోబర్ 25న పెద్దపల్లిలో నిర్వహించే దశాబ్ది ఆవిర్భావ సభకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి హమాలీ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు,కార్మిక శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెడి వెంకటరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగ సంపత్ యాదవ్,సహాయ కార్యదర్శి కామ భూమయ్య,నాయకులు పాలేటి వెంకటేష్,కాటం రాజు,జంగా రాజు,తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూములు, ప్రైవేట్ వ్యక్తుల భూములను కబ్జాలకు పాల్పడుతున్న వారిపై అధికార యంత్రాంగం ఇటు పోలీసులు ఉక్కుపాదం మోపాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డిలు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గత కొంత కాలంగా కరీంనగర్ నగరంతో పాటు విలీన గ్రామాల్లో నివాస యోగ్యానికి ఉపయోగపడే ప్రభుత్వ భూములను కొంత మంది రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు కబ్జాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన పట్టా భూములను కబ్జాలు చేస్తూ పట్టాదారులను, కొనుగోలు దారులను భయభ్రాంతులకు గురి చేయడం,డబ్బులు వసూలు చేయడం లాంటివి జరుగుతున్నాయని, కబ్జా దారుల వెనుక ప్రజా ప్రతినిధుల హస్తం కూడా ఉండడంతో విచ్చల విడిగా భూ కబ్జా దారులు చెలరేగిపోతున్నారని అలాంటి వారిని గుర్తించి అధికారులు,పోలీసులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు.కనీసం ఉండడానికి ఇండ్లు లేని ఎన్నో లక్షల కుటుంబాలు ఉన్నాయని వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వ భూములు ఉండవు కానీ ప్రభుత్వ భూములు కబ్జా కోరుల చేతుల్లోకి ఎలా వెళుతున్నాయో అర్థం కావడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రభుత్వంపై ప్రజల నుండి పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదని శ్రీనివాస్, సురేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## గన్నేరువరంలో 'ప్రజాపక్షం' వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం / గన్నేరువరం :** ప్రజల సమస్యల ను వెలుగులోకి తీసుకురావడంలో ముందుం టూ ప్రజల పక్షాన నిలుస్తున్న ప్రజాపక్షం దినపత్రిక 8వ వార్షికోత్సవ వేడుకలను గన్నేరువరం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా గన్నేరువరం మండల ప్ర జాపక్షం రిపోర్టర్ బుర్ర కోటేశ్ గౌడ్‌తో కలిసి సిపిఐ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం , జిల్లా కౌన్సిల్ సభ్యుడుకాంతాల అంజిరెడ్డితోపాటు పలువురు పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, పాఠకులు ప్రజాపక్షం దినపత్రికకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల గొంతుకగా మరింత సమర్థవంతంగా పని చేసి సమాజ అభివృద్ధికి పత్రిక మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎనిమిదేళ్లుగా ప్రజల ఆదరణతో ముందుకు సాగుతున్న ప్రజాపక్షం దినపత్రిక భవిష్యత్‌లోనూ నిష్పక్షపాత వార్తా కథనాలతో ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, గన్నేరువరం గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, గ్రామ సహాయ కార్యదర్శి బొమ్మకంటి అంజయ్య చారి, నాయమ్, నాగయ్య, గణేశ్, ఓదయ్య తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారాభివృద్ధికి బ్యాంకు రుణాలు

కలెక్టర్ గరిమ అగ్రవాల్

సంస్థాగత రుణాలపై అవగాహన




**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల :** బ్యాంకు రుణాలు వ్యాపారాభివృద్ధికి వినియోగించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఇ సంవాద్ పేరిట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఇ సంవాద్ కార్యక్రమం ద్వారా చేనేత,పవర్‌లూమ్ రంగాలకు చెందిన యజమానులు, ఆసాములు, కార్మికులకు సంస్థాగత రుణాలపై అవగాహన కల్పించడం, బ్యాంకింగ్ సేవలను వినియోగించుకునేలా ప్రోత్సహించడం, ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రక్రియలను జోడించడం ద్వారా ఆదాయం, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి మార్గనిర్దేశం ఆర్‌బిఐ ఎల్‌డిఒశ్రీ చేతన్ సంస్థాగత రుణాల ప్రాధాన్యత, బ్యాంకుల ద్వారా లభించే రుణ సదుపాయాలు, ఆర్థిక క్రమశిక్షణ, రుణాల సక్రమ వినియోగంపై అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ చేనేత వస్త్రాల తయారీ వైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు మార్పు చెందాలని సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డిఓ చేతన్, నాబార్డ్ డిడిఎం దిలీప్ చంద్ర, ఎల్‌డిఎం రాజీవ్ కుమార్, ఇండస్ట్రీస్ జిఎం హనుమంతు, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఎడి సంతోష్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, చేనేత, పవర్ లూమ్ యూనిట్ యజమానులు, వీవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పెంచాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జగిత్యాల :** ఉపాధి హామీ పనుల కల్పనను పెంచి,జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలనిజగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులుకు ఆదేశాలు జారీచేశారు.జిల్లాలో విబి–జి రామ్, ఉపాధి హామీ పనులు,వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం ,తాగునీటి సరఫరా,ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, జల సంరక్షణ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూఎల్ నినో ప్రభావం నేపథ్యంలో రానున్న కాలంలో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల కల్పనను పెంచాలని సూచించారు. ప్రస్తుతం రోజువారీ సగటున 60 మందికి ఉపాధి కల్పిస్తున్న నేపథ్యంలో, ప్రతి గ్రామంలో సగటున 45 మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకొని,ఆ సంఖ్యను స్థిరంగా కొనసాగించాలని ఆదేశించారు.కాలువల్లో పూడికతీత వంటి సామూహిక పనులను విస్తృతంగా చేపట్టాలని,పనుల షెల్ఫ్‌ను 200 శాతానికి పెంచాలని సూచించారు. సెప్టెంబర్ నెలకు నిర్దేశించిన మూడు లక్షల లక్ష్యంలో ఇప్పటివరకు రెండు లక్షల మేర పురోగతి సాధించినందున, మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే మ్యాజిక్ సోక్‌పిట్స్,కమ్యూనిటీ సోక్‌పిట్స్,డ్రెయిన్ ఎండ్ సోక్‌పిట్స్ నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. ఈ పనులకు సంబంధించి సోమవారం లోగా మంజూరుల ప్రక్రియను పూర్తి చేయాలని,అక్టోబర్ 31 నాటికి మ్యాజిక్ సోక్‌పిట్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాల సాధనలో ఎంపీవోలు పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కింద మిగిలి ఉన్న 918 మంజూరులను డిఆర్‌డివి, హౌసింగ్ అధికారులు సమన్వయంతో వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో మిగిలి ఉన్న 860 ఇళ్ల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాసనసభ్యుల ప్రతిపాదనలు,గెజిటెడ్ అధికారుల ధ్రువీకరణ అనంతరం నిబంధనల ప్రకారం మంజూరు ఉత్తర్వులు జారీ చేసే ప్రక్రియను చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో జెడ్‌పిసిఇఒ గౌతమ్ రెడ్డి, డిఆర్‌డిఒ రఘువరన్,డిప్యూటీ సిఇఒ నరేష్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి,తదితరులు ఉన్నారు.

## బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

సిపిఐ నాయకుల నిరసన



**ప్రజాపక్షం /గన్నే-రువరం :** గన్నేరువరం నుంచి ఎలగందులకు వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు 77 కోట్ల రూపాయలు మంజూరై ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు శంఖుస్థాపన చేయకపోవడంపై సిపిఐ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గన్నేరువరం మండల కేంద్రంలో బ్రిడ్జి శంఖుస్థాపన కోసం ఏర్పాటు చేసిన గద్దె వద్ద సిపిఐ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాంతల అంజిరెడ్డి, మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలంలు మాట్లాడుతూ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణాని పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మండల ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ధర్నాలు చేపడాతమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, గన్నేరువరం గ్రామ కార్యదర్శి బోయిని మల్లయ్య, సహాయ కార్యదర్శి బొమ్మకంటి అంజయ్య చారి, నాయమ్ నాగయ్య, గణేష్, ఓదయ్య తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా భూముల రీ– సర్వే



**ప్రజాపక్షం/కెరమెరి:** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఆదేశించారు. శుక్రవారం కెరమెరి మండలం నాగపూర్ గ్రామంలో చేపడుతున్న భూముల రీ సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సర్వే వివరాలను సంబంధిత రైతులకు ముందుగానే తెలియజేయాలని, ప్రతి రైతు హాజరయ్యేలా టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్తులో గెట్టు పంచాయితీలు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. సర్వే కోసం రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అత్యాధునిక రోవర్ల ద్వారా అత్యంత కచ్చితత్వంతో సర్వే నిర్వహిస్తున్నామని వివరించారు. సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



**మనోహరాబాద్:** భూముల రీ సర్వే ప్రక్రియకు రైతులు సహకరించాలని ఏడీ కిషన్ కోరారు. శుక్రవారం మనోహరాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామంలో రైతులకు భూముల రీ సర్వేపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల వివరాలను పక్కాగా నమోదు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా రీ సర్వే చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్వే సమయంలో రైతులు తమ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులకు అందించాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని కోరారు.తహసీల్దార్ ఆంజనేయులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే బాలికలకు భవిష్యత్తు



**ప్రజాపక్షం/కౌటాలః** విద్యతోనే బాలికలు ఉన్నత లక్ష్యాలను సాధించి, సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరని కౌటాల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) ప్రధానోపాధ్యాయురాలు దుర్గం పవిత్ర పేర్కొన్నారు. దసరా సెలవుల అనంతరం విద్యాలయం పునఃప్రారంభమైన సందర్భంగా పాఠశాలకు తిరిగి వచ్చిన విద్యార్థినులకు ఉపాధ్యాయినులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దుర్గం పవిత్ర మాట్లాడుతూ విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ ఉపాధ్యాయినులు బోధించే పాఠాలను ఏకాగ్రతతో నేర్చుకోవాలని తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ప్రతి ఒక్కరూ విద్యాభ్యాసంలో రాణించాలని ఆకాంక్షించారు. సెలవుల అనంతరం విద్యార్థినులకు ఆత్మీయ స్వాగతం లభించడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. కెజిబివి ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఆయుష్ విభాగంలో ఉద్యోగాలు దరఖాస్తుల ఆహ్వానం

### కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్: జాతీయ ఆయుష్ మిషన్ కింద మెదక్ జిల్లాలో వివిధ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు 3, ఫార్మసిస్ట్ 1, సైకో సోషల్ కౌన్సిలర్ 1, యోగా ప్రొఫెషనల్ 1, మల్టీపర్పస్ వర్కర్లు 2 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 44 సంవత్సరాల వయస్సు గల అర్హులు అక్టోబర్ 26 నుంచి 31 వరకు కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అర్హతలు, జీతభత్యాల వివరాల కోసం medak. telangana. gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కలెక్టర్ తెలిపారు.

## 'జలసిరి' పనులపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం /దిలావర్‌పూర్ :** గ్రామాల్లో భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణకు జలసిరి కార్యక్రమం కింద విస్తృతంగా పనులు చేపట్టాలని అడిషనల్ పీడీ నాగ వర్ధన్ అధికారులకు సూచించారు.శుక్రవారం దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన వీబీజీ రామ్ జీ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, నీటి సంరక్షణ చర్యలపై చర్చించారు.ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు,డ్రెయిన్ ఎండ్ ఇంకుడు గుంతలు,ఫామ్ పాండ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.వర్షపు నీటిని సమర్థంగా ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించేలా పనులు చేపట్టాలని సూచించారు.అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ పనుల అమలుపై దృష్టి సారించాలని తెలిపారు.ఎంపీడీవో అరుణ రాణి,ఎంపీవో గోవర్ధన్,ఏపీవో దివ్యా రెడ్డి,సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు,టెక్నికల్ అసిస్టెంట్లు,ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్లు పాల్గొన్నారు.

## భైంసా పోక్సో కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు శిక్ష

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** భైంసా పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో (పిఒసిఎస్ఒ) కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.3,000 జరిమానై విధిస్తూ నిర్మల్ ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెల్లడించింది.కేసు వివరాల్లోకి వెళ్తే..2022లో భైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేసిన క్రైమ్ నంబర్ XX/2022, సెషన్స్ కేసు నంబర్ 191/2022 ఆధారంగా ఐపిసి సెక్షన్లు 363, 376(1) సహా పోక్సో చట్టంలోని సెక్షన్ 3 r/w 4 కింద కేసు నమోదు చేశారు.కోర్టు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు పఠాన్ షరూక్‌ను దోషిగా నిర్ధారిస్తూ న్యాయస్థానం ఈ తీర్పు ఇచ్చింది.ఈ కేసులో దర్యాప్తు అధికారిగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ వ్యవహరించగా, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుదర్శన్ రెడ్డి న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. కోర్టు లైజన్ ఎస్ఐ కె. రమేష్, కేడీవో మోహన్ విచారణలో కీలక పాత్ర పోషించారు.ఎస్పి అభినందనలు మైనర్ బాలికలపై నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ,బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పి జానకి షర్మిల, స్పష్టం చేశారు.కేసు దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు విధుల సిబ్బందిని ఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

## 'ఎల్ నినో' ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు
# సమగ్ర ప్రణాళిక అవసరం

### గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు.. కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షపాతం లోటు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల వారీగా స్థానిక పరిస్థితులను అంచనా వేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.నీటి వనరుల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, భూగర్భ జలాల పెంపు, నీటి వృథా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, డిఆర్‌డిఏపిడి శ్రీనివాసరావు, డిపిఓ యా దయ్య, డిఏఓ దేవకుమార్‌తో పాటు వివి ధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల పనులు పరిశీలన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గోదావరి పుష్కరా ల పనులను వేగవంతం చేయాలని ప్రత్యేకాధికారి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరా వు సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంరా వు ఇతర అధికారులతో కలిసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నిజామాబాద్ జిల్లా కందకుర్తి పుష్కర ఘాట్‌ను సందర్శించారు. దేవాదాయ, నీటిపారుదల, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. పుష్కరాల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, పుణ్యస్నానాలచరించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలన్నారు. ఒక్కో శాఖ వారిగా చేపట్టిన పనుల వివరాలు సమీక్షించి మార్పులు, చేర్పులకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని కందకుర్తి, యంచ తదితర గోదావరి పరివాహక పుణ్యక్షేత్రాల వద్ద పుష్కరాలు నిర్వహించే అన్ని ప్రాం తాల్లో పనులు వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. ప్రముఖులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశమున్న కందకుర్తి పుణ్యక్షేత్రం వద్ద పుష్కరాల పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. నీటిమట్టం తగ్గిన పుష్కరఘాట్ ప నులు చేపట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. మార్చి నెలాఖరునాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముoదుకెళుతున్నామన్నారు. స్పెషల్ ఆఫీసర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయకుమారి, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, ఇరిగేషన్, ఎండోమెంట్ శాఖల అధికారులున్నారు.

## పారదర్శకంగా వైద్య కళాశాలలో నియామకాలు : కలెక్టర్



**ప్రజాపక్షం/హాజీపూర్:** ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీ పోస్టుల భర్తీని పూర్తిగా పారదర్శకం గా, ప్రతిభ ఆధారంగానే చేపట్టామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం హాజీపూర్ మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాల దంత వైద్య విభాగంలో అధ్యాపకుల నియామక ప్రక్రియను కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్‌లతో కలిసి పరిశీలించారు.రాత పరీక్ష, పిజి మార్కులు, ఇంటర్వ్యూలలో కనబరిచిన ప్రతిభ, అనుభవాన్ని పరిగణనలోకి తీ సుకుని నిబంధనల ప్రకారమే మెరిట్ ప్రాతిపదికన ఎంపిక పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఎంపికైన అభిషేక్‌కు త్వరలోనే నియామక ఉత్తర్వులు అందజేస్తామన్నారు. వైద్య విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని, మై దాన అభివృద్ధి, క్రీడలు, తాగునీరు, ఇంటర్నెట్ సౌకర్యాలపై తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ అశోక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గడువులోగా గోదావరి పుష్కరాల పనులు పూర్తి

### రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/నిర్మల్ :** గడువులోగా గోదావరి పుష్కరాల పనులను పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తో కలిసి బాసర లో గోదావరి నది పుష్కరాల పనులను పరిశీలించారు.గోదావరి పుష్కర ఘాట్లను,తదితర పుష్కరాల నిర్మాణ పనుల ప్రదేశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.భక్తుల రద్దీకి అనుగుణంగా పుష్కర ఘాట్ల నిర్మాణం చేపట్టాలన్నారు. వేలాది మంది పుణ్యస్నానాలకు తరలివస్తారని,భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని వారికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పుష్కరాల పనులన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యవంతంగా చేపట్టాలని వివరించా రు.సంబంధిత శాఖల అధికారులు అంతా ఎప్పటికప్పుడు పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఉండాలని పేర్కొన్నారు.అవసరమైన మేరకు పార్కింగ్ సదుపాయం కల్పించాలని చెప్పారు. పనుల పురోగతి వివరాలను ఎప్పటికప్పుడు తమకు అందజేస్తూ ఉండాలని తెలిపారు.

**పుష్కరాల పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా :** బాసరలో గోదావరి పుష్కరాల పనులన్నీ నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా చెప్పారు.పుష్కరాల పనుల వివరాలను కలెక్టర్ కమిషనర్ కు వివరించారు. వారానికి ఒకరోజు బాసరలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహించడంతో పాటు,పనులకు సంబంధించి అధికారులందరికీ దిశా నిర్దేశం చేస్తున్నట్లు తెలిపారు.గోదావరి నది పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేస్తామని వివరించారు. పుణ్యస్నానాలు ఆచరించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.అంతకు ముందు బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని కమిషనర్,కలెక్టర్,అధికారులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారులను సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ పరిశీలనలో ఇన్ ఛార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్,ఆర్ అండ్ బి ఈఈ సుభాష్,ఆలయ ఈవో అంజనా దేవి,తహసిల్దార్ పవన్ చంద్ర,ఇతర అధికారులు,సిబ్బంది,తదితరులు ఉన్నారు.

## 'అందోల్' నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి

### మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం / చౌటకూరు :** రాష్ట్ర వైద్య ఆరోగ్య కు టుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో అందోల్ నియోజకవర్గ స్థాయిలో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు కొలమానంగా నిలిచే విజయదశమి పండుగ సందర్బంగా ఆలయ్.. బలాయ్ కార్యక్రమాన్ని చౌటుకూరు మండలం తాడ్‌దాన్‌పల్లి లోని ఎం.ఎస్ ఫంక్షన్ హాల్‌లో మద్యాహ్నం 12.00 లనుండి ఘనంగా ప్రారంభం అ య్యింది. మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్ నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన తరువాత సుమారు 3 వేల కోట్ల పై చిలుకు రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు ,రోడ్లు, ఆసుపత్రుల నిర్మాణాలు ,నర్సింగ్ కాలేజ్, హాస్టల్ నిర్మాణాలు ,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కెజిబివి లు వివిధ విద్యా సంస్థలలో సిఎస్ఆర్ నిధులతో చేపట్టిన మౌళిక సదుపాయాల కల్పన కంప్యూటర్ ల్యాబ్‌లు బస్సులు ,పాఠశాల అభివృద్ధి సంక్షేమ హాస్టల్ లలో మౌళిక సదుపాయాలు ,అందోల్‌లో స్టేడియం అభివృద్ధి ఎ ంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన లా కాలేజ్ పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు నిర్మాణం ఇతర అభివృద్ధి పనులు చేపట్టిన కార్యక్రమాలను జోగిపేట. అందోల్ పట్టణాల పరిసర ప్రాంతాలను అనుసందానం చేస్తూ నిర్మాణం చేపట్టిన బ్రిడ్జ్‌లు ,సింగూరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిసర ప్రాంతాల ప్రజలు అభివృద్ధికి చేపట్టిన అంతర్గత రోడ్ల నిర్మాణం ,రవాణా ,టూరిజంల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యకర్తలకు వివరించారు.డిసిసి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు, సంగమేశ్వర్, పిసిసి సభ్యులు కిషన్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్‌లు జగన్ మోహన్‌రెడ్డి, సుదాకర్‌రెడ్డి, లక్ష్మి శేషారెడ్డి, అందోల్ జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ ,శ్రీకృష్ణ రెడ్డి వైస్ చైర్మన్ చిట్టిబాబు ,మాజీ చైర్మన్ సురేందర్ గౌడ్, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,పిల్లోడి సతీష్, దిగంబరావు, శిషారెడ్డి, దుర్గారెడ్డి , గణేష్ కెదారనాథ్, వెంకటేశం, విశ్వాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్, లు ఆత్మకమిటీ చైర్మన్ లు కచ్చూరు రావు, మల్లారెడ్డి, సర్పంచ్ లు కౌన్సిలర్స్ సేవాధళ్, యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ కార్మిక సంఘాల ఎన్ఎస్‌యుఐ నియోజవకవర్గ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు మాజీ జడ్పీటీసీలు ,మాజీ ఎంపిపి లు మాజీ ఎంపిటీసీలు , మాజీ సర్పంచ్‌లు మాజీ సహకార సంఘాల చైర్మన్ లు డైరెక్టర్‌లు వేలాదిగా తరలివచ్చి ఆలయ్ బలయ్ సందర్బంగా మంత్రిదామోదర్ రాజనర్సింహకు శుభాకాంక్షలు తెలిపారు.

## పత్రికా విలువలకు నిలువుటద్దం 'ప్రజాపక్షం'

### అవినీతిపై పోరు..ప్రజలవైపే మొగ్గు 'ప్రజాపక్షం'వేడుకలు



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ ప్రెస్ క్లబ్‌లో 'ప్రజాపక్షం' దినపత్రిక 8వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు.వేడుకల్లో పాల్గొన్న పలువురు జర్నలిస్టులు,స్థానిక ప్రముఖులు కేక్ కట్ చేసి,ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పత్రిక దిగ్విజయంగా 8 ఏళ్లు పూర్తి చేసుకుని కొత్త ఏట అడుగుపెట్టిన సందర్భంగా ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.అవినీతిని నిరంతరం ఎండగడుతూ, క్షేత్రస్థాయిలోని సామాన్యుడి గొంతుకగా నిలుస్తూ ప్రజల వైపే నిలకడగా నిలిచిందని ఆశాభావం వ్యక్తం చేశారు.పాలకులు, అధికారుల దృష్టికి ప్రజాసమస్యలను తీసుకెళ్లడంలో పత్రిక పోషిస్తున్న పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇదే బాధ్యతాయుతమైన పాత్రికేయ విలువలతో ప్రజాసేవలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. నిర్మల్ ఆర్ సి డి ఎస్ మధు, భైంసా ఆర్ సి సిండే మహేష్, నిర్మల్ టౌన్, రూరల్ కే.రమణ. లింగేశ్వర్, ముధోల్ రిపోర్టర్ సునీల్. దిలావర్పూర్ రిపోర్టర్ భోజన్న, లక్ష్మ ణ్ చందా రిపోర్టర్ నరేష్, సారంగాపూర్ రిపోర్టర్ శ్రీనివాస్,ప్రెస్ క్లబ్ ప్రతినిధులు యేగేష,ప్రసాద్,సీనియర్ జర్నలిస్టులు,విలేకరులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల ఒడిలో రేంగన్వాడీ గిరిజన గ్రామం



**ప్రజాపక్షం/నేరడిగొండ:** బోందిడి పంచాయతీ పరిధిలోని రేంగన్వాడీ గిరిజన గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. అధికారుల అలసత్వంతో రోడ్లపై చెత్త పేరుకుపోయి మురుగు ప్రవహిస్తోంది. మిషన్ భగీరథ ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో నాచు పట్టిన నీటినే తాగుతున్నామని, బావుల్లో బ్లీచింగ్ చల్లకపోవడంతో రోగాలు వస్తున్నాయని 47 గిరిజన కుటుంబాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు వెలగక రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

### రహదారి భద్రతపై కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్‌పి ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ప్రమాద మరణాలు తగ్గించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబందిత శాఖల అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు,సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా రహదారి భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. ప్రమాద రహిత ( జారో పటాలిడీ డిస్ట్రిక్ జడ్.ఎఫ్,డి ) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జాతీయ రహదారి 65 పై పటాన్‌చెరు నుంచి దిగ్వాల్ కూడలి వరకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఎస్పీ పరితోష్ ఫంకజ్ అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ,అదనపు కలెక్టర్‌పాండు జాతీయ రహదారులు ,రహదారులు భవనాలు, పోలీసు రవాణా శాఖల అదికారులతో కలిసి పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ మార్గంలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రమాద స్థలాలను పరిశీలించారు. అవసరమైన ప్రాంతాల్లో ఎత్తైన విద్యుదీపాలు ,హెచ్చరిక సూచిన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద రాకపోకల రద్దీని తగ్గించడంతో పాటు బస్సుల నుంచి దిగే ప్రయాణికులు సురక్షితంగా రాకపోకలు సాగించేలా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. జిల్లా వైద్యాధికారి లలితాదేవి, రహదారులు .భవనాల శాఖ కార్యానిర్వాహక ఇంజనీరు, శ్రీనివాస్, ఉప కార్యనిర్వహాఖ ఇంజనీరు, రవీందర్ డిటీఓ వాసు ఏఎమ్ వి ఐ గౌతమ్ సంగారెడ్డి, పటాన్‌చెరు ఉప పోలీసు అధికారుల బృందాల అధికారులు ,జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులు సంబందిత జిల్లా యంత్రాంగం పోలీసు శాఖ అదికారులు పాల్గొన్నారు.



## దళితులపై దాడుల ఘటనలో పోలీసుల విచారణ

### 'కెవిపిఎస్' పోరాటంతో కదిలిన యంత్రాంగం, గ్రామాల్లోనూ విచారణ చేపట్టిన డిఎస్‌పి



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మనోహరాబాద్ మండలం కొనాయిపల్లి గ్రామంలో దళితులపై జరిగిన దాడి,కుచారం గ్రామంలో దళిత సర్పంచ్ పట్ల వివక్ష,తూప్రాన్ మండలం కిష్టాపూర్ గ్రామంలో దళితులపై జరిగిన దాడుల ఘటనలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఇతర ప్రజాసంఘాలు చేపట్టిన ఆందోళనకు పోలీసు యంత్రాంగం స్పందించింది. గత మూడు రోజులుగా ప్రజాసంఘాలు నిరసనలు చేపడుతూ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడంతో పాటు జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ప్రజాసంఘాల ఆందోళనపై స్పందించిన జిల్లా అధికారులు శుక్రవారం కొనాయిపల్లితో పాటు ఇతర గ్రామాల్లో జరిగిన ఘటనలపై విచారణ చేపట్టేందుకు తూప్రాన్ డీఎస్పీని పంపించారు.ఈ పరిణామంపై కెవిపిఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అయితే, విచారణ నిష్పక్షపాతంగా నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని కెవిపిఎస్ నాయకులు డి మాండ్ చేశారు. కొనాయిపల్లి గ్రామ సర్పంచ్,ఆయన అనుచరులపై నమోదైన కేసులోని సెక్షన్లను మార్చాలని కోరారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేసి ,సర్పంచ్ నుంచి దళితులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దాడులకు పాల్పడిన నింధితులను తక్షణమే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎం.అడివయ్య, సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.మహేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలి

### కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/నర్సాపూర్:** రైతాంగం ఆరుతడి పంటల సాగు వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. శుక్రవారం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలని, రైతులు వచ్చే రబీ సీజన్ కోసం ఆరుతడి పంటల వైపు దృష్టి సారించి, నీటి అవసరం ఎక్కువగా ఉన్న వరికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఎండుతున్న పంటలను కాపాడుకోవాలని, ప్రత్యామ్నాయ పంటలైన కుసుమ, ఆయిల్ ఫామ్ మొదలగు పంటలకు ప్రభుత్వం సబ్సిడీతో పాటు అనేక పథకాల ద్వారా ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ వేయడం ద్వారా అంతర పంటలతో అధిక ఆదాయం లభిస్తుందన్నారు. ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తత కోసం రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. జిల్లా వ్యవసా యశాఖ అధికారి దేవ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి దీపిక, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసా య, ఉద్యానవన శాఖ అధికారులు, ప్యాట్, చిన్నచింతకుంట సర్పంచ్ సరితా మహేష్ పాల్గొన్నారు.



# జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

## కేరళం, చెన్నైలలో వామపక్ష పార్టీల నిరసన ప్రదర్శన



**తిరువనంతపురం :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వెల్లువెత్తిన ఆందోళనలు దేశ వ్యాప్తంగా ఇంకా కొనసాగుతున్నాయి. శుక్రవారం కూడా కేరళం, చెన్నైలలో వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు, అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘాల నేతలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. చెన్నైలో, వామపక్ష విద్యార్థి, యువజన సంస్థలతో కలిసి ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్, సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని గట్టిగా డిమాండ్ చేశాయి. ఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ సీరంగరాజ్, డివైఎఫ్ఐ అధ్యక్షుడు, ఎంపి ఎ.ఎ. రహీం, ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి సృజన్ భట్టాచార్య ఇతర వామపక్ష నాయకులతో కలిసి ప్రసంగించారు. ఆ తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా కేరళంలో ఎల్‌డిఎఫ్‌కు అనుబంధంగా ఉన్న విద్యార్థి సంఘాలు శుక్రవారం లోక్‌భవన్‌కు నిరసన ప్రదర్శన నిర్వహించాయి. కొత్త కేరళం గవర్నర్ ఓం ప్రకాష్ మాథుర్ బాధ్యతలు స్వీకరించిన రోజే, ఎస్ఐఆర్ వివాదంపై సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని ఆందోళనకు దిగాయి. కేరళం అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. మధ్యాహ్నం లోక్‌భవన్‌లో జరిగిన మాథుర్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వామపక్ష పార్టీ నాయకులు హాజరు కాలేదు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ నిరసన ప్రదర్శన ప్రారంభమైందని, ఇందులో ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, కెఎస్‌సి(ఎం), ఎస్ఎస్ఎఐ, ఎఐడిఎస్ఓ కార్యకర్తలు పాల్గొన్నారని పోలీసులు తెలిపారు. సిపిఐ నాయకుడు, ఎమ్మెల్యే కె. రాజన్ నేతృత్వంలో జరిగిన ఈ ప్రదర్శనను, లోక్‌భవన్‌కు చేరకముందే పోలీసులు నిలిపివేశారని అధికారులు తెలిపారు. తరువాత సభను ఉద్దేశించి విజయన్ మాట్లాడుతూ, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ బారి నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో అవకతవకల ఆరోపణలు ఉన్నప్పటికీ, కేంద్రం జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడుతోందని ఆయన ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న కుమార్‌ను తొలగించే వరకు నిరసన కొనసాగుతుందని ఆయన అన్నారు. రాజన్, ఇతర విద్యార్థి నాయకులు కూడా సభను ఉద్దేశించి ప్రసంగించారు.

# ఉద్యమం కొనసాగిస్తాం: సిజెపి



**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)కు వ్యతిరేకంగా తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని బొద్దింక, జనతా పార్టీ (సిజెపి) నాయకులు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సి వస్తుందని దాస్ స్పష్టం చేశారు. తమపై నమోదైన వేర్వేరు కేసులకు సంబంధించి మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లోని ప్రత్యేక కార్యనిర్వాహక మేజిస్ట్రేట్ (ఎస్ఇఎం) ఎదుట హాజరైన అనంతరం ఈ ఇద్దరు నాయకులు ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఉద్యమం కొనసాగుతుంది. ఈ దేశ ప్రజలు మాకు అందించిన ఈ వేదికకు మేమే సంరక్షకులం. మేము మా వంతు ఉత్తమంగా చేయడానికి ప్రయత్నిస్తున్నాము. మేము జైలులో ఉన్నప్పటికీ ఉద్యమం కొనసాగుతుంది' అని ఎస్ఇఎం ఎదుట హాజరైన అనంతరం రాంకా విలేకరులతో అన్నారు. 'మా గురించి, ప్రభుత్వం పనిచేస్తున్న తీరు గురించి మేము చాలా విషయాలు తెలుసుకున్నాము. అవసరమైన రీతిలో మేము మారుతాము, పరిణామం చెందుతాము' అని ఆయన అన్నారు. తదుపరి చర్యలు ఖరారైన తర్వాత ప్రకటిస్తామని కూడా ఆయన తెలిపారు. తదుపరి విచారణ తేదీని క్రైమ్ బ్రాంచ్ తెలియజేయడం కోసం తాము ఎదురు చూస్తున్నామని రాంకా చెప్పారు. ఈ ఉద్యమానికి సిజెపికి మించి కూడా మద్దతు ఉందని, దాని భవిష్యత్తును అందరూ కలిసి నిర్ణయిస్తారని దాస్ అన్నారు. సిజెపి, ఎస్ఐఆర్ చర్యకు వ్యతిరేకంగా నిరసనలు నిర్వహిస్తూ, కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తోంది. అక్టోబర్ 13న, రాంకా, దాస్ ఇతర కార్యకర్తలతో కలిసి భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసిన జంతర్ మంతర్ ప్రాంతంలోకి ప్రవేశించి, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆ సంస్థ, కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక యాత్రకు పిలుపు నివ్వడంతో సహా తమ నిరసనలను కొనసాగించింది. అక్టోబర్ 14న రాంకా, దాస్‌లను అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీకి పంపారు. 21న వారిని విడుదల చేయాలని ఎస్ఇఎం ఆదేశించడానికి ముందే, వారి కస్టడీని పొడిగించారు. విచారణలో చేరడానికి గురువారం అదనపు సమయం కోరిన ఆ ఇద్దరూ, శుక్రవారం ఎస్ఇఎం ఎదుట హాజరయ్యారని పోలీసు వర్గాలు తెలిపాయి.

# బలగాల మోహరింపు పొడిగింపు



**న్యూఢిల్లీ :** రాజకీయ, ఇతర సంస్థలు ఆకస్మిక నిరసనలు నిర్వహించే అవకాశం ఉన్నందున, దేశ రాజధాని ఢిల్లీలో 273 సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్) కంపెనీల మోహరింపును అక్టోబర్ 31 వరకు పొడిగించినట్లు అధికార వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఈ నెల ప్రారంభంలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నిర్వహించిన నిరసనల కోసం ఈ కంపెనీలను ఢిల్లీకి తీసుకువచ్చారు. ఈ మోహరింపును సమన్వయం చేయాలని అక్టోబర్ 22న హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఢిల్లీ పోలీసులను, సంబంధిత సిఎపిఎఫ్‌లను ఆదేశించినట్లు ఆ వర్గాలు పిటిఐకి తెలిపాయి. ఢిల్లీ పోలీసుల అభ్యర్థన మేరకు ఈ పొడిగింపును ఆమోదించినట్లు, అక్టోబర్ మధ్యలో కూడా ఇలాంటి పొడిగింపును మంజూరు చేసినట్లు వారు తెలిపారు. నగరంలోని వివిధ 'సున్నితమైన' ప్రదేశాలలో రాజకీయ, ఇతర సంస్థల ద్వారా ఆకస్మిక నిరసనలు జరిగే అవకాశం ఉందని ఢిల్లీ పోలీసులు మంత్రిత్వ శాఖకు తెలియజేశారని అధికారులు తెలిపారు. సరైన శాంతిభద్రతలను నిర్ధారించడానికి ఈ మోహరింపు పొడిగింపు అవసరమని వారు చెప్పారు. ఈ అభ్యర్థనను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆమోదించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. స్థానిక పోలీసులతో పాటు ఢిల్లీలో మోహరించి ఉండే 273 కంపెనీలలో, 20 మహిళా సిబ్బంది యూనిట్లతో సహా 125 సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) నుండి; 20 రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్) నుండి; 46 బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బిఎస్ఎఫ్) నుండి; 39 ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) నుండి; 31 సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి) నుండి; 12 సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్) నుండి ఉన్నాయి.

## అరుణాచల్‌లో చైనాతో ఘర్షణలు

# భయంకరమైన మోదీ మౌనం

**ఆ దేశానికి కొనసాగుతున్న రాయితీలు : కాంగ్రెస్ విమర్శలు**



**న్యూఢిల్లీ:** అరుణాచల్ ప్రదేశ్‌లో చైనా సైన్యంతో ఘర్షణలు జరిగినట్లుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఈ విషయంపై ఆయన, ఆయన ప్రభుత్వం 'భయంకరమైన మౌనం' పాటిస్తుండగా, చైనాకు 'స్వయం ప్రకటిత విశ్వగురువు' ఇస్తున్న ప్రణాళికాబద్ధమైన రాయితీలు మాత్రం కొనసాగుతున్నాయని శుక్రవారం ఆరోపించింది. గత కొద్ది రోజులుగా అరుణాచల్‌లోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయని, అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయని ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) డైరెక్టర్ జనరల్ శత్రుజీత్ కపూర్ చెప్పినట్లుగా పేర్కొన్న ఒక మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పంచుకున్నారు. తక్సింగ్ ఘర్షణ తర్వాత గత నెలలో అరుణాచల్ ప్రదేశ్‌లోని వాచా, దమాయ్‌లలో పోలీస్ కమాండర్ల చర్చలు జరిగాయి. 'లఢాఖ్‌లో మాదిరిగానే పెట్రోలింగ్ పాయింట్లు మరోసారి చేజారిపోయాయని స్థానికులు నివేదించారు. చైనా అరుణాచల్ ప్రదేశ్‌లోని మన పట్టణాల పేర్లను మారుస్తూనే ఉంది. మన పర్యావరణ, జల భద్రతకు ముప్పు కలిగించే 60,000మెగావాట్ల ఆనకట్టను నిర్మిస్తోంది' అని కాంగ్రెస్ నాయకుడు ఎక్స్‌లో పేర్కొన్నారు. గత ఏడాది 99 బిలియన్ డాలర్లుగా ఉన్న చైనాతో భారతదేశ వాణిజ్య లోటు, 2025–26 నాటికి రికార్డు స్థాయిలో 112 బిలియన్ డాలర్లకు మరింత పెరిగిందని జైరామ్ రమేశ్ ఎత్తి చూపారు. 'ఇది అనేక పరిశ్రమలలోని మన ఎంఎస్ఎంఇలను పూర్తిగా దెబ్బతీసింది. మేక్ ఇన్ ఇండియా కాస్తా చైనా నుండి దిగుమతిగా మారింది. ఈ భారీ వాణిజ్య లోటు మన ఆర్థిక భద్రతకు చాలా పెద్ద ముప్పు' అని రమేశ్ అన్నారు. '2020 జూన్ 19న, మన 20 మంది ధైర్యవంతులైన జవాన్లు అమరవీరులైన తర్వాత, మన సీమాలోకి ఏ వాహనం ప్రవేశించలేదు, ఎవరూ లోపలికి రాలేదు, ఏ పోస్టు ఇతరుల స్వాధీనంలో లేదు అని ప్రధాని చైనాకు ఇచ్చిన అపఖ్యాతి పాలైన క్లీన్ చిట్‌కు భారతదేశం మూల్యం చెల్లిస్తోంది' అని రమేశ్ అన్నారు. లఢాఖ్‌లో చైనా చొరబాట్లు జరిగినప్పుడు, తాను నాయకత్వంలో ఉన్నప్పుడు తనకు అందిన ఏకైక ఆదేశం 'జో ఉచిత్ సమఝో వో కరో' (ఏది అర్థమైతే అది చేయండి) అని రిటైర్డ్ ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్, జనరల్ ఎం.ఎం. నరవాణే వెల్లడించారని ఆయన చెప్పారు.

**సరిహద్దులో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయి: ఐటిబిపి చీఫ్**

చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) డిజి శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద భారత్‌చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. ''అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణల సమయంలో ఐటిబిపికి చెందిన శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారు' అని శత్రుజీత్ పేర్కొన్నారు. ఐటిబిపి సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ''పర్వత ప్రాంతంలో పోరాడే గెరిల్లా దళంగా తొలుత ఐటిబిపిని ఏర్పాటు చేశారు. 2004లో మనకు చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారు'' అని అన్నారు.

# సామాజిక రుగ్మతలను ఎదుర్కోవడానికి సమష్టి కృషి

**విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా ఏకం కావాలని ప్రధాని మోదీ పిలుపు**



**న్యూఢిల్లీ:** దశాబ్దాలుగా తలెత్తుతున్న సవాళ్లు, సామాజిక రుగ్మతలను పరిష్కరించడానికి, విచ్ఛిన్నకర శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయడానికి, పౌరులను స్వావలంబన వైపు ప్రేరేపించడానికి సమష్టి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. శుక్రవారం ఢిల్లీలో చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభించారు. వేదాంత, భగవద్గీత జ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి అంకితమైన ప్రపంచ ఆధ్యాత్మిక ఉద్యమమైన చిన్మయ మిషన్ వ్యవస్థాపకుడు స్వామి చిన్మయానంద దార్శనికతను ముందుకు తీసుకువెళ్తూ, గత 25 ఏళ్లుగా తాను ప్రభుత్వ అధినేతగా తన శక్తి మేరకు దేశానికి సేవ చేశానని మోదీ అన్నారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ కాదని, అదొక ఆలోచనా విధానమని, 'చిన్మయ' అంటే శుద్ధ చైతన్యమని ఆయన అన్నారు. 'దశాబ్దాలుగా కాలం మారింది, కొత్త సవాళ్లు తలెత్తాయి, కొత్త సామాజిక రుగ్మతలు బయటపడ్డాయి. ఈ రోజు వాటిని పరిష్కరించే బాధ్యత మనందరిపై ఉంది' అని మోదీ అన్నారు. 'విభజన శక్తులకు వ్యతిరేకంగా మనం సమాజాన్ని ఏకం చేయాలి. పౌరులను స్వావలంబన వైపు ప్రేరేపించాలి, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే దార్శనికతతో ప్రతి ఒక్కరినీ అనుసంధానించాలి. ఈ లక్ష్యాల కోసం, మనం మరింత చురుగ్గా వ్యవహరించాలి' అని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో స్వామి చిన్మయానంద వంటి దూరదృష్టి గల మహనీయుల ఆలోచనలు, నేడు దేశం తన బాధ్యతలను నెరవేరుస్తున్న దిశను ప్రతిబింబిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. 'మన విద్యా వ్యవస్థ నవజాత భారతదేశం అవసరాలను తీర్చేలా చూసేందుకు, మేము జాతీయ విద్యా విధానాన్ని (ఎన్ఇపి) ప్రవేశపెట్టాము. ఈ కొత్త విధానం భారతీయ విజ్ఞాన వ్యవస్థలకు, మాతృభాషలలో బోధనకు, ఆధునిక విజ్ఞానానికి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది' అని ఆయన అన్నారు. భారతదేశం నుండి దొంగిలించబడిన సాంస్కృతిక కళాఖండాలను తిరిగి తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలను కూడా మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. గతంలో లెక్కలేనన్ని అమూల్యమైన విగ్రహాలను విదేశాలకు తరలించి, వాటి అదృశ్యంపై ఎవరూ ప్రశ్నించకుండానే అమ్ముకున్నారని ఆయన అన్నారు. గత 12 ఏళ్లలో, తాము దొంగిలించబడిన 650కి పైగా పురాతన విగ్రహాలను తిరిగి తీసుకువచ్చామని, అంతేకాకుండా, మన సాంస్కృతిక వారసత్వ ప్రదేశాలు యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో భాగమవుతున్నాయి అని ఆయన అన్నారు. 2047లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయినప్పుడు, చిన్మయ మిషన్ కూడా తన శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# కేరళం గవర్నర్‌గా మాథుర్ ప్రమాణం



**తిరువనంతపురం :** కేరళం 29వ గవర్నర్‌గా ఓం ప్రకాష్ మాథుర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. లోక్‌భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సౌమెన్ సేన్ మాథుర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి వి.డి. సతీసన్, ఇతర కేబినెట్ మంత్రులు హాజరయ్యారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా హాజరయ్యారు. అయితే, ప్రధాన ప్రతిపక్ష కూటమి అయిన ఎల్‌డిఎఫ్ నాయకులు పాల్గొనలేదు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందు, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జారీ చేసిన నియామక ఉత్తర్వును చదివి వినిపించారు. అనంతరం, మాథుర్ హిందీలో ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమం 10 నిమిషాలకు పైగా కొనసాగింది. కార్యక్రమానికి హాజరైన కొందరు ప్రముఖులతో గవర్నర్ కూడా ముచ్చటించారు. మాథుర్ రాజస్థాన్‌లోని పాలి జిల్లా, బాలి తహసీల్‌లోని బేడల్ గ్రామానికి చెందినవారు. రాజస్థాన్ విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులై, ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా ప్రజా జీవితంలోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఆయన గుజరాత్ ఇన్‌చార్జి బిజెపి ప్రధాన కార్యదర్శిగా, రాజస్థాన్ నుండి రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. తమిళనాడు గవర్నర్‌గా నియమితులైన రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ స్థానంలో మాథుర్ నియమితులయ్యారు.

## నక్సలిజం బాధను వీడి...

# పురోగమిస్తున్న ఛత్తీస్‌గఢ్

**అడవులను రక్షించాలి, చెట్లను నాటాలి : రాష్ట్రపతి ముర్ము పిలుపు**



**జగదల్‌పూర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కృషితో నక్సలిజం నుండి ఛత్తీస్‌గఢ్ విముక్తి పొందిందని, మావోయిస్టు హింస తాలూకు బాధను వెనుక వదిలి ఇప్పుడు ప్రగతి పథంలో పయనిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం అన్నారు. బస్తర్ జిల్లా కేంద్రమైన జగదల్‌పూర్‌లోని లాల్‌బాగ్ మైదాన్‌లో జరిగిన 'బస్తర్ దసరా ఫెస్టివల్ 2026' కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. దేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణంలో గిరిజన యువత చురుకుగా పాల్గొంటుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. చెట్లు, మొక్కలను జీవించే దేవుళ్లుగా అభివర్ణిస్తూ, జీవనాన్ని కొనసాగించడానికి అవసరమైన వాటిని అవే అందిస్తాయని, ప్రజలు అడవులను రక్షించాలని, మరిన్ని చెట్లను నాటాలని రాష్ట్రపతి ముర్ము కోరారు. 'ఛత్తీస్‌గఢ్ చాలా కాలం పాటు నక్సలిజం భూతాలతో పోరాడింది. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త కృషితో ఛత్తీస్‌గఢ్ నక్సలిజం భూతాల నుండి విముక్తి పొందింది, వేగంగా ప్రగతి పథంలో పయనిస్తోంది' అని ఆమె అన్నారు. నక్సల్ హింస వల్ల కలిగిన బాధను వెనుకకు నెట్టి, ఛత్తీస్‌గఢ్ వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆమె అన్నారు. నేడు ఛత్తీస్‌గఢ్ ముందు అనేక అభివృద్ధి మార్గాలు తెరుచుకుంటున్నాయని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. గిరిజన పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సౌకర్యాలు కల్పించేందుకు, వారిని మార్కెట్లతో అనుసంధానించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను వేగవంతం చేశారని తమ సమాచారం అందిందన్నారు. సమానత్వ అభివృద్ధి ద్వారా 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యాన్ని సాధించడానికి ఈ ప్రయత్నాలు సహాయపడతాయని విశ్వసిస్తున్నట్లు రాష్ట్రపతి తెలిపారు. ఒక చెట్టు పెరగడానికి సంవత్సరాలు పడుతుందని గుర్తుచేస్తూ, ప్రజలు చెట్లను పూజించడమే కాకుండా, వాటిని నాటి, పెంచే బాధ్యతను కూడా తీసుకోవాలని ఆమె అన్నారు. ప్రజలు దేవుడిని చూడలేకపోవచ్చు, కానీ పండ్లు, పువ్వులు, ఔషధాలను అందించి జీవనాన్ని నిలబెట్టే చెట్లు, మొక్కలను చూడగలరని ముర్ము అన్నారు. ఈ కోణంలో, చెట్లు, మొక్కలే నిజంగా మన సజీవ దేవుళ్ళు అని ఆమె పేర్కొన్నారు. వ్యవసాయ భూముల్లో, బీడు భూముల్లో, అందుబాటులో ఉన్న ఇతర ఖాళీ ప్రదేశాల్లో చెట్లు నాటాలని రాష్ట్రపతి గిరిజన వర్గాలను, సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను కోరారు.

# వివాదాస్పద ఆడియో క్లిప్‌పై ఫోరెన్సిక్ విచారణ

**మహారాష్ట్ర సిఎం ఫడ్నవీస్ ఆదేశం**



**నాగ్‌పూర్/ముంబయి :** వివాదాస్పద ఆడియో క్లిప్‌పై మహారాష్ట్ర అధికార కూటమిలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ శుక్రవారం ఫోరెన్సిక్ విచారణకు ఆదేశించారు. డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను అంతం చేసేందుకు బిజెపి అంతర్గత వర్గాలు మరాఠా కోటా కార్యకర్త మనోజ్ జరంగేతో కలిసి కుట్ర పన్నాయని శివసేన నాయకుడు రామ్‌దాస్ కదమ్ ఆరోపించారు. శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే ద్వారా తనకు రూ. 500 కోట్లు అందాయని జరంగే పేర్కొన్నట్లుగా ఉన్న ఆడియో క్లిప్‌ను ఫోరెన్సిక్ పద్ధతుల్లో క్షుణ్ణంగా విచారిస్తామని ఫడ్నవిస్ నాగ్‌పూర్‌లో తెలిపారు. కొన్ని గంటల తర్వాత, కదమ్ ముంబయిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఒక మరాఠా నాయకుడిని రాజకీయంగా అంతం చేసేందుకు బిజెపిలోని ఒక వర్గంతో జరంగే కుమ్మక్కయ్యారని ఆరోపించారు. మహారాష్ట్ర శాసన మండలి ఎన్నికల్లో నాగ్‌పూర్ గ్రాడ్యుయేట్స్ స్థానానికి ఓటు వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంపై విచారణ కోరుతూ ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన ప్రతినిధి బృందం తనను కలిసినట్లు ఫడ్నవిస్ తెలిపారు. ఆ ఆడియోలో పేర్లు బయటపడిన కొందరు బిజెపి నాయకులను కూడా షిండే నేతృత్వంలోని శివసేన ప్రశ్నించింది. 'మనందరి మనసులో ఒకే ప్రశ్న ఉంది: రెండున్నర సంవత్సరాల తర్వాత ఈ సంభాషణలు ఇప్పుడు ఎందుకు వెలుగులోకి వచ్చాయి? ఇవి బయటపడటం వెనుక అసలు ఉద్దేశ్యాలు ఏమిటి? ఎవరిని లక్ష్యంగా చేసుకున్నారు? ఏ ఉద్దేశ్యంతో? ఈ విషయంలో చాలా ప్రశ్నలు ఉన్నాయి' అని ఫడ్నవిస్ అన్నారు. ఆ ఆడియోపై విచారణ జరపాలని జరంగే కూడా డిమాండ్ చేశారని ఆయన చెప్పారు. కాగా, తనను అణచివేసి, మరాఠా ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు కుట్ర జరిగిందని ఆరోపిస్తూ, జరంగే గురువారం జల్నాలో ఒక ఆడియో క్లిప్‌ను విడుదల చేశారు. జరంగే బిజెపి నుంచి రూ. 500 కోట్లు పొంది, ఆ సొమ్మును తన కుమారుడు, ఎంపి అయిన శ్రీకాంత్ షిండే ద్వారా మళ్లించారన్న ఆరోపణలను నిరూపించాలని ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సవాలు విసిరిన తర్వాత ఆయన ఈ రికార్డింగ్‌ను బహిరంగపరిచారు.

# పోలింగ్ బూత్‌లో పార్టీ స్కార్ఫ్ ధరించడమేంటి?

**బిజెపి అభ్యర్థిపై ఎన్‌సిపి (ఎస్‌పి) నేత సుప్రియా సూలే ఆగ్రహం**



**పుణె :** మహారాష్ట్ర శాసన మండలి ఎన్నికల సందర్భంగా పుణెలో ఓటు వేస్తున్నప్పుడు బిజెపి అభ్యర్థి కౌస్తుభ్ గావడే పార్టీ స్కార్ఫ్ ధరించి ఉన్నట్లుగా కనిపిస్తున్న ఒక వీడియోపై ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకురాలు సుప్రియా సూలే శుక్రవారం అధికారులను వివరణ కోరారు. సోషల్ మీడియా పోస్ట్‌లో, పుణె ఉపాధ్యాయ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి అయిన గావడేకు సంబంధించిన వీడియోను పంచుకుంటూ, ఈ ఘటన ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందా అని సూలే ప్రశ్నించారు. పోలింగ్ కేంద్రంలో, ప్రతి ఒక్కరూ తమ రాజకీయ గుర్తింపును పక్కనపెట్టి, ఒక సాధారణ ఓటరుగా ప్రవేశించాలని, ప్రతి ఒక్కరూ ఈ పవిత్రమైన ప్రజాస్వామ్య ప్రక్రియ పవిత్రతను, పోలింగ్ కేంద్రాల నిష్పక్షపాతాన్ని కాపాడాలి అని సూలే అన్నారు. పార్టీ గుర్తు ధరించి పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించడానికి అభ్యర్థిని ఎలా అనుమతించారని, ఇలాంటి వెసులుబాటు కేవలం అధికార పార్టీ అభ్యర్థులకు మాత్రమే కల్పిస్తున్నారా అని ఆమె ప్రశ్నించారు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కాదా? అని నిలదీశారు. ఉల్లంఘనలకు సంబంధించి అభ్యర్థిపై ఎలాంటి చర్య తీసుకుంటారో మహారాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని సూలే డిమాండ్ చేశారు. బిజెపి స్కార్ఫ్‌తో గావడే పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించారన్న ఆరోపణలపై పుణె ఉపాధ్యాయ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి ప్రొఫెసర్ సచిన్ సనాప్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. 78 మంది సభ్యులున్న మహారాష్ట్ర శాసన మండలి (ఎమ్మెల్సీ)లోని ఐదు స్థానాలకు — మూడు పట్టభద్రుల, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు — శుక్రవారం ద్వివార్షిక ఎన్నికలు జరుగుతున్నాయి. బిజెపి, ఏక్‌నాథ్ షిండే శివసేన, సునేత్ర పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపిలతో కూడిన మహాయూతి, అలాగే కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి), ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన (యుబిటి)లతో కూడిన ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) కూటమి మొత్తం ఐదు స్థానాల్లోనూ పోటీ చేస్తున్నాయి. అక్టోబర్ 27న ఓట్ల లెక్కింపు జరగనుండగా, అక్టోబర్ 31 నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు.

## భారతీయ, విదేశీ పౌరుల కోసం...

# 'వేర్వేరు కలర్స్ ఆధారిత డ్రైవింగ్ లైసెన్స్'లు




**న్యూఢిల్లీ :** డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీలో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. భారతీయ, విదేశీ పౌరులకు జారీచేసే, లేదా పునరుద్ధరించే డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం 'వేర్వేరు రంగుల పథకాలను' ప్రవేశపెట్టాలని, అలాగే, వయస్సు, చిరునామా రుజువుగా ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ లేదా నోటరీ ముందు ప్రమాణం చేసిన అఫిడవిట్లను రద్దు చేయాలని రోడ్డు రవాణ మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంఒఆర్‌టిహెచ్) కేంద్ర మోటారు వాహనాల నిబంధనలకు చేసిన ముసాయిదా సవరణలో, డ్రైవింగ్ లైసెన్స్‌లపై వాహనదారు డి బ్లడ్ గ్రూప్. మొబైల్ నంబర్, అత్యవసర సంప్రదింపుల ఫోన్ నెంబర్లను తప్పనిసరిగా పొందుపరచాలని ప్రతిపాదించింది. 'లైసెన్సింగ్ అథారిటీ జారీ చేసే లేదా పునరుద్ధరించే ప్రతీ డ్రైవింగ్ లైసెన్స్ ఫారం–7లో లామినేటెడ్ లేదా పాలీవినైల్ క్లోరైడ్ (పివిసి) కార్డు రూపంలో ఉండాలి. ఆ ఫారంలో భారతీయ పౌరులు, విదేశీ పౌరులకు జారీచేసే లేదా పునరుద్ధరించే డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వరుసగా వేర్వేరు ఫార్మాట్‌లు ఉండాలి' అని ముసాయిదా నోటిఫికేషన్ పేర్కొంది. దుర్వినియోగాన్ని నివారించడానికి వయస్సు, చిరునామా రుజువుగా అఫిడవిట్లు, జీవిత భీమా పాలసీలను కూడా అంగీకరించాలని మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది. సురక్షిత డ్రైవింగ్ ట్యుటోరియల్ అసెస్‌మెంట్ కోసం అర్హత పరిమితిని 60శాతం నుంచి 75 శాతానికి పెంచాలని, అలాగే, ఆధార్ ప్రామాణీకరణ ద్వారా పూర్తి చేసే ఎంపిక చేసిన ఆన్‌లైన్ డ్రైవింగ్ లైసెన్స్ సేవలకు ఫీజు మినహాయింపు ఇవ్వాలని ఇది ప్రతిపాదించింది. డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనలకు ప్రతిపాదిత మార్పుల లక్ష్యం, మదింపు అవసరాలను కఠినతరం చేయడమేనని ఒక సీనియర్ అధికారి తెలిపారు. కేంద్ర మోటారు వాహనాల నిబంధనలకు చేసిన ముసాయిదా సవరణలలో సురక్షిత డ్రైవింగ్ ట్యుటోరియల్ కనీసం అరగంట (30 నిమిషాలు) పాటు జరగాలని ఎంఒఆర్‌టిహెచ్ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదన ప్రకారం లైసెన్సింగ్ అధికారులు పేరు, చిరునామాతో సహా, డ్రైవింగ్ లైసెన్స్ వివరాలను మార్చడానికి చేసే దరఖాస్తులను తిరస్కరణకు గల కారణాలతో సహా 15రోజుల్లో ఆమోదించాలి లేదా తిరస్కరించాలి. దరఖాస్తుదారుడి పేరు, చిరునామాతో సహా వ్యక్తిగత వివరాలలో మార్పులకు రుసుములను తొలగించాలని కూడా ఇది ప్రతిపాదించింది. ముసాయిదా నిబంధనలు దరఖాస్తుదారులు ఉపయోగించగల డాక్యుమెంట్స్ గుర్తింపు, వయస్సు, నివాస ధృవీకరణ పత్రం ఉన్నాయి. ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు గుర్తింపు కార్డు, ఇ–రేషన్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, తదితర ఇతర డాక్యుమెంట్లు కూడా ఈ జాబితాలో చేర్చబడ్డాయి. ప్రతిపాదన ప్రకారం, లైసెన్సింగ్ అథారిటీ జారీ చేసిన లేదా పునరుద్ధరించిన ప్రతీ డ్రైవింగ్ లైసెన్స్ ఫారం–7లో లామినేటెడ్ లేదా పాలీవినైల్ క్లోరైడ్ ( పి విసి) కార్డు రూపంలో ఉంటుంది. ముసాయిదా నోటిఫికేషన్ ప్రచురించిన 30రోజుల్లోగా భాగస్వాముల నుంచి అభ్యంతరాలు, సూచనలను ఆహ్వానిస్తోంది.

**CHANGE OF NAME**

I, **VALLURI RAJU, S/o. BULLIRAJU,** R/o. Plot No. 462, Dommarapochampally, Dundigal - Gandimaisamma Mandal, Medchal-Malkajgiri Dist., T.S. I have change my minor son name from **VALLURI BULLIRAJU** (Old name) to **VALLURI ANJI PRASAD** (New name), (Age: 16 years) for all future purpose.

**CHANGE OF NAME**

I, Matta Laxmi Sampoorna @ Matta Lakshmi Sampoorna, W/o. Matta Narasimha Reddy, R/o. Kodad Town, Kodad Mandal, Village, Suryapet District. in my Passport Bearing No. E9387570 My Name mentioned as Matta Lakshmi Sampoorna. in my Aadhar Card & Pan Card My Name mentioned Matta Laxmi Sampoorna. both the names of Matta Lakshmi Sampoorna (asper Passport) & Matta Laxmi Sampoorna (asper Aadhar Card & Pan Card) belongs to me and one only

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శనివారం
24-10-2026
www.prajapaksham.in
ప్రపంచం
WORLD NEWS

## సెర్బియాలో ఉత్కంఠభరిత ఎన్నికలు..
# వుసిచ్ పాలనకు విద్యార్థుల సవాల్



**బెల్గ్రేడ్ :** బాల్కన్ దేశమైన సెర్బియాలో ఈ వారాంతంలో ముందస్తు పార్లమెంటు ఎన్నికలు జరగనున్నాయి. గత 14 ఏళ్లుగా అధికారంలో ఉన్న అలెగ్జాండర్ వుసిచ్, ఆయనకు చెందిన మితవాద ప్రజాకర్షక పార్టీ సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎస్ఎన్ఎస్)ను ఓడించేందుకు పెద్ద ఎత్తుల ఉద్యమం చేస్తున్న విద్యార్థులు తమ పార్టీ ద్వారా ప్రయత్నిస్తున్నారు. 2024లో నోవీ సాడ్ రైల్వే స్టేషన్‌లో పైకప్పు కూలి 16 మంది మరణించిన ఘటన అనంతరం విద్యార్థుల నిరసనలు ప్రారంభమయ్యాయి. బాధ్యత వహించాలని, అవినీతిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యమం ఇప్పుడు స్టూడెంట్స్ లిస్ట్ పేరుతో ఎన్నికల్లో పోటీ చేస్తోంది. సుమారు 64 లక్షల మంది ఓటర్లు తమ ప్రతినిధులను ఎన్నుకోనున్నారు. ఎన్నికల పారదర్శకత, మీడియాపై ప్రభుత్వ నియంత్రణ, కార్యకర్తలపై నిఘా, నిరసనకారుల అరెస్టులపై యూరోపియన్ యూనియన్, అంతర్జాతీయ పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేశారు. పుతిన్ మద్దతు తనకు ఉందని వుసిచ్ ప్రచారంలో పేర్కొన్నారు. మరోవైపు, అవినీతి, వ్యవస్థీకృత నేరాలతో సంబంధాలు, ప్రజాస్వామ్య స్వేచ్ఛలపై ఆంక్షలు విధిస్తున్నారంటూ ఆయనపై విమర్శలు వస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను వుసిచ్ ఖండించారు. విద్యార్థుల ఉద్యమం న్యాయం, చట్టబద్ధ పాలన పునరుద్ధరణే లక్ష్యంగా ప్రచారం చేస్తోంది. ఎన్నికల ఫలితాలు సెర్బియా రాజకీయ భవిష్యత్తుతో పాటు యూరోపియన్ యూనియన్‌తో దాని సంబంధాలపై ప్రభావం చూపనున్నాయి. ఓటింగ్ ఆదివారం ముగియనుండగా, అధికారిక ఫలితాలు సోమవారం వెలువడే అవకాశం ఉంది.

# టిబెట్‌లో భారీ భూకంపం

- 16 మంది మృతి, 76 మందికి గాయాలు



**బీజింగ్/లాసా :** చైనాలోని టిబెట్ స్వయంప్రతిపత్తి ప్రాంతంలో సంభవించిన భారీ భూకంపంలో కనీసం 16 మంది మరణించగా, మరో 76 మంది గాయపడ్డారు. ముందుజాగ్రత్త చర్యగా 12,489 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. భూకంపం తీవ్రత రెక్టార్ స్కేల్‌పై 7.0 తీవ్రతగా నమోదైంది. నాగ్చు నగరంలోని బాకెన్ కౌంటీలో గురువారం రాత్రి భూకంపం సంభవించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులోనే ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 330కు పైగా ఇళ్లు కూలిపోవడం లేదా దెబ్బతినడం జరిగింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. చైనా ప్రభుత్వం అత్యవసర సహాయక చర్యల కోసం 5 కోట్ల యువాన్లు (సుమారు 75 లక్షల డాలర్లు) కేటాయించింది. పునరుద్ధరణ పనుల కోసం మరో 3 కోట్ల యువాన్లు కేటాయించింది. బాధితులకు గుడారాలు, తాత్కాలిక ఇళ్లు, పడకలు, దుప్పట్లు అందిస్తున్నారు. దెబ్బతిన్న ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. భూకంప కేంద్రం సముద్రమట్టానికి 4,800 మీటర్లకు పైగా ఎత్తులో ఉంది. రాబోయే మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మైనస్ 9 డిగ్రీల సెల్సియస్కు పడిపోయే అవకాశం ఉండటంతో సహాయక చర్యలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. కాగా, క్షతగాత్రులకు తక్షణ వైద్యం అందించాలని, గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగించాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆదేశించారు. భారత, యురేషియా భూఫలకాలు ఢీకొనే ప్రాంతంలో ఉన్న టిబెట్ పీఠభూమి తరచూ భారీ భూకంపాలకు గురవుతుంది.

## హైటెక్ పెట్టుబడులపై అమెరికా ఆంక్షలు!
# చైనా అభ్యంతరాలు



**వాషింగ్టన్ :** చైనా, రష్యా, ఉత్తర కొరియా సహా ఆందోళనకర దేశాల్లో అమెరికా సంస్థలు చేసే అధునాతన సాంకేతిక పెట్టుబడులపై కఠిన నియంత్రణలు విధించేందుకు అమెరికా ఆర్థిక శాఖ కొత్త నిబంధనను ప్రతిపాదించగా, ఈ చర్యను చైనా వ్యతిరేకించింది. కృత్రిమ మేధ (ఎఐ), సూపర్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, ధ్వని వేగం కంటే ఐదు రెట్లు వేగంగా ప్రయాణించే హైపర్సోనిక్ వ్యవస్థల్లో పెట్టుబడులను ఈ ప్రతిపాదన పరిధిలోకి తీసుకురానున్నారు. ఈ పెట్టుబడులు ప్రత్యర్థి దేశాల సైనిక సామర్థ్యాలను పెంచకుండా నిరోధించడం అమెరికా లక్ష్యం. 2023లో అప్పటి అధ్యక్షుడు జో బైడెన్ ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని, 2025లో కాంగ్రెస్ ఆమోదించిన చట్టం ద్వారా మరింత విస్తరించారు. కొత్త నిబంధన ప్రకారం 50 వేల డాలర్లకు మించిన పెట్టుబడులకు పరిమితులు వర్తించనున్నాయి. అయితే, స్టాక్ కొనుగోళ్లతో సహా అనేక ఆర్థిక పెట్టుబడులకు మినహాయింపులు ఉంటాయి. తుది నిబంధన ప్రకటించే ముందు ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం స్వీకరించనుంది. కాగా, ఈ ప్రతిపాదనపై చైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. మార్కెట్ ఆర్థిక వ్యవస్థ సూత్రాలను గౌరవించాలని, సాధారణ వాణిజ్య కార్యకలాపాల్లో జోక్యం చేసుకోవద్దని అమెరికాను కోరింది. తమ ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనా మధ్య సాంకేతిక ఆధిపత్య పోరు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది.

# 83.97శాతానికి చేరిక

**(మొదటి పేజీ తరువాయి)**

వాటాగా రూ 10,667.70 కోట్లు (42.12 శాతం), పన్నేతర రాబడి కింద రూ 5,754.24 కోట్లు (16.10 శాతం), కేంద్ర గ్రాంట్లుగా రూ 3,705.98 కోట్లు (15.34 శాతం) లభించాయి.

**తగ్గిన ఆదాయం.. పెరిగినఅప్పులు....**

రాష్ట్ర ఆదాయం తగ్గడంతో అప్పులు పెరిగాయి. 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్‌లో నికర అప్పుల అంచనాను రూ 61,457.16 కోట్లుగా నిర్దేశించుకోగా, మొదటి ఆరు నెలల్లోనే ఏకంగా రూ 44,612.16 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. వార్షిక రుణ పరిమితి లక్ష్యంలో సెప్టెంబరు నాటికే రాష్ట్ర ప్రభుత్వం 83.97 శాతాన్ని వినియోగించుకుంది. గత ఏడాది ఇదే సమయానికి అప్పుల శాతం 72.59 శాతంగా ఉన్నది. పబ్లిక్ డెట్ నికరంగా రూ 35,536.27 కోట్లు కాగా, పబ్లిక్ అకౌంట్ తదితర మార్గాల ద్వారా మిగిలిన మొత్తం సమీకరించారు.

**రెవెన్యూలోటు రూ.15,096.18 కోట్లు....**

రాష్ట్రంలో రెవెన్యూ రాబడులు రూ 92,013.18 కోట్లు రాగా, రెవెన్యూ వ్యయం రూ 1,07,109.36 కోట్లకు చేరింది. ఫలితంగా సెప్టెంబరు నాటికి రాష్ట్ర రెవెన్యూ లోటు ఏకంగా రూ 15,096.18 కోట్లకు చేరింది. బడ్జెట్ అంచనాలలో నికర రెవెన్యూ మిగులు రూ 6,857.76 కోట్లు ఉంటుందని ప్రభుత్వం భావించింది. ద్రవ్య లోటు రూ 44,612.16 కోట్లుగా నమోదైంది.

**భారంగా మారిన వడ్డీలు..**

**వడ్డీకే రూ. 16,565 కోట్ల చెల్లింపు...**

వడ్డీల చెల్లింపులు కూడా గత ఏడాదితో పోలిస్తే భారంగా మారాయి. గతేడాది తొలి ఆరు నెలల్లో వడ్డీల కోసం రూ 14,370.62 కోట్లు ఖర్చు కాగా, ఈ ఏడాది సెప్టెంబరు నాటికి రూ రూ 16,565.35 కోట్లకు పెరిగింది. మూలధన వ్యయం సెప్టెంబరు నెలలో ఒక్కసారిగా రూ 15,251.76 కోట్లు వెచ్చించడంతో మొత్తం ఆరు నెలల మూలధన వ్యయం రూ 27,290.79 కోట్లకు చేరింది. గత ఏడాది సెప్టెంబరు నాటికి మూలధన వ్యయం రూ 21,717.90 కోట్లుగా ఉంది. సెప్టెంబరు నాటికి పాత అప్పుల వడ్డీల చెల్లింపులకే రూ 16,565.35 కోట్లు (బడ్జెట్ అంచనాలో 77.76 శాతం), ఉద్యోగుల వేతనాల కోసం రూ 25,258.11 కోట్లు (52.23 శాతం), పింఛన్ల నిమిత్తం రూ14,235.36 కోట్లు (70.77 శాతం), సంక్షేమ సబ్సిడీల రూపంలో రూ10,298.44 కోట్లు (56.88 శాతం) వ్యయం చేసింది. 202627 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో రూ 10,598.33 కోట్లతో ప్రారంభమై, మేలో రూ 15,494.93 కోట్లు, జూన్‌లో రూ. 12,354.32 కోట్లు, జులైలో రూ14,556.82 కోట్లు, ఆగస్టులో రూ 16,093.02 కోట్లు, సెప్టెంబరులో రూ 13,455.54 కోట్ల క్రమంగా రూ 82,552.96 కోట్లకు చేరింది.

గతేడాది 202526లో మొదటి ఆరు నెలల కాలానికి ఏప్రిల్‌లో రూ 10,916.68 కోట్లు, మేలో రూ 11,692.33 కోట్లు, జూన్‌లో రూ 13,112.79 కోట్లు, జులైలో రూ 12,423.76 కోట్లు, ఆగస్టులో రూ 11,822.02 కోట్లు, సెప్టెంబరులో రూ 11,869.07 కోట్లతో మొత్తం రూ 71,836.65 కోట్లు లభించింది. 202627లో ఏప్రిల్‌లో రూ. 11,413.93 కోట్ల మేర రుణాలు తీసుకోగా, మే నెలలో సర్దుబాటు కారణంగా స్వల్ప ఉపశమనం లభించినప్పటికీ, జూన్‌లో రూ 11,323.25 కోట్లు, జులైలో రూ 11,810.75 కోట్లు,ఆగస్టులో రూ 555.23 కోట్లు, సెప్టెంబరులో రూ 10,326.95 కోట్ల రుణాలు సమీకరించడంతో నికర అప్పు రూ 44,612.16 కోట్లకు చేరింది.

## యెమెన్ తీరంలో పడవపై దాడి
# 14 మంది భారతీయులు క్షేమం



**దుబాయ్ :** యెమెన్ తీరంలో ఎర్ర సముద్రం సమీపంలో ఓ పడవ దాడికి గురైన ఘటనలో చిక్కుకున్న 14 మంది భారతీయులు క్షేమంగా ఉన్నట్లు భారత రాయబార కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. వారి భద్రత, సంక్షేమం కోసం నిరంతరం చర్యలు తీసుకుంటామని తెలిపింది. అరబ్ మీడియా కథనాల ప్రకారం, యెమెన్‌లోని హౌతీ ప్రతినిధి యాహ్యా సరీ మాట్లాడుతూ, యూకర్ ద్వీపం సమీపంలో సౌదీ దళాలు భారతీయులు ప్రయాణిస్తున్న పడవపై దాడి చేశాయని ఆరోపించారు. పడవలోని 14 మంది భారతీయులను హౌతీ దళాలు రక్షిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే, ఈ దాడికి సంబంధించి భారత రాయబార కార్యాలయం ఇప్పటివరకు బాధ్యులెవరనే విషయాన్ని నిర్ధారించలేదు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకునేందుకు వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ దళాలు, సౌదీ అరేబియా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇరు పక్షాలు పరస్పరం మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఇదిలా ఉండగా, సౌదీ అరేబియాలోని ఒక ప్రధాన విమానాశ్రయం, చమురు క్షేత్రంపై జరిగిన రెండు వేర్వేరు తాజా దాడుల్లో ఒక భారతీయుడు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు.

**వాస్తవాలను సేకరిస్తున్నాం: భారత్**

యెమెన్ తీరంలో పడవకు సంబంధించిన ఘటనలో భారతీయ నావికులు ఉన్నట్లు సమాచారం రావడంతో, దాని వాస్తవాలను నిర్ధారించేందుకు వివిధ వర్గాలను సంప్రదిస్తున్నట్లు భారత రాయబార కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. ఈ ఘటనకు సంబంధించిన కచ్చితమైన సమాచారం ఇంకా అందుబాటులో లేదని భారత రాయబార కార్యాలయం తెలిపింది. అక్టోబర్ 22న జరిగిన ఘటనపై విశ్వసనీయ సమాచారం అందిన వెంటనే వివరాలను వెల్లడిస్తామని పేర్కొంది. భారతీయుల భద్రత, సంక్షేమం కోసం అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చింది.

## ఉక్రేన్‌కు స్టార్‌షీల్డ్ సేవలపై ఆంక్షలపై
# ట్రంప్ ప్రభుత్వం భిన్న ప్రకటనలు



**వాషింగ్టన్ :** ఉక్రేన్‌కు చెందిన ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవల వినియోగంపై విధించిన పరిమితుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ప్రభుత్వ అధికారులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారు. దీంతో ఆంక్షలకు ఎవరు బాధ్యులనే అంశంపై వివాదం నెలకొంది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన స్టార్‌షీల్డ్, స్టార్ లింగ్ సేవలు ఉక్రేన్ డ్రోన్ కార్యకలాపాలు, సైనిక సమాచార వ్యవస్థలకు కీలకంగా ఉన్నాయి. గత వారం విధించిన వేగ పరిమితుల కారణంగా డ్రోన్లు పనిచేయకపోవడం, సైనిక కార్యకలాపాలకు అంతరాయం కలగడం వంటి సమస్యలు ఎదురయ్యాయని ఉక్రేన్ అధికారులు తెలిపారు. గురువారం సేవలు మళ్లీ పూర్తి వేగంతో పనిచేస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నప్పటికీ, శుక్రవారం నాటికి పరిమితులు కొనసాగుతున్నాయని ఉక్రేన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ సలహాదారు సెర్హీ బెస్క్రోస్నోవ్ వెల్లడించారు. స్టార్‌లింగ్ వేగ పరిమితి గంటకు సుమారు 160 కిలోమీటర్లుగా ఉన్నట్లు ఉక్రేన్ పరిస్థితులపై అవగాహన ఉన్న ఓ యూరోపియన్ అధికారి తెలిపారు. కాగా, ఈ ఆంక్షలతో సంబంధం లేదని ట్రంప్ అంటున్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ప్రైవేటు సంస్థల బాధ్యతను ప్రస్తావించగా, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అమెరికా ప్రభుత్వం ఆంక్షలు విధించలేదని చెప్పారు. అయితే, స్టార్‌షీల్డ్ అమెరికా ప్రభుత్వ ఆధీనంలో ఉందని, దాని వినియోగ పరిమితులను అమెరికా సైన్యమే నిర్ణయిస్తుందని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ గతంలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అమెరికా సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటాల్ విచారణ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. స్టార్‌లింగ్ సేవలపై ఆంక్షలు ఎవరు విధించారు, ఎందుకు విధించారు అనే ప్రశ్నలకు ఇంకా స్పష్టమైన సమాధానం లభించలేదు.

# ఇబ్బందులు

**(మొదటి పేజీ తరువాయి)**




20వేల మెగావాట్లకు పైగా విద్యుత్ వినియోగం జరిగింది. వచ్చే నాలుగు నెలలు సాగుకు చుక్కనీరు కూడా దొరకదు. తాగడానికి నీళ్లు లేవు. ఇక వ్యవసాయానికి నీళ్లు ఎలా ఇస్తాం? తాగునీటి అవసరాలు తీర్చుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదు. ఇది క్యాన్సర్ లాంటి నిజం. ముందే ప్రజలకు చెప్పడం మంచిది. సాగు నీరే లేనప్పుడు వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం అసాధ్యం. రిజర్వాయర్లలో 20శాతం కూడా నీటి నిల్వలు లేవు. కృష్ణా జలాల్లో 200 టిఎంసిలు కూడా లేవు. నీటిని పొదుపుగా వాడుకోవాలి. 8 నుంచి 10 నెలలపాటు ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోనున్నాం. ఎక్కువ ధర పెట్టి విద్యుత్ కొందామన్నా దొరకట్లేదు. కరెంటు విషయంలో పొదుపు మంత్రం పాటించాలి. ప్రభుత్వ ఆఫీసుల్లో పగలు ఫ్యాన్లు వేయొద్దు. ఎసిల వాడకాన్ని తగ్గించుకోవాలి. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలి. గడ్డుకాలం రానుంది. ప్రజలను అప్రమత్తం చేయాలి. పశుసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. బిఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టే ఓపిక మన నేతలకు ఉండట్లేదు. ప్రజలకు సరిగ్గా వివరించకపోతే మనం రాజకీయంగా దెబ్బతింటాం. మనం వాస్తవాలు చెప్పకపోతే బిఆర్ఎస్ నేతల ప్రచారాన్నే జనం నమ్ముతారు'' అని సిఎం వివరించారు. ''మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ప్రజల భాగస్వామ్యం లేకుండా కరవును ఎదుర్కోలేము. కరోనా సమయంలో కెసిఆర్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడారు. ఎండలకు కరోనా చచ్చిపోతుందని ఆనాడు కెసిఆర్ చెప్పారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు అని రాజకీయ దురుద్దేశంతో బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 100కు పైగా దేశాలపై ఎల్నినో ప్రభావం ఉంది. మహారాష్ట్ర లాంటి అభివృద్ధి చెందిన రాష్ట్రంలోనూ నీటి ఎద్దడి ఉంది. ఆ రాష్ట్రంలో 20 శాతం తక్కువ నీటిని వాడాలని నిర్ణయించారు. మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఎండల తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. కరవును ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించాం. కరవు, విపత్తులను, మనం నిలువరించలేము. కరవుపై 6 నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. 3 నెలల క్రితం ఎల్‌నినో ప్రభావం పెద్దగా లేదు. ఏదోలా వానాకాలం పంటల నుంచి బయటపడ్డాం. ప్రకృతి సృష్టించిన విపత్కర పరిస్థితిని అందరూ సమష్టిగా ఎదుర్కోవాలి'' అని సిఎం అన్నారు.

**ప్రజాప్రతినిధులంతా గ్రామాల బాట పట్టాలి**

''సంక్రాంతి తర్వాత నుంచి మే వరకు నాలుగు నెలల పాటు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయనున్నాం. సంక్రాంతి నుంచి మే వరకు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలి. ప్రజాప్రతినిధుల గ్రామ పర్యటనలను ప్రత్యేక యాప్ ద్వారా పర్యవేక్షిస్తాం. ఈ బాధ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగిస్తున్నాం. పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించే వారిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్యలు తీసుకుంటారు. కాంగ్రెస్ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ సభ్యులు కూడా ఈ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలి. గ్రామాల్లో, వ్యవసాయ భూముల్లో మట్టి పనుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తాం. ప్రతి మనిషికీ పని కల్పించాలి. ప్రతి ఒక్కరికీ కడుపు నిండా అన్నం పెట్టాలి. ఇందు కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలి'' అని సిఎం తెలిపారు.

**తాగునీటికి ప్రథమ ప్రాధాన్యం**

రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గాయని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని సిఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల పంపుసెట్లలో 15 లక్షల వరకు ఎండిపోయాయని పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున సాగునీటి కంటే తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. హైదరాబాద్‌తో పాటు పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నీటి సమస్యల పరిష్కారానికి టోల్ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. వానాకాలం పంటలను సాధ్యమైనంతవరకు రక్షించి, కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు.

**ఎల్‌నినోపై రాజకీయాలు కాదు.. ప్రజలకు అండగా నిలవాలి: డిప్యూటీ సిఎం**

'ప్రకృతి విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాదు.. ప్రజలకు అండగా నిలవడమే రాజకీయ పార్టీల బాధ్యత కావాలి' ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రం వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న వేళ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం విచారకరమని వ్యాఖ్యానించారు. ప్రజలకు మేలు చేసే సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ప్రతిపక్షాలు విమర్శలకే పరిమితం కావడం సమంజసం కాదని హితవు పలికారు. తెలంగాణలో సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాల కొరత ఉన్నట్లు అధికారిక నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు.

**కరువు ముప్పును ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా పనిచేయాలి: మహేశ్ కుమార్ గౌడ్**

కరువు ముప్పును ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా పనిచేయాలని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో కరువు పరిస్థితులు తలెత్తకుండా ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

# 'సర్' నిరసనలు

**(మొదటి పేజీ తరువాయి)**

'జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి, సర్ ఆపండి, ఓట్ల దొంగతనాన్ని సహించం' వంటి నినాదాలు చేశారు. ఈ నిరసనలో సిపిఐ, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ లకు చెందిన వందలాది మంది కార్యకర్తలతో పాటు పౌర సమాజం, కార్మిక సంఘాలు, రైతు సంఘాల సభ్యులు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి, ఎంపి పి. సందోష్ కుమార్, మరో సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, సిపిఐ ఢిల్లీ కార్యదర్శి, జాతీయ కార్యవర్గ సభ్యుడు ప్రొఫెసర్ దినేష్ వర్ష్నే, ఎఐవైఎఫ్ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా, ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి సుఖ్జిందర్ మహేసరి, ఎఐఎస్ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్, సిపిఐ(ఎం) నాయకురాలు బృందా కరత్, అఖిల భారత ప్రజాస్వామ్య మహిళా సంఘం (ఐద్వా), అఖిల భారత ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (ఐఎడిఎస్) సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఢిల్లీ, హర్యానా, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌ల నుంచి కార్యకర్తలు పాల్గొనగా, క్రాంతికారి యువ సంఘటన్ (కెవైఎస్), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఈ యాత్రకు తమ మద్దతును ప్రకటించాయి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ అర్హులైన ఓటర్లను మినహాయించడానికి దారితీస్తుందని ప్రతిపక్ష పార్టీలు, పౌర సమాజ సమూహాలు ఆరోపించడంతో, ఈ నిరసన ఆ సవరణకు వ్యతిరేకంగా జరుగుతున్న విస్తృత సమీకరణలో ఒక భాగంగా నిలిచింది. 'ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి, ఓటర్ల జాబితాను సరిదిద్దాలి, ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అని భారతీయ కిసాన్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి యుధ్వీర్ సింగ్ అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని సిపిఐ(ఎం) సీనియర్ నాయకురాలు కరత్ అన్నారు.

'ఎస్ఐఆర్‌ను ఆపడం, ఓట్ల దొంగతనాన్ని అరికట్టడమే మా ప్రధాన లక్ష్యం. ఓటు వేయడం రాజ్యాంగ హక్కు, మీరు దానిపై దాడి చేస్తున్నారు. ప్రతిరోజూ కొత్త ఆధారాలు వెలుగులోకి వస్తున్నా, మీరు ఇలా చేస్తున్నారు' అని ఆమె అన్నారు. రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని సిపిఐ రాజ్యసభ ఎంపి పి. సంతోష్ కుమార్ తెలిపారు. 'ఆందోళన కొనసాగుతుంది... జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి; ఆయన్ని ఎవరూ కాపాడలేరు. రాబోయే రోజుల్లో మా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. ప్రధానమంత్రి మాటలు జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడలేవు; ఆయన వెళ్ళిపోవాలి. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి మేము సిద్ధంగా ఉన్నాం' అని సందోశ్ కుమార్ అన్నారు. 'ఇది జంతర్ మంతర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడం గురించి కాదు; ఇది ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని కాపాడటం గురించి' అని ఒక నిరసనకారుడు అన్నారు. జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుండి తొలగించినందున, దేశవ్యాప్తంగా ప్రతి వీధి జంతర్ మంతర్‌గా మారుతుందని, భారతదేశవ్యాప్తంగా పలు సంస్థలు ప్రకటించిన ప్రదర్శనలను ఉదహరిస్తూ మరో నిరసనకారుడు అన్నారు. రైతులు, కార్మికులు, యువత, మహిళలు, సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు జాతీయ జెండాను చేతబట్టుకుని ఈ ప్రదర్శనలలో పాల్గొనాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ నిరసన తీర్మానాల ఆమోదం, జాతీయ గీతాలాపనతో ముగుస్తుందని వారు తెలిపారు. ఈ నిరసన ప్రదర్శనల దృష్ట్యా, మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు సెంట్రల్ ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేశారు. బంగ్లా సాహిబ్ గురుద్వారా, కన్నాట్ ప్లేస్, పార్లమెంట్ స్ట్రీట్, జంతర్ మంతర్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. ప్రభావిత ప్రాంతాల్లో అనవసర ప్రయాణాలను నివారించాలని, తమ ప్రయాణాలను ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని, ట్రాఫిక్ సిబ్బంది జారీ చేసిన సూచనలను పాటించాలని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ప్రయాణికులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై, ఓటర్ల జాబితా నుండి ఓటర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలపై ప్రతిపక్ష పార్టీలు, వివిధ సంస్థలు వ్యక్తం చేస్తున్న ఆందోళనల మధ్య ఈ నిరసన జరుగుతోంది.

# భూముల గుర్తింపు

**(మొదటి పేజీ తరువాయి)**

ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే, మరోవైపు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూములను ప్రాతిపదికన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, ఆర్‌డిఓలు, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం, రెండో, మూడో విడతలకు అవసరమైన భూముల గుర్తింపు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేదవారికి సొంత ఇంటిని అందించడమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని, భూముల గుర్తింపు నుంచి నిర్మాణాల ప్రారంభం వరకు ప్రతి దశలోనూ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. క్యూర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా మూడు విడతల్లో పనులు చేపడతామన్నారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గానికి సుమారు 500 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని, దీనికి సంబంధించి స్థలాల సేకరణను వేగవంతం చేయడంతో పాటు తదుపరి విడతల నిర్మాణాలకు కూడా ముందస్తుగా భూములను సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. మరోవైపు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ హౌసింగ్ కార్పొరేషన్ రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ డ్రా నిర్వహించనున్నట్లు చెప్పారు. డ్రా ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేయడంతో పాటు, యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచుతామని, లబ్ధిదారులు ఎప్పుడైనా తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా సరిచూసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు.

# జర్నలిస్టుల సదస్సు

**(మొదటి పేజీ తరువాయి)**

కీలకోపన్యాసం చేయగా, గౌరవ అతిథులుగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రత్యేక అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస రెడ్డి, కర్నాటక రాష్ట్ర మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి హాజరుకానున్నారు. విశిష్ట అతిథులుగా మెఫి మేనేజింగ్ ట్రస్టీ, ఐజెయు మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఐజెయు అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ సోమసుందర్, ఐజెయు మాజీ అధ్యక్షుడు ఎస్.ఎన్. సిన్హా పాల్గొననున్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ఆతిథ్యం ఇవ్వనుంది.

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మొత్తం ఐదు ప్రత్యేక సెషన్లు ఉంటాయి. మీడియా రంగంలో పనిచేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సవాళ్లు, పని ప్రదేశాల్లో భద్రత, లింగ వివక్ష, పని పరిస్థితులు, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యం,జర్నలిజంలో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఈ సెషన్లలో సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త గీతా శేషు, న్యూస్మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కనిజా గరారి, సీనియర్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ మాలిని సుబ్రమణ్యం, ప్రముఖ జర్నలిస్ట్ ఉమా సుధీర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ పద్మజా షా తదితరులు ప్రసంగిస్తారు.

**25 న ముగింపు సమావేశం**

ఈనెల 25న మధ్యాహ్నం జరిగే ' మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు' ముగింపు సమావేశానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన హాజరుకానున్నారు.

# ఆసియా పారా గేమ్స్‌లో భారత్ సెంచరీ

ఆసియా పారా గేమ్స్ 2026లో భారత అథ్లెట్లు అదుమ్మురేపుతున్నారు. ఇప్పటికే పతకాల సంఖ్యను 100 దాటించారు. ఐదో రోజు భారత అథ్లెట్లు ప్రపంచ రికార్డులతో పాటు స్వర్ణ పతకాలు అందుకున్నారు. షూటింగ్‌లో మోనా అగర్వాల్ అద్భుత ప్రదర్శనతో స్వర్ణం సాధించింది.

శుక్రవారం జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌మెచ్1 విభాగంలో 357.5 స్కోరుతో వరల్డ్ రికార్డ్ నమోదు చేసిన మోనా అగర్వాల్ పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఈ ఆసియా పారా గేమ్స్‌లో ఆమెకు ఇది రెండో స్వర్ణం కావడం గమనార్హం. చైనా ప్లేయర్ కుయి పింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల భారీ తేడాతో మోనా విజయం సాధించింది.








మరోవైపు అథ్లెటిక్స్‌లోనూ భారత హవా కొనసాగింది. టి 44 400 మీటర్ల స్ప్రింట్లో సందీప్ కుమార్ కేవలం 52.28 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి వరల్డ్ రికార్డుతో పాటు పసిడి పతకాన్ని సాధించాడు. ఈ పతకంతోనే భారత్ పతకాల సంఖ్య సెంచరీ దాటింది. ఇదే ఈవెంట్‌లో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో బ్రాంజ్ మెడల్ సాధించాడు. పురుషుల టి46 1500 మీటర్ల విభాగంలో ప్రమోద్ 4 నిమిషాల 9.65 సెకన్లలో రేసును పూర్తి చేసి రజత పతకం అందుకున్నాడు. శ్రీలంకకు చెందిన పువాకిటికండె 4 నిమిషాల 3.25 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

**భారత్‌కు డబుల్ ధమాకా.. ఒకే ఈవెంట్‌లో స్వర్ణం, రజతం...**

జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనీ తన చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లు విసిరి వరల్డ్ రికార్డ్ నెలకొల్పి పసిడి పతకాన్ని ముద్దాడాడు. ఇతర క్రీడల్లోనూ భారత్ జోరు కొనసాగింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 బ్యాడ్మింటన్ ఆల్ ఇండియన్ ఫైనల్‌లో ప్రమోద్ భగగ్‌ను ఓడించి నితేష్ కుమార్ పసిడి సాధించాడు. ప్రమోద్ భగత్‌కు రజతం దక్కింది. ఎస్ఎల్ 4 విభాగంలో నవీన్ శివకుమార్ 219, 2117 తేడాతో ఇండోనేషియా ప్లేయర్ ఫెర్డీపై విజయం సాధించి స్వర్ణం గెలవగా.. మహిళల సింగిల్స్ ఎస్యూ5 విభాగంలో తులసిమతి మురగేశన్‌కు రజతం దక్కింది. ఫైనల్లో ఆమె చైనా ప్లేయర్ యాంగ్ చేతిలో 18–21, 11–21 తేడాతో ఓటమిపాలైంది. పారా ఆర్చరీ పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి ద్వయం 5–1 తేడాతో చైనాపై గెలిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. శుక్రవారం భారత్ గెలిచిన తొలి బంగారు పతకం ఇదే కావడం గమనార్హం.

# గాయంతో ఇషాన్ ఔట్.. వైభవ్ ఇన్

న్యూజిలాండ్ పర్యటనను ఘనంగా ప్రారంభించిన టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. ఐదు టి–20ల సిరీస్‌లలో భాగంగా శనివారం క్రైస్ట్ చర్చ్ వేదికగా జరిగే రెండో టి20లో ఆతిథ్య న్యూజిలాండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఇదే వేదికగా గురువారం ఉత్కంఠగా సాగిన తొలి టి20లో టీమిండియా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇదే జోరులో రెండో టి–20లోనూ విజయం సాధించి సిరీస్‌లో పైచేయి సాధించాలనుకుంటున్న టీమిండియాకు మ్యాచ్‌కు ముందు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఈ గాయం కారణంగానే ఇషాన్ కిషన్ తొలి టి–20లో మూడో స్థానం కాకుండా తర్వాత బ్యాటింగ్ చేశాడు. ఇషాన్ కిషన్ గైర్హాజరీ కారణంగా టీమిండియా కాంబినేషన్‌లో మార్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



**వైభవ్ సూర్యవంశీకి అవకాశం..** ఇషాన్ కిషన్ వైదొలగడంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో అవకాశం దక్కనుంది. అభిషేక్ శర్మతో కలిసి వైభవ్ ఓపెనింగ్ చేయనుండగా.. సంజూ శాంసన్ ఫస్ట్ డౌన్‌లో ఆడే అవకాశం ఉంది. సంజూ, అభిషేక్ శర్మ తరహాలోనే వైభవ్ దూకుడుగా ఆడగలడు. కానీ ఫామ్‌లో ఉన్న సంజూ శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనింగ్ కాంబినేషన్ను డిస్టర్బ్ చేయవద్దనుకుంటే మాత్రం వైభవ్‌కు నిరాశే మిగులుతుంది. అప్పుడు శివమ్ దూబే తుది జట్టులోకి వస్తాడు. తద్వారా టీమిండియాకు ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ కూడా లభించనుంది. కానీ ఈ సాహసం మేనేజ్‌మెంట్ చేయకపోవచ్చు.

**నితీష్ రెడ్డిపై వేటు?**.....మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. కానీ ఎక్స్‌ట్రా స్పిన్నర్‌ను ఆడించాలనుకుంటే మాత్రం కుల్దీప్ యాదవ్ తుది జట్టులోకి వస్తాడు. తొలి టి–20లో న్యూజిలాండ్ స్పిన్నర్లు సాంట్నర్, బ్రేస్వెల్ సత్తా చాటారు. కానీ భారత్ ఏకైక స్పిన్నర్‌తోనే ఆడింది. ఈ క్రమంలోనే కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే నితీష్‌రెడ్డి బెంచ్‌కే పరిమితమవుతాడు. పేస్ విభాగాన్ని భువనేశ్వర్ కుమార్ లీడ్ చేయనున్నాడు. ప్రిన్స్ యాదవ్‌ను ఆడించాలనుకుంటే మయాంక్ యాదవ్ బెంచ్‌కే పరిమితమవుతాడు. అర్షదీప్ రెండో పేసర్‌గా ఆడనున్నాడు.

**న్యూజిలాండ్‌తో తొలి టీ20 ఆడే భారత జట్టు ఇదే...** అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి/కుల్దీప్ యాదవ్, నమన్ ధీర్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, మయాంక్ యాదవ్/ప్రిన్స్ యాదవ్, అర్షదీప్ సింగ్.

**భారత టి–20 టీమ్...**శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, నమన్ ధీర్, ప్రిన్స్ యాదవ్, మయాంక్ యాదవ్, అర్షదీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్.

## సైన్స్



## ఎంఎంఎక్స్ సుదీర్ఘ ప్రస్థానం

అంగారకుడి ఉపగ్రహమైన ఫోబోస్ నుంచి నమూనాలను భూమికి తీసుకురావాలనే లక్ష్యంతో జపాన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ జెఎఎక్స్ఎ (జాక్సా) ప్రయోగించిన మార్షన్ మూన్స్ ఎక్స్‌ప్లొరేషన్ (ఎంఎంఎక్స్) అంతరిక్ష నౌక లక్ష్యం దిశగా కొనసాగుతున్నది. ఈ మిషన్ అంగారకుడి ఉపగ్రహాల పుట్టుక, సౌరవ్యవస్థ పరిణామం గురించి శాస్త్రవేత్తలకు కొత్త ఆధారాలు అందించే అవకాశాలున్నాయి. ఈ అంతరిక్ష నౌకను జపాన్లోని తనెగషిమా అంతరిక్ష కేంద్రం నుంచి హెచ్3 రాకెట్ ద్వారా పంపించారు. ప్రయోగం జరిగిన సుమారు 71 నిమిషాల తర్వాత ఎంఎంఎక్స్ నౌక నిర్ణీత కక్ష్యలోకి చేరింది. ఫోబోస్, డీమోస్ అనే రెండు ఉపగ్రహాలు అంగారకుడిని పరిభ్రమిస్తున్నాయి. అవి గ్రహశకలాలుగా ఏర్పడి అంగారకుడి గురుత్వాకర్షణకు చిక్కాయా? లేక ప్రాచీన కాలంలో అంగారకుడిని మరో భారీ ఖగోళ వస్తువు ఢీకొట్టినప్పుడు వెలువడిన పదార్థంతో ఏర్పడ్డాయా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. ఎంఎంఎక్స్ 2027 నాటికి అంగారక గ్రహం కక్షకు చేరుతుంది. అనంతరం, అంగారకుడి రెండు ఉపగ్రహాలను పరిశీలిస్తుంది. ఫోబోస్‌పై చిన్న రోవర్ను దించి ఉపరితలాన్ని అధ్యయనం చేయడంతోపాటు, అక్కడి నుంచి కనీసం 10 గ్రాముల పదార్థాన్ని సేకరించేందుకు ప్రణాళిక రూపొందించారు. 2029 నాటికి ఫోబోస్ చేరనున్న ఎంఎంఎక్స్, కొన్ని నమూనాలను సేకరిస్తుంది. తిరిగి 2030లో, ఒకటి లేదా రెండు పర్యాయాలు నమూనాల సేకరణలో నిమగ్నమవుతుంది. 2031లో ఆ నమూనాలను భూమిపైకి తెస్తుంది. ఈ మిషన్ విజయవంతమైతే అంగారకుడి ఉపగ్రహాల నిర్మాణం, సౌరవ్యవస్థ ప్రారంభ దశల గురించి కొత్త విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. భవిష్యత్తులో ఇతర గ్రహాల నుంచి నమూనాలను సేకరించి తిరిగి తీసుకురావడానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానానికీ ఇది ఉపయోగపడుతుంది.

## అత్యంత వేగం
# క్వాంటం కంప్యూటర్ల సొంతం

క్వాంటం కంప్యూటర్లు కొన్ని సమస్యలను సాంప్రదాయ కంప్యూటర్ల కంటే చాలా తక్కువ సమాచారంతో, అసాధారణ వేగంతో పరిష్కరించగలవా? అలాంటి సామర్థ్యాన్ని చూపించే ప్రముఖ సాంకేతికతల్లో 'క్వాంటం ఫింగర్‌ఫ్రింటింగ్' ఒకటి. ఉదాహరణకు, ఇద్దరి వద్ద రెండు భారీ డిజిటల్ ఫైళ్లు ఉన్నాయని అనుకుందాం. ఆ రెండు ఫైళ్లు పూర్తిగా ఒకేలా ఉన్నాయా లేదా తెలుసుకోవాలంటే, సాధారణ కంప్యూటింగ్ పద్ధతిలో వారు పెద్ద మొత్తంలో సమాచారాన్ని ఒకరికొకరు పంపుకుని పోల్చుకోవాలి. ఫైళ్ల పరిమాణం పెరిగే కొద్దీ ఈ సమాచార మార్పిడి, అందుకు పట్టే సమయం కూడా భారీగా పెరుగుతాయి. అయితే క్వాంటం 'ఫింగర్‌ప్రింటింగ్' భిన్నంగా పనిచేస్తుంది. ప్రతి ఫైల్‌కు సంబంధించిన సమాచారాన్ని ఒక చిన్న క్వాంటం స్థితి రూపంలో సంకేతీకరిస్తుంది. ఈ విధానాన్నే 'క్వాంటం ఫింగర్‌ప్రింట్' అంటారు. ఆ తర్వాత ఈ చిన్న క్వాంటం సంకేతాలను పోల్చడం ద్వారా, అసలు ఫైళ్లను మొత్తం పంపకుండానే అవి ఒకటేనా కాదా అనే విషయాన్ని అత్యంత సమర్థంగా నిర్ధారించవచ్చు. కొన్ని నిర్దిష్ట సమస్యల్లో సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే ఘాతాంక (ఎక్స్‌పొనెన్షియల్) స్థాయిలో తక్కువ సమాచార మార్పిడి సరిపోవడం దీని మరో ప్రత్యేకత. అంటే, ఫైళ్ల పరిమాణం ఎంత పెరిగినా, అవసరమైన కమ్యూనికేషన్ అంత వేగంగా పెరగదు. ఇది క్వాంటం భౌతిక శాస్త్రం అందించే ప్రత్యేక లక్షణాల వల్ల సాధ్యమవుతుంది. ఇది క్వాంటం కంప్యూటింగ్ కేవలం సిద్ధాంతపరమైన భావన కాదని చూపించే ముఖ్యమైన ఉదాహరణగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కమ్యూనికేషన్‌లో ఎంత తక్కువ సమాచారంతో ఒక సమస్యను పరిష్కరించవచ్చో అనే ప్రాథమిక పరిమితులపై క్వాంటం సాంకేతికత కొత్త దృక్పథాన్ని అందిస్తోంది. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. క్వాంటం ఫింగర్‌ప్రింటింగ్ అన్ని రకాల గణనలను మెరుపు వేగంతో పూర్తి చేయదు. ఇది ప్రధానంగా సమాచారం పోల్చడం వంటి కొన్ని ప్రత్యేక కమ్యూనికేషన్ సమస్యల్లో మాత్రమే సాంప్రదాయ పద్ధతుల కంటే గణనీయమైన ప్రయోజనాన్ని అందిస్తుంది.



## శిలాజాలపై 'ఎఐ' విశ్లేషణ

కృత్రిమ మేధస్సు (ఎఐ) వివిధ రంగాల్లో తనదైన ముద్ర వేస్తున్నది. జీవ శాస్త్రంలోనూ పరిశీలనలు, విశ్లేషణలను కొనసాగిస్తున్నది. ఎఐని ఉపయోగించి దాదాపు 40 లక్షల శిలాజాల రికార్డును విశ్లేషించిన పరిశోధకులు, భూమి చరిత్రలోని కొన్ని భారీ జీవవినాశాలు గతంలో భావించినంత వేగంగా జరగకపోయి ఉండవచ్చని సూచిస్తున్నారు. భూమిపై జీవజాతుల చరిత్రలో ఐదు ప్రధాన సామూహిక వినాశాలు జరిగినట్లు శాస్త్రవేత్తలు చాలాకాలంగా అధ్యయనం చేస్తున్నారు. ఈ సంఘటనల్లో అనేక జీవజాతులు అంతరించిపోయాయి. వాతావరణ మార్పులు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, గ్రహశకలాల ఢీకొనడం వంటి కారణాలు కొన్ని ఘటనల్లో కీలక పాత్ర పోషించి ఉండవచ్చని భావిస్తున్నారు. ఇప్పుడు పరిశోధకులు భాషా నమూనాలను పోలిన కృత్రిమ మేధస్సు విధానాన్ని ఉపయోగించి, పదాల బదులు శిలాజాల సమాచారాన్ని విశ్లేషించారు. 'నేచర్' పత్రిక ప్రచురించిన తాజా కథనం ప్రకారం, ఈ విశ్లేషణ ఐదు ప్రధాన వినాశాల్లో మూడింటి గురించి ఉన్న సంప్రదాయ అవగాహనను ప్రశ్నిస్తోంది. కృత్రిమ మేధస్సు పెద్ద డేటాలో కనిపించని సంబంధాలను గుర్తించగలిగినా, దాని అంచనాలను భౌగోళిక ఆధారాలు, ప్రత్యక్ష శిలాజ పరిశీలనలతో పోల్చాల్సిందే. అయితే, ఎఐ విశ్లేషణలతో భూమిపై జీవం ఎలా మారిందో మరింత సూక్ష్మంగా అర్థం చేసుకోవచ్చు. గతంలో జీవవ్యవస్థలు పెద్ద పర్యావరణ మార్పులకు ఎలా స్పందించాయో తెలుసుకోవడం, నేటి జీవవైవిధ్య సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. అయితే ఈ పరిశోధన ఒక్కటే అన్ని వినాశాలపై తుది నిర్ణయం కాకపోయినప్పటికీ, మరింత లోతైన పరిశీలనకు దారితీసే కొత్త ఆధారాలను అందిస్తోంది.



### ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : సదానందం డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న నిరవధిక ధర్నా కార్యక్రమానికి శుక్రవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడుతూ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో వేలాది మంది ఉద్యోగులుఅనేక సంవత్సరాలుగా ప్రజలకు నిరంతరాయంగా వైద్య, ఆరోగ్యసేవలు అందిస్తూ ప్రభుత్వ ఆరోగ్యవ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ప్రజల ఆరోగ్య రక్షణ కోసం అంకితభావంతో సేవలందిస్తున్నారన్నారు. గ్రామీణ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ వైద్యఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సేవలు అత్యంత కీలకమైనవన్నారు. ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉద్యోగ భద్రత, క్రమబద్ధీకరణ, సమాన పనికి సమాన వేతనం, వేతన సవరణ, ఉద్యోగుల కుటుంబ భద్రత, ఇతర న్యాయమైన సేవా హక్కులు వంటి పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్, ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ కార్యదర్శి కొమ్ము కొమురయ్య, బుచ్చయ్య, సాయి ఆజాద్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




### అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి

ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విలాస్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్‌రూరల్ :** అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విలాస్ డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ జిల్లా డిభుక్తాపూర్ ఎఐటియుసి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా సమావేశంలో విలాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను క్రమబద్ధీకరించి, కనీస వేతనం రూ.26000 చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అద్దె, గ్యాస్, ఆరోగ్య లక్ష్మి బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు సిర్ర దేవేందర్, చంద్రకళ, ఛాయ, గాజంగుల రాజు తదితరులు పాల్గొన్నారు.



# మహిళాభ్యుదయమే లక్ష్యంగా కార్యాచరణ

33 శాతం రిజర్వేషన్ సాధించే వరకూ పోరాటం

మహిళా సమాఖ్య జాతీయ నాయకురాలు పశ్య పద్మ




**ప్రజాపక్షం/ఖమ్మం :** మహిళాభ్యుదయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జాతీయ నాయకురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. మారిన సామాజిక పరిస్థితుల్లోనూ మహిళల పట్ల వివక్ష కొనసాగుతుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరగనున్న నేపథ్యంలో సన్నాహక సమావేశం శుక్రవారం స్థానిక వాసిరెడ్డి కల్యాణ మండపంలో జరిగింది. మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పశ్య పద్మ మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య దేశంలో మహిళల హక్కుల కోసం, ఉపాధి కోసం, సంక్షేమం కోసం పోరాడుతుందన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలోనూ మహిళా సమాఖ్య కీలక భూమిక పోషించిందన్నారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బహుముఖ పోరాటాలు చేసిన ఘనత ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూకు దక్కుతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లను ఆమోదించిన అమలు చేసేందుకు కొర్రీలు పెడుతుందని పద్మ ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు సాధించేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. మోదీ ప్రభుత్వం మహిళల పట్ల గౌరవాన్ని ప్రదర్శిస్తూనే వంటింటికి పరిమితం చేసే పనిలో ఉందని, హిందూ ఛాందసవాదాన్ని మరల ప్రజల్లోకి తీసుకువచ్చి ప్రతి పనికి మతాన్ని చొప్పించి, మహిళలకు బంధనాలు ఏర్పాటు చేసే పనిలో ఉందని ఆమె ఆరోపించారు. మహిళ చైతన్యమే లక్ష్యంగా పనిచేయాలని ఆమె మహిళలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అనేక హామీలు ఇచ్చిందని అందులో ఉచిత బస్సు తప్పా, ఏ హామీని అమలు చేయలేదని ఆమె స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి, తులం బంగారంతో పాటు నెలకు రూ.2500 మహిళల ఖాతాల్లో జమ చేస్తామన్న ప్రభుత్వం ఎందుకు జమ చేయడం లేదని పద్మ ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అమలు కోసం మహిళా సమాఖ్య పోరాడుతుందన్నారు.

**డిసెంబర్‌లో రాష్ట్ర మహాసభలు**

తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర మహాసభలు డిసెంబర్ 27,28, 29 తేదీల్లో ఖమ్మంలో జరగనున్నాయి. పోరాటాల పురిటిగడ్డ ఖమ్మం నగరంలో రాష్ట్ర మహాసభలు జరగనున్న నేపథ్యంలో మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. సన్నాహక సమావేశంలో మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఉస్తేల సృజన, నెదునూరి జ్యోతి, రాష్ట్ర నాయకులు పోటు కళావతి, సదా లక్ష్మి, జయలక్ష్మి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు ఏపూరి లతాదేవి, మున్నా లక్ష్మికుమారి, సిపిఐ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, ఎస్‌కె సాబీర్‌పాషా, ఖమ్మంజిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మహిళా సమాఖ్య నిర్మాణ బాధ్యులు దొండపాటి రమేష్, మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు నల్లమోతు శైలజ, దండి శ్రీజ, మునిగడప లక్ష్మి, కాంగ్రెస్ నాయకురాలు గాదెల ఝాన్సీ, మునిగడపు పద్మ, బానోత్ కళావతి, శాంతిప్రియ, హరిత, సహరాబేగం పాల్గొన్నారు.




### హమాలీ కార్మికుల పనిభద్రత, ఇన్సూరెన్స్, పిఎఫ్
# సాధనకు ఉద్యమం

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య పిలుపు

**ప్రజాపక్షం/కరీంనగర్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సిమెంటు కంపెనీల గోదాములు, డీలర్ షాపులలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు పనిభద్రతతో పాటు ఇన్సూరెన్స్, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం సాధించడం కోసం హమాలీ కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. సిమెంట్ గోదాముల్లో, డీలర్ షాపుల్లో పనిచేస్తున్న హమాలీ కార్మికుల సమస్యలపై శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు జరిగింది. సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హమాలీ కార్మికులు హాజరయ్యారు. సదస్సుపకు ముఖ్య అతిథిగా హాజరై సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని సిమెంటు గోదాములు, డీలర్ షాపుల్లో వేలాది మంది కార్మికులు హమాలీ పని మీదనే ఆధారపడి జీవనోపాధి పొందుతూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. సిమెంటు కంపెనీలు కూలీ రేట్లు తగ్గించడానికి కుటిల ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఏజెంట్లకు నచ్చినట్లు పని చేయకపోతే ఇతర రాష్ట్రాల కూలీలతో పనులు చేయించుకుంటామని బెదిరింపులకు గురిచేస్తున్నారని సమ్మయ్య ఆరోపించారు. ప్రభుత్వం, కార్మిక శాఖ జోక్యం చేసుకొని పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కూలీ రేట్లను పెంచి ఇప్పించాలని, హమాలీ కార్మికులందరికీ ఇన్సూరెన్స్, పిఎఫ్, ఇఎస్ఐ, సౌకర్యం కల్పించాలని, రెండు సంవత్సరాలకు ఒకసారి కంపెనీ ఏజెంట్‌లు కార్మిక శాఖ ద్వారా కూలీ రేట్లను పెంచడానికి నూతన అగ్రిమెంట్లు చేసుకోవాలని సమ్మయ్య డిమాండ్ చేశారు. సదస్సులో వివిధ జిల్లాల ప్రతినిధులు జంగం తిరుపతి యాదవ్, నన్నవేని కొమరయ్య, బోరిగం రాజు, కేతుమల్ల వెంకటప్పయ్య, తోకరి వీరస్వామి, గంగుల అంజయ్య, లచ్చయ్య, బాగోతం వీరయ్య, బానోతు భాస్కర్, ముత్యాల శ్రీనివాస్, దానవేని కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# హక్కులు హరిస్తున్న మోదీ సర్కార్

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

**ప్రజాపక్షం/ఖమ్మం :** కార్మిక వర్గం అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను మోదీ సర్కార్ హరిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ వర్గాలకు వత్తాసు పలుకుతుందన్నారు. ఎఐటియుసి ఖమ్మం జిల్లా సమితి సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దండి సురేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులకు భంగం కలిగిస్తుందని, దీంతో సమ్మె హక్కుతో పాటు అనేక హక్కులను కార్మికులు కోల్పోతున్నారన్నారు. హక్కుల పరిరక్షణకు పోరాటమే మార్గమని ఆయన తెలిపారు. దేశంలో మునుపెన్నడు లేని స్థాయిలో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, అందుకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో శ్రమ దోపిడీ జరుగుతుందన్నారు. దీనికి తోడు ప్రభుత్వం నియామకాలను నిలిపివేసి అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ వ్యవస్థను ప్రోత్సహిస్తుందని సురేష్ ఆరోపించారు. కనీస వేతనం రూ.26వేలు ప్రతినెల ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ఇటీవల ఆర్‌టిసి గుర్తింపు ఎన్నికల్లో ధనంతో గెలవాలని చూసిన వారికి కార్మికులు సరైన రీతిలో సమాధానం చెప్పారన్నారు. ఎంప్లాయీస్ యూనియన్‌ను గెలిపించిన కార్మిక వర్గానికి సిపిఐ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని, రానున్న సింగరేణి గుర్తింపు ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, జిల్లా కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా నాయకులు గాదె లక్ష్మి నారాయణ, నిమ్మటూరి రామకృష్ణ, ఏనుగు గాంధీ, పగడాల మల్లేష్, సిహెచ్ సీతామహాలక్ష్మి, పిల్లి రమేష్, పేరబోయిన మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, మల్లేష్, శ్రీను, బోడా వీరన్న పాల్గొన్నారు.



## ఆరు నెలల్లో సాధించింది కేవలం
# రూ.92,013.18 కోట్లు మాత్రమే
### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వ మొత్తం రూ. 2,41,263.59 కోట్ల రెవెన్యూ రాబడిని లక్ష్యంగాపెట్టుకోగా, ఆరు నెలల్లో సాధించింది కేవలం రూ. 92,013.18 కోట్లు మాత్రమేనని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. రానున్న ఆరు నెలలకు కేవలం 23 శాతం అప్పుల పరిమితితో, 3.4 శాతం పెన్షన్ నిధులతో రాష్ట్రాన్ని ఎలా నడుపుతారో, ఉద్యోగులు,పింఛనుదారుల హక్కులను ఎలా కాపాడుతారో స్పష్టం చేస్తూ శాసన సభలో తక్షణమే సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఆరు నెలల కాలంలోనే తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేందనే విషయం కాగ్ విడుదాల చేసిన అధికారిక నివేదిక స్పష్టం చేస్తోందని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తన అసమర్థ పాలనతో, అడ్డగోలు అప్పులతో ఖజానాను ఖాళీ చేసి, రాజ్యాంగబద్ధ ఆడిట్ సంస్థలకే తప్పుడు లెక్కలు చెబుతూ రాష్ట్రాన్ని దివాళా అంచున నిలబెట్టారన్నారు. కొత్త ఆదాయ మార్గాలను వెతకకుండా, ఉన్న ఆస్తులను కరిగిస్తూ పోవడంతో తెలంగాణ భవిష్యత్తుకు తీరని నష్టం జరుగుతోందని, ఇప్పటికైనా రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభం వైపు నెట్టకుండా సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర బడ్జెట్ పచ్చి మోసమని, రూ.6,857 కోట్ల 'మిగులు' కాస్తా రూ.15,096కోట్ల 'లోటుగా ఉన్నదని వివరించారు. సెప్టెంబర్ నాటికి ప్రాథమిక లోటు రూ. 28,046.81 కోట్లకు (75.49 శాతం )చేరిందని, కొత్త అప్పులు తీసుకోకపోతే ప్రభుత్వం కనీస పరిపాలన కూడా చేయలేని దయనీయ స్థితికి చేరిందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రం చేయాల్సిన మొత్తం నికర అప్పుల పరిమితి రూ. 58,458.71 కోట్లు కాగా, ఆరు నెలల్లోనే ఏకంగారూ. 44,612.16 కోట్ల (76.31 శాతం)అప్పులను చేసిందని, అక్టోబర్ 2026 నుంచి మార్చి 2027 వరకు మిగిలిన రెండు త్రైమాసికాలకు గానూ మిగిలి ఉన్న అప్పుల పరిమితి కేవలం రూ. 13,846.55 కోట్లు (23.69 శాతం)మాత్రమేనని వివరించారు.

## 32వేల మంది ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఊరట
### బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు రూ.40.68 కోట్ల బకాయిల విడుదల: మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ.40.68 కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం ద్వారా విద్యనందిస్తున్న 225కుపైగా ప్రైవేటు పాఠశాలలకు ఆర్థికంగా ఊరట లభించనుంది. ఈ పథకం ద్వారా సుమారు 32 వేల మంది ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు ఇంగ్లిష్ మీడియం విద్యతోపాటు వసతి సౌకర్యాలను పొందుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో బకాయిల విడుదలకు చర్యలు చేపట్టగా, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపారు. పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, బకాయిల విడుదల ప్రక్రియను వేగవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ప్రధాన లక్ష్యం. పాఠశాలలకు బకాయిల విడుదలతో విద్య, వసతి సౌకర్యాల కల్పనలో అంతరాయాలు తగ్గడంతోపాటు, పథకం అమలుకు మరింత స్థిరత్వం చేకూరనుంది. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల విద్యా ప్రగతికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

## ఆర్‌టిసి ఎన్నికల అక్రమాలపై కార్మికుల సమరశంఖం
### ఈనెల 28న లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట మహాధర్నా : ఎంప్లాయీస్ యూనియన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి ఎన్నికల ఫలితాల వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (జెసిఎల్) కార్మిక సంఘాల కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను ఉల్లంఘిస్తూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారంటూ టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్(ఇయు) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. కార్మిక సంఘాల హక్కులను, ప్రజాస్వామ్య విలువలను విస్మరించే నిర్ణయాలను సహించేది లేదని స్పష్టం చేస్తూ, ఈనెల 28న (బుధవారం) మధ్యాహ్నం 3 గంటలకు లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఎన్నికల ఫలితాల విషయంలో జరిగిన పరిణామాలపై నిరసనను బలంగా వినిపించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్‌టిసి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని యూనియన్ నాయకత్వం పిలుపునిచ్చింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులు, మొదటి షిఫ్ట్ డ్యూటీలు ముగించుకున్న వారు, నైట్ అవుట్ సర్వీసుల నుంచి తిరిగి వచ్చిన ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై ఆందోళనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**కార్మిక ఐక్యతను చాటుదాం.. హక్కుల పరిరక్షణకు గళమెత్తుదాం..**

ఈ మహాధర్నాను విజయవంతం చేయడం ద్వారా కార్మికుల ఐక్యతను చాటాలని టిజిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న పిలుపునిచ్చారు.

## బిజెపి విధానాలపై పోరాటం ఉధృతం
### ఓటర్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి
### జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి: ఎ.విజయరాఘవన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాపోరాటాలను ఉధృతం చేస్తామని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్ ప్రకటించారు. నిత్యావసర ధరల పెరుగుదలతో ప్రజలు అల్లాడుతుంటే జిడిపి వృద్ధిపై కేంద్రం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమని విజయరాఘవన్ విమర్శించారు. హైదరాబాద్‌లోని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎ.విజయరాఘవన్, సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడారు. విజయరాఘవన్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాల నుంచి అర్హులైన వారి పేర్లను తొలగిస్తూ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిని తప్పుబడుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యువతపై అణచివేత పెరిగేకొద్దీ పోరాటాలు మరింత ఉధృతమవుతాయని హెచ్చరించారు. బివి రాఘవులు మాట్లాడుతూ దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్నది కేంద్ర పాలకులేనని విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నాలు తీవ్ర అభ్యంతకరకరమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిఆర్ఎస్ సహా ప్రతిపక్ష పార్టీలు కలిసి ఉద్యమించాలన్నారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు నివారణకు కేంద్రం రూ.50వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, ఉపాధి హామీ పనిదినాలను 200 రోజులకు పెంచాలని, రైతు భరోసా రెట్టింపు చేసి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్‌కు అభ్యర్థికి మద్దతు ఇచ్చే విషయాన్ని ఇప్పుడే స్పష్టం చేయలేం**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇచ్చే విషయాన్ని ఇప్పుడే స్పష్టం చేయలేమని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. కాంగ్రెస్‌కు సిపిఐ(ఎం) మద్దతుపై మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాల తరపున అభ్యర్థిని నిలబెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.

## కరువు, ఎల్ నినోను ఎదుర్కొనేందుకు
# ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ

### ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు
### 31వ తేదీ లోగా రాష్ట్రంలోని కరువు మండలాల ప్రకటన
### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగు నీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తీర్మానించింది. నియమిత గడువు అక్టోబర్ 31వ తేదీలోగా రాష్ట్రంలోని కరువు మండలాలను ప్రకటించడంతో పాటు, ఎల్‌నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిలపక్ష సమావేశం త్వరలో ఏర్పాటుచేయాలని కమిటీ నిర్ణయించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్‌నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి, కేబినెట్ సబ్‌కమిటీ ఛైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎల్‌నినో, కరువు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమనం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి సీతక్క అనసూయ, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సిఎస్ సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.

**కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించాలి :** సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ కరువు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా విశ్లేషించి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశంపై సిఫార్సులు సిద్ధం చేయాలన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండనుందో ముందుగానే అంచనా వేస్తే, ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రతివారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి చేపట్టిన చర్యలు, కరువు నివారణ చర్యలపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుత నీటి ఎద్దటి నేపథ్యంలో వరి వేయవద్దని, దీనికి ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని వ్యవసాయ, నీటి పారుదల శాఖలను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సాగు ప్రణాళికలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయరంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకుని, కరువు పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలిచే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ మండలాల్లో భూగర్భ జలాల మట్టం, వేసవి తీవ్రత తదితర అంశాలపై గణాంకాలను ప్రతీవారం నివేదికలను జిల్లాల్లో విడుదల చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవసరమైన సమాచారం చేరేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతీ జిల్లా కలెక్టర్లు, ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు అత్యవసర ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. ప్రస్తుత ఎల్‌నినో, కరువు పరిస్థితులతో రాష్ట్రంలో దాదాపు రూ.7,000 కోట్లతో కరువు పనులు చేపడుతున్నామని తెలిపారు.

**జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద ఒక కోటి రూపాయల విడుదల :** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ఇప్పటికే ప్రతీ జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద ఒక కోటి రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. వర్షపాతం తక్కువగా నమోదు, పంట విస్తీర్ణం 50శాతం కంటే తక్కువగా ఉండడం తదితర ప్రమాణాలను పరిగణనలో తీసుకుని 358 మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించమని తెలిపారు. నియమిత గడువైన ఈనెల 31వ తేదీ లోగా కేంద్ర ప్రభుత్వానికి కరువు మండలాల జాబితాను సమర్పిస్తామని తెలిపారు. మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో కనిష్ట వర్షపాతం నమోదుకాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయిందని తెలిపారు. 324 మండలాల్లో భూగర్భ జలాల మట్టం ఆందోళనకర స్థాయిలో ఉందని వివరించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో మొత్తం 470 టిఎంసిలకు గాను ప్రస్తుతం 170 టిఎంసిల జలాలు మాత్రమే ఉన్నాయన్నారు. సింగూరు జలాశయాన్ని తానూ స్వయంగా పరిశీలించానని, ఈ జలాశయంలో నీటి లేమితో ఏర్పడ్డ పరిస్థితులను అధిగమించడానికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందించామన్నారు.

## 'రాష్ట్ర జనవిశ్వాస్ బిల్లును' చట్టంగా రూపొందించడంతో
# మొదటి దశలో మిగిలిన సంస్కరణల పూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల 'రాష్ట్ర జనవిశ్వాస్ బిల్లును' చట్టంగా రూపొందించడంతో మొదటి దశలో మిగిలిన సంస్కరణలను పూర్తి చేశామని, 'డీరెగ్యులేషన్ అండ్ కంప్లయెన్స్ రిడక్షన్' కార్యక్రమంలో భాగంగా రెండో దశలో మొత్తం 28 ప్రాధాన్యతా అంశాలలో 12 ప్రాధాన్యత అంశాలను అమలు చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు తెలిపారు. మిగిలిన ప్రాధాన్యత అంశాలను నవంబర్ 15వ తేదీలోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 'నియంత్రణల సరళీకరణ' అమలులో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి సుకృతి లిఖితో కలిసి హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్‌జాజు మాట్లాడుతూ 28 ప్రాధాన్యత అంశాలలో 23 తప్పనిసరి సంస్కరణలు, ఐదు ఐచ్ఛిక సంస్కరణలు ఉన్నాయన్నారు. అనంతరం సుకృతి లిఖి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోందన్నారు. నియంత్రణ నిబంధనలను క్రమబద్ధీకరించడం, వ్యాపార సంస్థలు,పౌరులపై అనుసరణ భారాన్ని తగ్గించడమే 'డీరెగ్యులేషన్ అండ్ కంప్లయెన్స్ రిడక్షన్' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమం అమలులో తెలంగాణ సాధించిన ప్రగతిని ఆమె అభినందించారు. ఈ సమావేశంలో అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర, పర్యావరణం, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యార్, న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్యతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## సరాకా లేబొరేటరీస్ మూసివేతకు పిసిబి ఆదేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామంలోని సరాకా లేబొరేటరీస్ లిమిటెడ పరిశ్రమలో జరిగిన క్లోరోఫామ్ లీకేజీ ప్రమాద ఘటనపై తెలంగాణ కాలుష్య నియంత్ర మండలి చర్యలు చేపట్టింది. ఈ ఘటన నేపథ్యంలో శుక్రవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) అధికారులు పరిశ్రమను తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలను పరిశ్రమ జనరల్ మేనేజర్ మధు, డిప్యూటీ జనరల్ మేనేజర్ యోగేశ్వర్ రావు ల తెలుసుకున్నారు. గురువారం రాత్రి క్లోరోఫామ్ లీకేజీ జరిగిందని, ఆవిరికి గురైన ఇద్దరు వ్యక్తులు అపస్మారక స్థితికి చేరుకోవడంతో వారిని నారాయణ ఆసుపత్రికి తరలించగా, వైద్యుడు మృతి చెందినట్లు ప్రకటించారని వారు పిసిబి అధికారులకు వివరించారు. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్2లో, మొదటి అంతస్తులో ఉన్న రియాక్టర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌లోని రిసీవర్‌కు క్లోరోఫామ్ ను బదిలీ చేసే ప్రక్రియలో లేయర్ సెపరేషన్ జరుగుతున్న సమయంలో క్లోరోఫామ్ లీకేజీ జరిగినట్లు వారు వెల్లడించారు. లీకైన క్లోరోఫామ్ వేగంగా ఆ ప్రాంతమంతటా వ్యాపించినట్లు టిజిపిసిబి అధికారులకు తెలిపారు. ఈ ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సరాకా లేబొరేటరీస్ లిమిటెడ పరిశ్రమ మూసివేతకు ఉత్తర్వులు జారీ చేసింది.

## 'డోర్‌స్టెప్ సేవల'కు మంచి స్పందన
### నెల రోజుల్లో 3,885 కాల్స్ ..
### '1100' టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే చాలు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ సేవల కోసం మీ సేవా కేంద్రాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రజల ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలను అందించే డోర్‌స్టెప్ డెలివరీ విధానానికి మంచి స్పందన లభిస్తోంది. ఈ సేవలు ప్రారంభమైన తొలి నెలలోనే 1100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు 3,885 కాల్స్ రావడం విశేషం. ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ నమోదు, వివరాల నవీకరణ సేవలను సైతం ఇంటి వద్దే పొందే వెసులుబాటును తెలంగాణ ప్రభుత్వం కల్పించింది. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసే చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ప్రజలు ఈ సేవలను పొందేందుకు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చు. లేదా మీ సేవా పౌరుల పోర్టల్ ద్వారా తమకు అవసరమైన సేవ కోసం అభ్యర్థన నమోదు చేసుకోవచ్చు. అనంతరం సంబంధిత మీ సేవా ప్రతినిధి నిర్ణయించిన సమయంలో ఇంటికి వచ్చి, బుక్ చేసుకున్న సేవను అందిస్తారు. దీంతో మీ సేవా కేంద్రాలు, ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతోపాటు క్యూలలో వేచి ఉండే ఇబ్బందులు తప్పనున్నాయి.ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సేవలను ఇంటి వద్దే పొందవచ్చు. ఆధార్ నమోదు, ఆధార్ వివరాల నవీకరణకు సంబంధించిన సేవలు కూడా ఈ విధానంలో అందుబాటులో ఉంటాయి.

# పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం!
### 42 వేల క్వింటాళ్లు మాయం
### విజిలెన్స్ దాడుల్లో వెలుగు చూసిన వైనం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతోందా? ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం నిల్వల్లో భారీ వ్యత్యాసాలు చోటుచేసుకుంటున్నాయా? సిద్దిపేట జిల్లాలోని ఓ రైస్ మిల్లులో విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడిన లెక్కలు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. మోతే గ్రామంలోని భారత్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో భౌతిక తనిఖీలు నిర్వహించగా, రికార్డుల్లో ఉండాల్సిన నిల్వలతో పోలిస్తే ఏకంగా 42,784 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 1,06,962 బస్తాల మేర నిల్వల్లో వ్యత్యాసం బయటపడటంతో పంచనామా రూపొందించారు. ఈ వ్యవహారం రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమాలపై మరోసారి చర్చకు దారితీసింది. సిద్దిపేట జిల్లా అక్బర్‌పేటభూంపల్లి మండలం మోతే గ్రామంలోని భారత్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో విజిలెన్స్, స్థానిక అధికారుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. నిల్వలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా, 42,784 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు ఓ అధికారి వెల్లడించారు. దీనికి సంబంధించి పంచనామా తయారు చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇబ్రహీంపట్నంలోని ఓ రైస్ మిల్లులో విజిలెన్స్ టాస్క్‌ఫోర్స్ అధికారులు నిర్వహించిన విచారణ క్రమంలో మోతే గ్రామంలోని భారత్ ఇండస్ట్రీస్ వ్యవహారం వెలుగులోకి వచ్చినట్లు వీడియోలో పేర్కొన్నారు. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి విక్రయించారనే ఆరోపణలు ఈ వ్యవహారంలో ప్రస్తావనకు వచ్చాయి. మిల్లుపై గతంలోనూ కేసులు నమోదైనట్లు వీడియోలో వెల్లడించగా, యజమాని అందుబాటులో లేరని సమాచారం ఇచ్చారు. అయితే, బియ్యం నిల్వల్లో వ్యత్యాసానికి గల కారణాలు, బియ్యం ఎక్కడికి తరలించారనే అంశాలు అధికారిక దర్యాప్తులో తేలాల్సి ఉంది. ప్రభుత్వం పేదల కోసం కేటాయించే రేషన్ బియ్యం పక్కదారి పడితే అర్హులైన లబ్ధిదారులకు నష్టం వాటిల్లడమే కాకుండా, ప్రభుత్వ ఖజానాపైనా భారం పడుతుంది. మిల్లులకు అప్పగించిన ధాన్యం, తిరిగి అందించాల్సిన బియ్యం, నిల్వల రికార్డులు, విక్రయాలు, రవాణా వివరాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. నిల్వల్లో భారీ వ్యత్యాసాలు కనిపించినప్పుడు వాటికి బాధ్యులెవరో నిర్ధారించి, అక్రమాలు రుజువైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే లైసెన్సుల రద్దు సహా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా, భారత్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో గుర్తించిన 42,784 క్వింటాళ్ల బియ్యం నిల్వల వ్యత్యాసం వెనుక అసలు కారణాలేమిటి? బియ్యం నిజంగానే అక్రమంగా తరలించారా? ఇందులో ఎవరెవరి పాత్ర ఉంది? ప్రభుత్వానికి ఎంత మేర నష్టం వాటిల్లింది? అనే అంశాలపై అధికారుల దర్యాప్తు కీలకం కానుంది.



# గ్రామీణ క్రీడా ప్రతిభకు ఖేలో ఇండియా వేదిక
### డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జాతీయ స్థాయి పోటీలు
### మంత్రి వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించే క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ రూపొందిస్తోంది. డిసెంబర్ 11 నుంచి 22 వరకు రాష్ట్రంలో జరగనున్న ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం.. క్రీడాకారుల ఎంపిక నుంచి శిక్షణ, పోషకాహారం, స్టేడియాల సిద్ధత వరకు అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించింది. దేశం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేవలం క్రీడా పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా, తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 27 క్రీడాంశాలకు సంబంధించి ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించేందుకు దశలవారీ ఎంపిక ప్రక్రియ చేపట్టాలని మంత్రి సూచించారు. క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణ అందించడంతోపాటు పోషక విలువలు సమృద్ధిగా ఉన్న ఆహారాన్ని సమకూర్చాలని మంత్రి సూచించారు. అవసరమైన వైద్య సహాయం, వసతి, రవాణా సదుపాయాలను కల్పించేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. క్రీడాకారులు పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచేలా శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు అనువైన క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలను సకాలంలో సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి విభాగానికి నిర్దిష్ట బాధ్యతలు అప్పగించి, పనుల పురోగతిని సమీక్షించాలని సూచించారు. క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తూ, నిర్వహణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని అధికారులకు పిలుపునిచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి



**ప్రజాపక్షం/పాలకుర్తి :** ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని రక్త దానం చేయడం మరొకరికి ప్రాణదానం చేయడమేనని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ఉపయోగపడుతుందని జనగామ వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకోని వరంగల్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు శుక్రవారం మండల కేంద్రం లోని బషారత్ గార్డెన్ లో వర్ధన్నపేట సబ్ డివిజన్ పరిధిలో చేపట్టిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు కేవలం శాంతి భద్రతలను పరిరక్షించడమే కాదు సేవా కార్యక్రమాల్లోను ముందు వరసలో వుంటారని రక్తదానంపై వున్న అపోహలను నమ్మకుండా ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలని సూచించారు. పోలీసులు యువత రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఏసీపి అంబటి నర్సయ్య, పాలకుర్తి సీఐ భరత్, సుమన్, పాలకుర్తి దేవరుప్పుల ఎస్సై లు సృజన్ కుమార్, రాజు, పోగు శ్రీనివాస్, వెంకన్న, మహేందర్, పుల్లయ్య, శ్రీనివాస్, యాకస్వామి, విజయ తిరుమలగిరి, హరి ప్రసాద్ పాల్గోన్నారు.

## రైతు అనుమానాస్పద మృతి



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామంలో ఓ రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వ్యవసాయ బావి వద్ద తలకు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న రైతును ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు కవి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం కొడవటూరు గ్రామానికి చెందిన మినలాపురం సిద్దయ్య (60) ప్రతిరోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటల సమయంలో ఆలీంపూర్ రోడ్డులో ఉన్న తమ వ్యవసాయ బావి వద్దకు పాలు పితకడానికి వెళ్లాడు. ఉదయం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా, ఆయన ఫోన్ ఎత్తలేదు. దీంతో బంధువులను బావి వద్దకు వెళ్లి చూడాలని కోరారు. బంధువులు అక్కడికి వెళ్లి చూడగా సిద్దయ్య తలకు బలమైన గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే ఆయనను జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. గతంలోనూ సిద్దయ్య తలకు అనుమానాస్పద రీతిలో గాయాలు కావడంతో చికిత్స చేయించామని, ఇప్పుడు కూడా ఆయన మృతి అనుమానాస్పదంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఘటనాస్థలాన్ని నర్మెట సీఐ దేవేందర్ సందర్శించి వివరాలు సేకరించారు. సిద్దయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఆయుష్ విభాగంలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

**ప్రజాపక్షం/ములుగు:** జాతీయ ఆయూష్ మిషన్(ఎన్ఏఎం) కింద ములుగు జిల్లా ఆయుష్ విభాగంలో ఏడు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే సహదేవరావు తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో నియామక ప్రకటన విడుదల చేసినట్లు కమిటీ నోడల్ అధికారి డాక్టర్ సునీత శుక్రవారం వెల్లడించారు. మొత్తం ఏడు పోస్టుల్లో నాలుగు ఆయుష్ వైద్యాధికారులు, ఒక ఫార్మసిస్ట్, ఒక యోగా ప్రొఫెషనల్, ఒక సైకోసోషియల్ కౌన్సిలర్ పోస్టులు ఉన్నాయి. ఆయుష్ వైద్యాధికారులకు నెలకు రూ.40వేలు, ఫార్మసిస్ట్‌కు రూ.15వేలు, యోగా ప్రొఫెషనల్‌కు రూ.28వేలు పారితోషికం చెల్లిస్తారు. సైకోసోషియల్ కౌన్సిలర్‌కు ఒక్కో సందర్శనకు రూ.500 చొప్పున చెల్లించనున్నారు. ఏడాదికి కనీసం 200 సందర్శనలు చేయాల్సి ఉంటుంది. 2026 జులై 1 తేదీ నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుండి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకు వయో పరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. ఈ నెల 26 నుండి 31వ తేదీ వరకు ప్రభుత్వ పని దినాల్లో ఉదయంం 10.30 నుండి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యర్థులు ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఉన్న ఆయూష్ విభాగంలో దరఖాస్తులు సమర్పించాలి. దరఖాస్తు నమూనా, అర్హతలు, అవసరమైన ధృవపత్రాల వివరాలను ములుగు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందవచ్చు. నోటిఫికేషన్‌లో సూచించిన విధంగా స్వయంగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గడువు ముగిసిన తర్వాత అందిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోరు. ఇతర వివరాలకు ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ సునీతను 9908431655 నంబర్‌లో సంప్రదించవచ్చు.

## పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర కార్యవర్గంలో గూడూరుకు పెద్దపీట

8 మంది ఉపాధ్యాయులకు కీలక బాధ్యతలు




**ప్రజాపక్షం/గూడూరు:** ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్(పిఆర్‌టియు టిఎస్)రాష్ట్ర నూతన కార్యవర్గంలో గూడూరు మండలానికి సముచిత స్థానం దక్కింది. ఇటీవల నల్లొండ జిల్లా కేంద్రంలో ఘనంగా జరిగిన 6 వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశల్లో రాష్ట్ర అధ్యక్షులుగా సుంకరి భిక్షం గౌడ్ ప్రధాన కార్యదర్శిగా బట్టాపురం మధుసూదన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈక్రమంలో ప్రకటించిన రాష్ట్ర నూతన కమిటిలో గూడూరు మండలానికి చెందిన ఎనిమిది మంది ఉపాధ్యాయులకు వివిధ హోదాల్లో కీలక బాధ్యతలు అప్పగించారు.ఎన్నికైన వారిలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఆర్ లక్షపతి టి నమ్మళ్వార్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింత బాలయ్య దిడ్డి అనిల్ కుమార్ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు ఆర్ జయశ్రీ రాష్ట్ర కార్యదర్శి పోలేపల్లి సునీత ఉన్నారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వృత్తిధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తామని స్పష్టం చేశారు. ఒకే మండల కేంద్రం నుంచి ఏకంగా 8 మందికి రాష్ట్రస్థాయి పదవులు లభించడం పట్ల మండల ఉపాధ్యాయులు సంఘ బాధ్యులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# వరంగల్ అభివృద్ధికి సిఎం ప్రత్యేక చొరవ

రూ.382 కోట్లతో ఐదు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు

సిఎంకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపిన 'కుడా' చైర్‌పర్సన్ గుండు సుధారాణి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా, నగర అభివృద్ధికి రూ.382 కోట్ల అంచనా వ్యయంతో ఐదు కీలక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు కుడా కు మంజూరు చేయడం పట్ల కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కుడా, వరంగల్ ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.వరంగల్ చారిత్రక వైభవాన్ని కాపాడుతూ, ఆధునిక మౌలిక సదుపాయాలతో నగరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ అనుమతులు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. కుడా ఆధ్వర్యంలో వరంగల్ కోట కందకాల పునరుద్ధరణ, హనుమకొండ సెంట్రల్ ప్లాజా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ కమ్ కమర్షియల్ కాంప్లెక్స్, వేయి స్తంభాల గుడి పరిసరాల్లో అభివృద్ధి పనులు, మ్యూజికల్ గార్డెన్ ఏర్పాటు వంటి ప్రాజెక్టులు నగరానికి కొత్త రూపురేఖలను తీసుకురానున్నాయని తెలిపారు.



వీటితో పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా, వాణిజ్య కార్యకలాపాలు, స్థానిక ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ అభివృద్ధి ప్రాజెక్టుల నిధుల మంజూరికి సహకరించిన ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డికి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి, కుడా వైస్ చైర్‌పర్సన్‌కు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఐఏఎస్ కు గుండు సుధారాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం వల్ల నగర అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా సాధించగలమని పేర్కొన్నారు."వరంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చూపుతున్న ప్రత్యేక చొరవ నగర ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోంది. నగరానికి ఇచ్చిన హామీకి అనుగుణంగా కీలక ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయడం పట్ల వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని. ఈ ప్రాజెక్టులు సాకారమై వరంగల్ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకుంటూ, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన నగరంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నాను" అని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి తెలిపారు.

## 'సంఘ' మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

క్వింటాల్‌కు రూ.9,210 చెల్లింపు



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** మండలంలోని సంఘ పారాబాయిల్డ్ రైస్ మిల్లు ఆవరణలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి బి. మోహన్ ముఖ్య అతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ జనరల్ మేనేజర్ యం. రాం రెడ్డి పాల్గొన్నారు.అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రస్తుత మార్కెట్ ధర రూ.9,010 ఉండగా, సహకార బ్యాంకు నుండి అదనంగా రూ.200 బోనస్ కలిపి మొత్తం రూ.9,210 చొప్పున కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు, మిల్లు మేనేజర్ అభిలాష్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ప్రారంభించిన అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/వాజేడు:** సరిహద్దు రాష్ట్రాల నుండి వరి ధాన్యం అక్రమంగా తెలంగాణలోకి రాకుండా నియంత్రించేందుకు మండల పరిధిలోని చెరుకూరు వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్ పోస్ట్‌ను అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జీ రిబ్బన్ కట్ చెసి ప్రారంభించారు.ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలను అరికట్టడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వరి ధాన్యం అక్రమంగా తరలివచ్చే అవకాశాలను నియంత్రించేందుకు ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో ధాన్యం రవాణాపై నిరంతరం నిఘాఉంచి, నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించడంతో పాటు అక్రమ రవాణాకు పాల్పడే వారిపై తగన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా ఈ చెక్‌పోస్టు దోహదపటుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగి జిల్లా పౌరసరఫరాల అధికారి కృష్ణవేణి, డీటీ రాంసింగ్ ఇతర శాఖల అధికారులుపాల్గొన్నారు.

## తరిగొప్పుల జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల ఆకస్మిక తనిఖీ

కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** పాఠశాల పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, జిల్లాలోని తరిగొప్పుల మండల పరిధిలో గల జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించి, పాఠశాలలో విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన నిర్వహణ, తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పర్యవేక్షణ**

పాఠశాలలోని 8, 9, 10వ తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి, వారి చదువుపై ఆసక్తి, పాఠ్యాంశాలపై అవగాహనను పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులతో ఆంగ్ల పాఠ్యాంశాలను చదివించారు. విద్యార్థులు ఇంగ్లీష్‌ను ఎంత వరకు చదవగలుగుతున్నారో స్వయంగా పరిశీలించారు. విద్యార్థులందరికీ ఆంగ్ల పఠనంపై నిరంతరం అభ్యాసం చేయించాలని, ప్రతి విద్యార్థి చదవగలిగేలా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.

**పాఠశాల మౌలిక వసతులపై ఆరా:**



పాఠశాలలో అందుబాటులో ఉన్న మౌలిక వసతులను కలెక్టర్ పరిశీలించారు. ఎంఆర్‌సీ భవన నిర్మాణానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న ఫ్లోరింగ్ పనులు పూర్తి చేయాలని, గోడలు, గ్రిల్స్, షెడ్, తదితర పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలోని తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన స్క్రీన్లు అందుబాటులో ఉన్నాయా? అవి సరిగా పనిచేస్తున్నాయా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో బాస్కెట్ బాల్ కోర్టు ఏర్పాటు, దాని వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు.

**మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి**

పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును కలెక్టర్ పరిశీలించారు. బియ్యం నాణ్యతను తనిఖీ చేసి, ఈ రోజు ఏం కూర వండుతున్నారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, తాజా కూరగాయలతో భోజనం తయారు చేసి, అందించాలని సూచించారు. వంటశాల పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.

**పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

పాఠశాల ఆవరణలో పరిశుభ్రతను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాల ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. నీటి సంప్‌పై మూత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో ఉన్న విద్యుత్ స్తంభాలను గ్రౌండ్ వెలుపలికి మార్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సేవలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/వరంగల్:** జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును మెరుగుపరచడంతో పాటు చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రీస్కూల్ విద్య, మహిళా శిశు సంరక్షణ సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐసిడిఎస్ పరిధిలోని సిడిపివోలు, సూపర్‌వైజర్లు, జిల్లా సంక్షేమ అధికారితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు, ప్రీస్కూల్ విద్య, చిన్నారుల ఆరోగ్యం, మహిళలు, శిశువుల సంరక్షణ తదితర అంశాలపై సమీక్షించారు.సెప్టెంబర్ నెలలో సూపర్‌వైజర్లు నిర్వహించిన అంగన్‌వాడీ కేంద్రాల సందర్శనలను సమీక్షించిన కలెక్టర్, రాబోయే రెండు నెలల్లో జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని తప్పనిసరిగా సందర్శించి, లోపాలను గుర్తించి పనితీరును మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని సిడిపివోలను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లల హాజరును పెంచాలని, అంగన్‌వాడీ టీచర్లు ప్రీ స్కూల్ కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పిల్లలను కేంద్రాలకు తీసుకురావడంలో అంగన్‌వాడీ ఆయాలు చొరవ చూపాలని స్పష్టం చేశారు. జిల్లాలోని 447 స్నేహ క్లబ్‌లలో 4,000 మందికి పైగా కిశోర బాలికలు ఉన్న నేపథ్యంలో, సూపర్‌వైజర్లు ఆయా క్లబ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పిస్తూ, వారి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చిన్నారులకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు అందించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు క్షేత్రస్థాయిలో గృహ సందర్శనలు సమర్థవంతంగా నిర్వహించాలని, మహిళలు, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, సంరక్షణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటి లభ్యతను నిర్ధారించడంతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహార సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు.

## విఓ భవనాల నిర్మాణ పనులు వేగవంతం

కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ జిల్లా లోని ఆయా మండలాల్లోని గ్రామాలలో గ్రామ సమాఖ్య (విఒ) భవనాల నిర్మాణపనులను వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వీబీజీ రామ్ జీ, స్వచ్ఛ భారత్ మిషన్, వీవో భవనాల నిర్మాణ పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వీబీజీ రామ్ జీ పథకం అమలు తీరు, చేపట్టిన పనుల పురోగతి, వాటికి సంబంధించిన వివరాలను సమీక్షించారు. అదే విధంగా, స్వచ్ఛ భారత్ మిషన్ కింద గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న పారిశుధ్య కార్యక్రమాల పురోగతిని, గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు గ్రామ సమాఖ్యల (వీవో) భవనాల నిర్మాణ పనుల ప్రస్తుత స్థితిగతులు, అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సమాఖ్య భవనాల ఏర్పాటుకు సంబంధిత గ్రామపంచాయతీ తీర్మానం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో వీవో భవనం ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు కావాల్సిన జీపీ తీర్మానం, సరైన స్థలం గుర్తింపు, ప్రతిపాదనలను అందజేయాలన్నారు. వివిధ గ్రామాలలో ప్రారంభమైన వీవో భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షా సమావేశానిక్షి అదనపు కలెక్టర్ శేషాద్రి, మేన శ్రీను, లక్ష్మి రమాకాంత్, రాజ్ గోపాల్ రావు, అడిషనల్ డీఆర్‌డీఓ లక్ష్మి ప్రసన్న, పంచాయతీరాజ్ డీఈలు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్ ఏఈలు, ఏపీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా జనాభా లెక్కల ప్రక్రియ నిర్వహణ

కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** జిల్లాలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను సమగ్రంగా, పకడ్బందీగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో నిర్వహించిన జనాభా లెక్కల సేకరణ (సెన్సెస్) ఫేజ్ 2 శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, మాస్టర్ ట్రైనర్లకు, సూపర్ వైజర్లకు, ఎన్యుమరేటర్లకు జనాభా లెక్కల సేకరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో నిర్వహించిన హౌస్ లిస్టింగ్, ఫేజ్1 ప్రక్రియ విజయవంతంగా చేశారని అదే స్ఫూర్తితో సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. రాబోయే ఫేజ్2 జనాభా లెక్కల సేకరణ దేశానికి అత్యంత కీలకమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. జనగణన ద్వారా సేకరించే వివరాలు భవిష్యత్తు ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు ఎంతో ఉపయోగపడతాయని, ఈ ప్రక్రియను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ఈసారి జనాభా లెక్కల సేకరణలో డిజిటల్ విధానానికి ప్రాధాన్యత ఉంటుందని, మొబైల్ యాప్ ద్వారా వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, పాపులేషన్ ఎన్యుమరేటర్లు మాన్యువల్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ప్రతి ఇంటి వివరాలను నిబంధనల ప్రకారం ఖచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. జనగణన చట్టం1948 ప్రకారం సేకరించిన సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. సేకరించిన వివరాలను అనధికార వ్యక్తులతో పంచుకోకూడదని, సమాచార గోప్యతకు సంబంధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సుబ్బరాజు, సీపీఓ కిష్టయ్య, ఆర్డీఓ హరికృష్ణ, మాస్టర్ ట్రైనర్లు, వివిధ శాఖల అధికారులు, సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

## పోలీస్ ఓపెన్ హౌస్‌కు విద్యార్థులు క్యూ!

ఆయుధాల నుంచి సైబర్ నేరాల వరకు..

500 మంది విద్యార్థులకు పోలీసుల అవగాహన



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని పోలీస్ శాఖ పనితీరు, ఆయుధాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ విధులు, ఆయుధాల వినియోగం, సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్‌ప్రింట్ వ్యవస్థ, క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ పనితీరును అధికారులు విద్యార్థులకు వివరించారు. ఏకే47, ఎస్ఎల్ఆర్, కార్బైన్, 9 ఎంఎం పిస్టల్ తదితర ఆయుధాలను ప్రదర్శించి వాటి వినియోగం, ప్రత్యేకతలపై అవగాహన కల్పించారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే విధానం, కేసుల దర్యాప్తు ప్రక్రియ, అత్యవసర సమయాల్లో డయల్ 112 ద్వారా పోలీస్ సేవలు పొందే విధానాన్ని తెలియజేశారు.

**సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన:** ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనల పాటింపు, గంజాయి, ఇతర మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, మహిళలు, బాలికల భద్రత కోసం పనిచేస్తున్న షీ టీమ్స్, భరోసా కేంద్రం అందిస్తున్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ, ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను స్మరించుకుంటూ, వారి త్యాగస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్ రావు, సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## డిండికి 0.5 టిఎంసి

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న అంశాలన్నింటినీ ఈ సమావేశంలో చర్చించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సిఎం సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌజ్‌లు అమర్చాలి, ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా, లేదా ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనేది ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సిఎం ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సిఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు. నార్లాపూర్ నుంచి డిండికి నీటిని తీసుకోవాలా... ఏదుల నుంచి డిండికి నీటిని తీసుకోవాలనే విషయంలో మహబూబ్‌గర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది, ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని సిఎం వెల్లడించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే అవకాశాలను, 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సిఎంకు వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదంలేదని వివరించారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని అధికారులు వివరించారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకుని, సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సిఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో జరిగిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సిడబ్ల్యుసి కోరిన సమాచారాన్ని అందజేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను సిఎం ఆదేశించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, రాష్ట్ర వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సిఎం సూచించారు. సమావేశంలో సలహాదారు ఆదిత్యనాథ్, సిఎంఓ సెక్రెటరీ మాణిక్‌రాజ్‌తో పాటు సెక్రెటరీ (టన్నెల్) కల్నల్ పరీక్షిత్ మెహ్రతో పాటు ఇరిగేషన్ జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, అన్ని ప్రాజెక్టుల సిఈలు పాల్గొన్నారు.







## సిఇసి దిష్టిబొమ్మ దగ్ధం (మొదటి పేజీ తరువాయి)

డిఆర్‌ఓకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐకెఎంఎస్ రాష్ట్ర నాయకుడు మండారి డేవిడ్ కుమార్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, ఏఐపికెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, తెలంగాణ రైతాంగ సమితి జిల్లా కార్యదర్శి నల్లెడ మాధవరెడ్డి, ధనుంజయ నాయుడు, అనంతుల మల్లీశ్వరి, ఎల్లంల యాదగిరి, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్, దంతాల రాంబాబు, కొప్పోజు సూర్యనారాయణ, ఏక లక్ష్మి, కునుకుంట్ల సైదులు, దొడ్డ వెంకటయ్య పాల్గొన్నారు. హైదరాబాద్ నారాయణగూడ చౌరస్తాలో జ్ఞానేష్‌కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నశించాలని వారు నినదించారు. ప్రదర్శనకారులను ఉద్దేశించి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్) రాష్ట్ర కోశాధికారి డి.జి.నరేందర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలో పారదర్శకత పెంచేందుకు నియామక కమిటీలో క్యాబినెట్ మంత్రి స్థానంలో భారత ప్రధాన న్యాయమూర్తికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఎన్నికల కమిషనర్లకు విస్తృత చట్టపరమైన రక్షణ కల్పించే చట్టంలోని సెక్షన్ 16ను రద్దు చేయాలన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వారిపై ఢిల్లీ పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. ఓటర్ల జాబితా నుండి తొలగించినట్లు పేర్కొన్న 13.41 కోట్ల మంది పౌరులకు ఓటు హక్కును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్) కార్యదర్శి ఎం.ప్రభులింగం, మేడ్చల్ జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహులు, అధ్యక్షులు డి.జంగయ్య, తెలంగాణ రాష్ట్ర కౌలు రైతుల సంఘం కార్యవర్గ సభ్యులు సుభాన్ రెడ్డి, కౌన్సిల్ సభ్యులు సుధాకర్ గౌడ్, డి.పాపయ్య, బి.కిష్టయ్య, ఎఐకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఎఐకెఎంఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జెవి.

చలపతిరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎం.ధర్మానాయక్ (టిజిఎస్), అనూరాధ (ఐఎఫ్‌టియు) ప్రదీప్ (టియుసిఐ) తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్, బిఆర్ఎస్ కథ తెలంగాణలో ముగిసింది

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, ఆ పార్టీ రాజకీయ భవిష్యత్తు తెలంగాణలో ముగిసిపోయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. కెసిఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా మళ్లీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని కేటీఆర్ చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ముందుగా ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి పార్టీ కార్యకర్తలను కలవాలని, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తన బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. కెసిఆర్‌ను జాకీలు పెట్టి లేపే ప్రయత్నం చేసినా రాజకీయంగా ప్రయోజనం ఉండదని ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. పార్టీ పేరులో తెలంగాణను తొలగించడంతోనే బీఆర్ఎస్ ప్రజలకు దూరమైందని ఆరోపించారు. అసెంబ్లీ, పార్లమెంటు, ఉప ఎన్నికలు, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎదురైన ఫలితాలను ప్రస్తావిస్తూ, జిల్లా పరిషత్ ఎన్నికలపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.మరోవైపు సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో ఎర్రవల్లి ఫామ్ హౌస్ అసైన్డ్ భూములు, రంగనాయక సాగర్ ప్రాంతంలో భూముల వ్యవహారం, జన్వాడలో ఫామ్‌హౌస్ నిర్మాణం, స్టార్ హోటళ్లకు సంబంధించిన అంశాలపై విమర్శలు చేశారు. రంగనాయక సాగర్ నుంచి ఫామ్‌హౌస్‌కు నీటిని తరలించిన వ్యవహారంపై ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

## మాకు మద్దతివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, వి.ఎస్.బోస్, కలవేన శంకర్, బాలనర్సింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ, కాంగ్రెస్ పార్టీల మధ్య రాజకీయ సమన్వయం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు విషయమై సిపిఐతో ఆహ్లాదకరమైన వాతావరణంలో చర్చలు జరిగాయని ఆయన తెలిపారు. తమ అభ్యర్థులకు మద్దతునివ్వాలని సిపిఐని కోరినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో సిపిఐతో కలిసి ముందుకు కొనసాగుతున్నామని ఆయన తెలిపారు. 2023 శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ, టిజెఎస్ కలిసి పోటీ చేశామని, కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో సిపిఐది గణనీయమైన పాత్ర అని గుర్తు చేశారు. జాతీయ స్థాయిలో 'ఇండియా కూటమి'లో కూడా సిపిఐ భాగస్వామిగా ఉన్నదన్నారు.

**పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం : కూనంనేని సాంబశివరావు**

రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ చేసిన విజ్ఞప్తిపై ఈ నెల 25,26,27 తేదీలలో జరగనున్న సిపిఐ రాష్ట్ర సమితి, కార్యవర్గ, జిల్లా కార్యదర్శుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి కాంగ్రెస్ పార్టీతో సిపిఐ మిత్రపక్షంగా ఉన్నప్పటికీ, ప్రజా సమస్యల విషయంలో నిరంతరం మాట్లాడుతూనే ఉన్నామని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని అడగడం తమ హక్కు అని కూనంనేని సాంబశివరావు అన్నారు. గతంలో నల్లగొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతునిచ్చామని ఆయన గుర్తు చేశారు.

## ప్రకృతి ఒడిలో పక్షుల సందడి.. బొటానికల్ గార్డెన్‌లో బర్డ్ వాక్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగర జీవనంలోని ఉరుకులు పరుగులకు కాసేపు విరామమిచ్చి, ప్రకృతి ఒడిలో పక్షుల కిలకిలరావాలను ఆస్వాదించేందుకు హైదరాబాద్ బొటానికల్ గార్డెన్ వేదిక కానుంది. పక్షులను దగ్గరగా పరిశీలిస్తూ వాటి జీవనశైలిని తెలుసుకునే అవకాశం కల్పించేందుకు డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం ఉదయం బర్డ్ వాక్ నిర్వహించనున్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ కు సంబంధించిన హైదరాబాద్ బొటానికల్ గార్డెన్‌లో ఉదయం 6 గంటల నుంచి 9.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. పక్షులపై ఆసక్తి ఉన్నవారితోపాటు ప్రకృతి ప్రేమికులు, పక్షుల గురించి తెలుసుకోవాలనుకునే వారు ఇందులో పాల్గొనవచ్చు. ఉదయపు ఆహ్లాదకరమైన వాతావరణంలో గార్డెన్‌లో నడుస్తూ పక్షులను పరిశీలించడం ద్వారా ప్రకృతితో మమేకమయ్యే అవకాశం లభించనుంది. బర్డ్ వాక్‌లో పాల్గొనేవారు నడకకు అనువైన షూస్, సౌకర్యవంతమైన దుస్తులు ధరించాలని నిర్వాహకులు సూచించారు. వెంట నీళ్ల బాటిల్ తీసుకురావాలని, అందుబాటులో ఉంటే పక్షులను మరింత దగ్గరగా పరిశీలించేందుకు బైనాక్యులర్స్ లేదా కెమెరా తీసుకురావచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒక్కొక్కరికి రూ.450 రుసుము నిర్ణయించారు. ఇందులో అల్పాహారం కూడా కలిపి ఉంటుంది.




























Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com